





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★




మా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై తీర్పు

03


సంపుటి 09, సంచిక: 23 | శుక్రవారం | 19-12-2025 | మహబూబ్‌నగర్

Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00





ప్రజాపక్షం
శుక్రవారం, 19 డిసెంబరు

# కాంగ్రెస్‌కు పల్లెల బాసట

గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి నవ్యోత్సాహాన్ని అందించాయి. శాసనసభ ఎన్నికల నుంచి మొదలైన కాంగ్రెస్ జైత్రయాత్ర లోక్‌సభ ఎన్నికలు, ఉప ఎన్నికల మీదుగా పల్లెసీమలకు చేరింది. మొత్తం 12,728 గ్రామపంచాయతీలకు నోటిఫికేషన్ విడుదలవగా, కోర్టు స్టే, నామినేషన్‌లు దాఖలు కాకపోవడం తదితర కారణాలతో సుమారు 33 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు ఎన్నికలు నిర్వహించలేదు. రాష్ట్రంలో మూడు దశలుగా జరిగిన ఎన్నికల్లో బుధవారం తుదిదశ ఫలితాలు వెలువడే సరికి పల్లె రాజకీయ ముఖచిత్రం స్పష్టమైంది. నిజానికి ఈ ఎన్నికలు పార్టీ రహితంగా, రాజకీయ పార్టీల ఎన్నికల చిహ్నాలు లేకుండా జరుగుతాయి. పచ్చటి గ్రామాలలో రాజకీయ చిచ్చు రగిలి, గ్రామాభివృద్ధికి ఆటంకాలు కలగవొద్దనే సదుద్దేశ్యంతో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆచరణలో మాత్రం పల్లె ఎన్నికలు సైతం రాజకీయ రంగు పులుముకున్నవి. పేరుకే పార్టీలకు అతీతమైనప్పటికీ, ఆయా పార్టీలు తమ పార్టీ తరుపున అభ్యర్థులను బరిలో పెట్టి, వారికి మద్దతుగా ప్రచారం చేస్తాయి. దీంతో ఏ అభ్యర్థి ఏ పార్టీయో ఊరందరికీ తెలిసిందే. ఆ లెక్కన చూస్తే సర్పంచ్‌గా ఎన్నికైన వారిలో కాంగ్రెస్ పార్టీ మద్దతుదారుల సంఖ్య 7 వేలు దాటింది. దానికి ఆ పార్టీ రెబెల్స్‌ను కలుపుకుంటే 8వేలకు దగ్గరలో ఉంది. ప్రతిపక్ష బిఆర్‌ఎస్ సమర్థించిన వారి సంఖ్య అందులో సగం అంటే 3500లుగా తేలింది. రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయమని హోరెత్తించిన బిజెపి 700 సంఖ్య దరిదాపుల్లోనే నిలిచిపోయింది.

ఫలితాలను పరికిస్తే కాంగ్రెస్ పార్టీ సగానికిపైగా(65 శాతం) సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకొని స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించింది. రెండేళ్ళ కాంగ్రెస్ పరిపాలనకు గ్రామీణ తెలంగాణ ఆమోదముద్ర లభించినట్లయింది. అంతకుముందు పదేళ్ల క్రితం కింది స్థాయి వరకు నాటి అధికార పక్షం బిఆర్‌ఎస్ ఒలుచుకొని పోయిన గాయాలతో విలవిలలాడిన కాంగ్రెస్ పార్టీకి తాజా ఎన్నికల ఫలితాలు క్షేత్రస్థాయిలో జవసత్వాలు ఇచ్చాయి. పునాదిస్థాయి వరకు పదవులు దక్కడం ద్వారా పార్టీకి నిర్మాణాన్ని ఏర్పరిచాయి ఈ ఎన్నికలు. అన్నిటికి మించి ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తున్న ముఖ్యమంతి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని సుస్థిరపరచడమే కాకుండా, పార్టీలో, ప్రభుత్వంలో ఆయన పట్టును మరింత పెంచాయి. సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తరువాత అన్ని ఎన్నికల్లో గణనీయమైన విజయాలను నమోదు చేసుకుంటూ ముందుకు సాగుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో సగం స్థానాలు, ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయాలు, సికిందరాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికలో గెలుపు, అన్నిటికి మించి తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 51 శాతంతో ఘన విజయం సాధించింది హస్తం పార్టీ. ఆ వెలుతురులోనే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సైతం మంచి విజయాన్ని దక్కించుకుంది. ఒక దశలో గ్రామాలలో తీవ్ర వ్యతిరేకత ఉందని ప్రతిపక్షం చేసిన సోషల్ మీడియా ప్రచారం నిజమేమోననే సందేహాలను ఫలితాలు పటాపంచలు చేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 2 లక్షల రైతు రుణమాఫీ, రైతు భరోసా పెంపు, సన్నబియ్యంకు రూ.500 బోనస్, రేషన్ కార్డుపై ఉచితంగా సన్నబియ్యం వంటి సంక్షేమ పథకాలు సామాన్యులు గుర్తించారు. అందుకే గ్రామసీమలో ఓట్ల వర్షం కురిపించారు. ఈ ప్రభుత్వం మిగిలిన హామీలను కూడా అమలు చేస్తుందనే విశ్వాసం కలిగించటంతో పాటు, ప్రభుత్వంపై బాధ్యతను మోపిన ఫలితాలివి.

బిఆర్‌ఎస్ విషయానికి వస్తే మొత్తం పల్లెల్లో పావు వంతకు కొంచెం ఎక్కువ సర్పంచ్ స్థానాలను దక్కించుకుంది. ఇది మంచి విజయమే. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షానికి సముచిత స్థానముండాలనే ఓటరు మహాశయుని ఆకాంక్ష ఇందులో వ్యక్తమైంది. అయితే, కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ సర్పంచ్ సీట్లు రావడాన్ని గుర్తించ నిరాకరిస్తుంది బిఆర్‌ఎస్. పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ పార్టీ పతనానికి నాందీ పలికాయని బుకాయిస్తున్న బిఆర్‌ఎస్ ముఖ్య నేతల తీరు విడ్డూరంగా ఉంది. దశాబ్దకాలం అధికారాన్ని అనుభవించిన పార్టీ అతిశయోక్తీకరణ సహేతుకం కాదు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు దక్కక ప్రతిపక్ష పాత్రను బిజెపికి కోల్పోతుందేమోననే సందేహాలు ముప్పిరిగొన్నాయి. తదనుగుణంగా ఎంఎల్‌సి ఎన్నికల్లో పోటీ చేయకపోవడం, రెండు అసెంబ్లీ స్థానాలను కోల్పోవడంతో బిఆర్‌ఎస్ శ్రేణుల స్థయిర్యాన్ని దెబ్బతీసాయి. పంచాయతీ ఎన్నికల్లో ఆ పార్టీ రెండవ స్థానం దక్కించుకోవడమే కాకుండా, అన్ని జిల్లాల్లో క్యాడర్‌ను నిలుపుకున్న దాఖలాలు కనిపించాయి. గులాబీ పార్టీకిది సానుకూల పరిణామమే. ఆ పార్టీ ద్వితీయ స్థానానికి ప్రస్తుతానికి ఢోకాలేదని పల్లె ఓటరు తీర్పు చెబుతోంది.

తామే ప్రత్యామ్నాయమంటూ హడావుడి చేసిన బిజెపికి పంచాయతీ ఎన్నికల్లో ఆశాజనక ఫలితాలేమి కనిపించలేదు. లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు దక్కించుకోవడమే కాకుండా, గ్రాడ్యుయేట్ , టీచర్ ఎంఎల్‌సి సీట్లలో విజయం సాధించి జోరు మీదున్న ఆ పార్టీని గ్రామీణులు ఆదరించలేదు. బిజెపి పట్టణ ప్రాంత పార్టీనే అనే నానుడిని రుజువు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రానికి గుర్తెరిగే స్థాయిలో పెద్దగా చేసిందేమి లేదనే భావన బిజెపిపై ప్రజల్లో నెలకొంది. దానికి తోడు ఆ పార్టీ అంతర్గత విభేదాలతో, పాత, కొత్త నాయకుల మధ్య సమన్వయ లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఇటీవల తెలంగాణ బిజెపి ఎంపిలతో ఢిల్లీలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలొచ్చాయి. 1982లో పుట్టిన బిజెపికి, ఆ తరువాత వచ్చిన మొదటి ఎన్నికల్లో కేవలం రెండు చోట్ల విజయం దక్కిందని, అందులో గుజరాత్‌లోని ఒకటి, తెలంగాణలోని హన్మకొండ మరొకటని ఆయన గుర్తు చేశారు. ఇప్పుడు గుజరాత్‌లో బిజెపి ఎలాగుంది? తెలంగాణలో పరిస్థితి ఎలా ఉందని? ప్రశ్నించినట్లు వార్తలు వచ్చాయి. కేవలం మతాన్ని నమ్ముకొనే ఎన్నికల్లో విజయం సాధించాలనుకుంటే తెలంగాణలో సాధ్యం కాదని ఓటర్లు స్పష్టం చేశారు.

ఇక వామపక్షాల విషయానికొస్తే, సిపిఐ గతం కంటే ఈసారి తన సంఖ్యాబలాన్ని మెరుగుపరుచుకుంది. దాదాపు 90 సర్పంచ్ స్థానాలలో విజయబావుటాను ఎగురవేసింది. కాంగ్రెస్‌తో మిత్రపక్షంగా ఉన్నప్పటికీ, గెలిచిన అనేక చోట్ల ఆ పార్టీ వారే ప్రత్యర్థులుగా ఉన్నారు. అనేక స్థానాలలో సొంత బలం మీదనే గెలుపొందింది సిపిఐ. మరో వామపక్ష పార్టీ కొన్ని చోట్ల బిఆర్‌ఎస్ సహకారంతో పోటీ చేసిన సిపిఐ(ఎం) 80కిపైగా సీట్లలో, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ 16 చోట్ల విజయం సాధించినట్లు ఆ పార్టీలు ప్రకటించుకున్నాయి. రాశిపరంగా ఈ సంఖ్య తక్కువే. అయినప్పటికీ సర్పంచ్ ఎన్నికలకు ఒక అభ్యర్థి రూ.17 కోట్లు ఖర్చు చేశారని, ఒక చోట ఓటరుకు రూ.35వేలు చొప్పున పంచారు అనే వార్తల మధ్య ఇవి చీకట్లో చిరుదీపాలే. ధనం, మద్యం తీవ్ర ప్రభావంతో జరిగిన ఎన్నికల్లో వామపక్షాలు మిణుగురులా మిణుమిణుకుమంటూ మెరిసాయి.

# నియంత్రణ కోల్పోయిన ప్రజాస్వామ్యం

మన దేశంలో ప్రస్తుతం నెలకొన్న ఎన్నికల సంస్కరణల చర్చ ఒక బృహత్తర సందిగ్ధతకు దారితీస్తోంది. 'ఒకే దేశం—ఒకే ఎన్నిక' వంటి పరిపాల నా సంస్కరణలు ఒకవైపు; ఎన్నికల్లో క్రిమినల్ నేపథ్యం ఉన్నవారు, కార్పొరేట్ ధన బలం పెరుగుతున్న ఆధిపత్యంపై చట్టపరమైన చర్యల ఆవశ్యకత మరోవైపు ఈ రెండు కీలక అంశాలపై కేంద్రం తీసుకుంటున్న, తీసుకోవాల్సిన నిర్ణయాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రాంతీయ పార్టీలు, సామాన్య పౌరుల్లో తీవ్ర ఆందోళన, గందరగోళం నెలకొంది. కేంద్ర ప్రభుత్వం ముందుకు తెస్తున్న 'ఒకే దేశం—ఒకే ఎన్నిక' ప్రతిపాదనకు ప్రధానంగా వ్యతిరేకత వస్తున్నది దాని లక్ష్యం గురించి కాదు, అది అమలు చేయబోయే విధానంపైనే. దేశం యొక్క ఫెడరల్ నిర్మాణాన్ని, సమాఖ్య స్ఫూర్తిని ఈ సంస్కరణ ఏ విధంగా ప్రభావితం చేస్తుందనే విషయంలో రాష్ట్రాలు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలు పాలక పక్షంపై విశ్వాసం ఉంచలేకపోతున్నాయి. ఒకవైపు ఈ సంస్కరణను సమర్థవంతంగా అమలు చేయాలంటే రాజ్యాంగంలోని అధికరణ 368 ప్రకారం కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోద తీర్మానం తప్పనిసరి అని రాజ్యాం గ నిపుణులు వాదిస్తుండగా, కేంద్రం మాత్రం రాష్ట్రాల పాత్రను తగ్గించి, కేవలం పార్లమెంటరీ మార్గంలోనే ముందుకు వెళ్లాలని చూస్తుండడం గమనార్హం. దీనితో తమ హక్కులకు భంగం వాటిల్లే అవకాశం ఉందని, రాష్ట్రాల సమ్మతి లేని ఈ మార్పు నియంతృత్వ పోకడలకు దారి తీసే అవకాశం ఉందని విపక్ష పాలిత రాష్ట్రాలు భయపడుతున్నాయి. మరో వైపు, దేశ ఆర్థిక, సామాజిక విధానాలను శాసిస్తున్న మరో ప్రమాదం రాజకీయాల్లో క్రిమినల్, కార్పొరేట్ శక్తుల జోక్యం. క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులను ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించే విషయం లో కఠిన చట్టాలను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ, కేవలం శిక్ష పడిన వారికి మాత్రమే అనర్హత విధించే ప్రస్తుత చట్టాన్ని మార్చడంలో పాలక పక్షాల చిత్తశుద్ధిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

వీటితో పాటు, కార్పొరేట్ ధనబలం ప్రభావం కారణంగా దేశ ఆర్థిక విధానాలు కేవలం అగ్రశేణి కంపెనీలకు అనుకూలంగా మారుతున్నాయనే భావన మెజారిటీ పౌరుల్లో బలంగా ఉంది. అజ్ఞాత ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా నిధుల ప్రవాహంపై పూర్తి పారదర్శకత లేకపోవడం, మరియు కంపెనీల విరాళాలపై సరైన పరిమితులు లేకపోవడం వలన, సామాన్య ప్రజల సమస్యలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు దృష్టి సారించడం లేదనే ఆందోళన ఉంది. ఎన్నికల ప్రక్రియలో ధనబలం, క్రిమినల్ బలం రాజ్యమేలడం వలన, విధాన నిర్ణయాలు సామాన్య పౌరుడికి ప్రయోజనం చేకూర్చడానికి బదులుగా, కేవలం అగ్రశేణి వర్గాల ప్రయోజనాలను మాత్రమే పరిరక్షించే విధంగా వక్రీకరించబడుతున్నాయి. ప్రజలకు అనుకూలమైన చట్టాలు రూపొందించాల్సిన చట్టసభలు, తమ నేర నేపథ్యాన్ని దాచుకోవడానికి లేదా కార్పొరేట్ లాభాలను పెంచడానికి అనుకూలమైన చట్టాలను చేయడానికి ఉపయోగపడే వేదికలుగా మారితే, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల విశ్వాసం పూర్తిగా సన్నగిల్లుతుంది. సామాన్య పౌరుల నుంచి, క్షేత్రస్థాయి నుంచి వచ్చిన నాయకులకు చట్టసభల్లో స్థానం కల్పించడం ద్వారా మాత్రమే దేశ ఆర్థిక స్థితిగతులపై సరైన అధ్యయనం జరిగి, సమ్మిళిత అభివృద్ధికి మార్గం సుగమం అవుతుందని పౌర సమాజం గట్టిగా అభిప్రాయపడుతోంది. 'ఒకే దేశం ఒకే ఎన్నిక' అనే పరిపాలనాపరమైన చర్చకే పరిమితం కాకుండా, క్రిమినల్, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పటిష్టమైన చట్టాన్ని తీసుకురావడం ద్వారా దేశంలో నిజమైన రాజకీయ శుద్ధికి మార్గం సుగమం చేయాలనే ఒత్తిడి పెరుగుతోంది.

విబి

# పల్లెపై పట్టు బిగించిన రేవంత్ రెడ్డి !



ఎస్.కె.జకీర్

'పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ పార్టీ పతనం ప్రారంభమైంది అన్నారు. కాంగ్రెస్ పార్టీ రానున్న ప్రతి ఎన్నికల్లో మరింత పతనం కాక తప్పదు'' అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ డిసెంబర్ 17న అన్నారు. అలా అనకపోతే ఆశ్చర్యపోవాలి. అంటే ఆశ్చర్యమేముంది? గ్రామపంచాయతీలకు మూడు దశ ల్లో జరిగిన ఎన్నికల్లో 64 శాతానికి పైగా కాంగ్రెస్ పార్టీ గెల్చుకున్నది. 7093 పంచాయతీలను కాంగ్రెస్, 3488 పంచాయతీలను బిఆర్‌ఎస్, 699 బిజెపి, 90 సిపిఐ,75 సిపిఎం,1264 పంచాయితీలను ఇండిపెండెంట్ అభ్యర్థులు గెల్చుకున్నారు. వారిలో 80 శాతానికి పైగా తమ పార్టీ రెబెల్స్ ఉన్నట్టు కాంగ్రెస్ పార్టీ చెబుతున్నది. ఇక కాంగ్రెస్ పార్టీ పతనానికి సంబంధించిన సంకేతాలు ఎక్కడున్నాయో కెటిఆర్‌కు మాత్రమే తెలిసి ఉండాలి. 7093 పంచాయితీలు కాంగ్రెస్ కైవసం చేసుకోవడంతో ఆ పార్టీ పతనం ప్రారంభమైనట్లు ఎలా నిర్ధారణకు రాగలం.

ఏనాటికైనా తెలంగాణ ప్రజల పక్షాన నిలబడి కొట్లాడేది భారత రాష్ట్ర సమితినే. కాంగ్రెస్ పార్టీ అధికార దుర్వినియోగాన్ని, బల ప్రయోగాన్ని, హింసను ఎదుర్కొని భారీగా పంచాయతీలను మా పార్టీకి కట్టపెట్టారు. ఇది సామాన్య విజయం కాదు. చరిత్రలో నిలిచిపోయే పోరాటం అని కెటిఆర్ పేర్కొన్నారు. ''పంచాయతీ ఫలితాల తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయి. పంచాయతీ ఎన్నికలు అధికార పక్షానికి ఏకపక్షంగా ఉంటాయి. ముఖ్యమంత్రి కాలికి బలపం కట్టుకుని తిరిగినా, మంత్రులు మోహరించినా సగం సీట్లు సాధించడానికి కాంగ్రెస్ తంటాలు పడింది. అధికార పార్టీ ఇంత తక్కువ స్థానాలకు పరిమితం కావడం, ప్రధాన ప్రతిపక్షం ఇన్ని పంచాయతీలు గెలవడం చరిత్రలో లేదు. ఇది కాంగ్రెస్ పార్టీ మోసాలు, వైఫల్యాలపై తెలంగాణ పల్లె మోగించిన జంగ్ సైరన్ అని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నారు. 3488 గ్రామ పంచాయితీ లు బిఆర్‌ఎస్ గెల్చుకోవడంతో రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టడం ఏమిటో అర్థం కాదు.

కెటిఆర్ నియోజకవర్గం ఉన్న సిరిసిల్ల జిల్లాలో బిఆర్‌ఎస్ పార్టీ ఆధిక్యత సాధించింది. తొలి,మలి దశ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే. మూడో విడతకు వచ్చేసరికి బిఆర్‌ఎస్ ఎక్కువ సీట్లు గెలుచుకుంది. మూడో విడతలో బిఆర్‌ఎస్ ఎక్కువగా సీట్లు గెలుచుకున్న జిల్లాల్లో ఆదిలాబాద్, మెదక్, గద్వాల జిల్లాలున్నాయు. కెసిఆర్, హరీశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలో తొలి రెండు విడతల్లో బిఆర్‌ఎస్ ఆధిక్యాన్ని ప్రదర్శించింది. మూడో విడతలో మాత్రం కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. పంచాయతీ ఎన్నికలను సిఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులూ ఈ ఎన్నికలపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టి పనిచేశారు. పంచాయతీలు ఏకగ్రీవం కావడంలోనూ అభ్యర్థులకు అన్ని రకాలుగా సహకరించారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు సరిగా చేరాలంటే అధికార పార్టీ అభ్యర్థి గెలిస్తేనే మంచిదన్న ప్రచారం గ్రామాల్లో జోరుగా నడిచింది. అంతిమంగా కాంగ్రెస్ వ్యూహం ఫలించి అత్యధిక స్థానాలను దక్కించుకోగలిగింది. ఇటీవలి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, తాజాగా పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాలతో సిఎం రేవంత్ గ్రాఫ్ పెరిగి పోయింది.

అధికార కాంగ్రెస్ పార్టీ కంటే చాలా తక్కువ సీట్లే వచ్చినా పంచాయతీ ఎన్నికలు బిఆర్‌ఎస్‌కు ఊరటను కలిగించాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల నుంచి వరుసగా ఎన్నికల్లో ఓటమిపాలవుతూ వస్తున్న బిఆర్‌ఎస్‌కు ఉపశమనం లభించినట్లయింది. కెసిఆర్ కుటుంబ కలహాలు పరాకాష్టకు చేరుకున్న నేపథ్యంలోనూ పంచాయితీ ఫలితాలు ఆ పార్టీకి ఆత్మ విశ్వాసాన్ని నింపాయి. లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వచ్చి, ఉప ఎన్నికల్లో సిట్టింగ్ సీట్లూ కోల్పోయిన నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో 27.4 శాతం సీట్లను గెలుచుకోవడం గొప్ప విషయమే. క్షేత్రస్థాయిలో బిఆర్‌ఎస్ తన ఉనికిని చాటుకున్నట్టయింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధానంగా గ్రామీణ నియోజకవర్గాల్లోనే దెబ్బతిన్న బిఆర్‌ఎస్ పార్టీ ఆశించిన రీతిలో ఇంకా గ్రామాల్లో పుంజుకోలేదని పంచాయతీ ఎన్నికల ఫలితాలు నిరూపిస్తున్నాయి. బిజెపి..మూడు విడతల్లోనూ కలిపి 5.5శాతం సీట్లను దక్కించుకుంది.

సన్నబియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, మహిళల ఉచిత ప్రయాణం వంటి కార్యక్రమాలు ఇప్పటికే రేవంత్ రెడ్డి ఖాతాలో చేరిపోయాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్, బిజెపిలకు ఎలాంటి అస్త్రాలూ లేవు. నిరాయుధంగానే ఆ రెండు పార్టీలు రేవంత్‌తో తలపడినట్లు కనిపించింది. కాంగ్రెస్ ప్రభుత్వం పైనా, సిఎం.రేవంత్ రెడ్డి పైనా 'వ్యతిరేకత' ఉన్నట్టుగా కెసిఆర్ పార్టీ చేస్తున్న ప్రచారానికి ఎలాంటి మైలేజీ రాకపోగా చాలా ప్రాంతాల్లో పరిస్థితులు రివర్స్‌లో ఉన్నాయి. ఏమి చెప్పుకొని ప్రజల ఓట్లు అడగాలో బిఆర్‌ఎస్ పండితులకు తోచడం లేదు. రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా జరిపే ప్రచారమే తమ ప్రధాన ఆయుధంగా ఆ పార్టీ భావిస్తోంది. వాస్తవంగా చూస్తే అది వర్కవుట్ అయ్యేలా లేదు. పలు వ్యవహారాల్లో 'తప్పటడుగులు' వేస్తూ, నకిలీ ప్రచారం చేస్తూ, కోర్టులకు వెడుతున్న దృశ్యాలు చూస్తున్నాం. కెసిఆర్ పార్టీపై రేవంత్ రెడ్డి కనిపించని 'ముష్టిఘాతాలు' కురిపిస్తున్నారు. గాయాలు కనిపించడం లేదు కానీ నొప్పి భరింపరాకుండా ఉన్నది. బయటకు కక్కలేరు. లోపలికి మింగలేరు. రేవంత్ రెడ్డికి ఉన్న జనాకర్షణ, పార్టీ ఓటు బ్యాంకు, సంక్షేమ కార్యక్రమాల ఓటు బ్యాంకుతో పాటు, ఆయన ఎత్తుగడలు, వ్యూహరచన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం లభించడానికి కారణాలుగా విశ్లేషణలు వస్తున్నాయి.

''ఎవరైనా గొప్ప వ్యక్తి అడుగుజాడల్లో నడవవద్దు. అతన్ని అధిగమించాలంటే మీరు రెండింతలు కష్టపడాలి. పైగా ఎంత చెమటోడ్చినా చివరకు అనుకరణ అంటారు. గొప్ప పేరు సాధించడానికి కొత్త పుంతలు తొక్కాలి. అది అరుదైన నైపుణ్యం. మీరు ప్రత్యేక గుర్తింపు పొందాలంటే కొత్త దారుల్లో నడవండి. అదివరకు ఆ దారుల్లో ఎవరూ ప్రయాణించి ఉండకపోవచ్చు. అనువుగా లేకపోయినా కొత్త మార్గాలు అన్వేషించి వాటిలో ప్రయాణించడమే మేలు'' అని 1601 –1658 కాలానికి చెందిన తత్వవేత్త బాల్తస్టర్ గ్రేషియన్ అన్నాడు. సరిగా ఆయన చెప్పినట్టుగానే సాహసోపేతమైన, సంక్లిష్ట దారుల్లో ప్రయాణించడానికి సిద్ధపడినట్టుగా రేవంత్ రెడ్డి కార్యకలాపాలు కనిపిస్తున్నవి. ఫ్యూచర్ సిటీ, హైడ్రా,మూసీ ప్రాజెక్టులు, స్కిల్ యూనివర్సిటీ, ఉద్యోగాల భర్తీ వంటి నిర్ణయాలన్నీ తక్షణ ఫలితాలు ఇవ్వకపోవచ్చు. హైడ్రా వంటి అంశాల్లో వ్యతిరేకతను కూడా ఎదుర్కొన్నారు. అయినా ముఖ్యమంత్రి అడ్డంకులను లెక్కచేయకుండా ముందుకు వెడుతున్నట్టు ఆయన వైఖరి కనిపిస్తున్నది. అలాగే తెలంగాణ ప్రజలు దిగ్భ్రాంతికి గురయ్యేలా గ్లోబల్ సమ్మిట్ నిర్వహించి 6 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులపై ఒప్పందాలు చేసుకోవడం రేవంత్ సక్సెస్ గ్రాఫ్‌ను పెంచుతున్నది.




'స్కిల్ యూనివర్సిటీ', 'సామాజిక న్యాయం' ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చే అవకాశాలున్నట్టు పరిశీలకులు భావిస్తున్నారు. మొదట్లో హైడ్రా, మూసీ సుందరీకరణ, ఇతర అనేక విషయాలు తెరపైకి వచ్చినా 'కులగణన'తో ప్రతిపక్షాలను ఆత్మరక్షణలో పడవేశారు. ''మాజిక న్యాయం' ఆయన బ్రాండ్ అవుతుందని పరిశీలకులు అంటున్నారు. ఎందుకంటే ఇదేమి ఆషామాషీ వ్యవహారం కాదు. ఒక తేనె తుట్టెను కదిపి సంచలనం సృష్టించారు. రెడ్డి సామాజికవర్గ ముఖ్యమంత్రి ఇలాంటి ఎత్తుగడ వేస్తారని సహజంగా ఎవరూ ఊహించరు. కేంద్రమంత్రి బండి సంజయ్ ఆరోపిస్తున్నట్టు 'అర్బన్ నక్సల్స్' సలహాలు ఏవైనా రేవంత్ తీసుకుంటున్నారేమో మనకు తెలియదు. అయితే సామాజిక న్యాయం అన్నది ముమ్మాటికీ 'క్షిపణి'. ఇక 'స్కిల్ యూనివర్సిటీ' ఏర్పాటు సృజనాత్మక ఆలోచన. ఇది కార్యరూపం దాల్చితే, తప్పనిసరిగా దేశానికి రోల్ మోడల్ అయ్యే చాన్సు ఉన్నది. కొత్తగూడెంలో మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం రేవంత్ ఖాతాలో మరచిపోరానిది. తెలుగు రాష్ట్రాలలో ఎన్టీఆర్, చంద్రబాబు, వై.ఎస్, కెసిఆర్ తర్వాత ఆ స్థాయి బ్రాండ్ ఇమేజ్ కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ప్రజా నాయకుడిగా ఎన్టీఆర్, పాలనదక్షునిగా చంద్రబాబు, మాస్ లీడర్‌గా డాక్టర్ వైఎస్, తెలంగాణ నిర్మాతగా కెసిఆర్ గుర్తింపు పొందారు. ఎవరి ఇమేజ్ వారు సొంతం చేసుకున్నారు. ఎవరి పాలనా శైలి వారిదే. ఆ నలుగురిలో అందరూ బలశాలులే.

కెసిఆర్ హయాంలో లక్షలాది ఎకరాల భూములను నాటి అధికార పార్టీ నాయకుల అండదండలతో స్వాహా చేసిన ఆరోపణలు వెల్లువెత్తుతున్నవి. ఈ ఆరోపణలను బిఆర్‌ఎస్ బహిష్కృత నాయకురాలు కవిత గట్టిగా సమర్థిస్తున్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు జరిపిన అవినీతి, భూ దందాలన్నీ ఆమె బయటపెడుతున్నారు. కెసిఆర్ హయాంలో 'ధరణి' పేరిట జరిగిన లూటీ అంతులేనిది. ''చెరువుల భూముల కబ్జాదారులను వదిలేది లేదు. మా కుటుంబ సభ్యులైనా, సొంత పార్టీ వారైనా, విఐపిలయినా ఎఫ్.టి.ఎల్ లేదా బఫర్ జోన్‌లో కట్టడాలు నిర్మిస్తే కూల్చక తప్పదు'' అని హైడ్రా ఏర్పాటు ప్రకటన వేళ సి.ఎం.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ''భగవద్గీత స్ఫూర్తితో నేను ఈ కార్యక్రమానికి పూనుకున్నా'' అని కూడా సిఎం అన్నారు.

''బిఆర్‌ఎస్ పార్టీకి చరిత్ర ఉంది గానీ భవిష్యత్తు లేదు'' అని సిఎం రేవంత్ రెడ్డి ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. అయితే అందరూ ఊహించినట్టుగా బిఆర్‌ఎస్ పార్టీ ఓటమి షాక్ నుంచి తేరుకున్నట్టు కనిపిస్తోంది. ప్రజల్లో కెసిఆర్ హయాంలో అమలైన సంక్షేమ కార్యక్రమాలు బలంగా పాతుకుపోయాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి, అప్పులు, ప్రతి నెలా 6,500 కోట్ల వడ్డీ కింద చెల్లించవలసి రావడం... ఇవేవీ జనానికి అవసరం లేని విషయాలు. తమకు ఇదివరకు అందించిన పథకాలు తమకు రావలసిందేనన్నది జనం టాక్.

# విపక్షాల గొంతునొక్కి.. 'గాంధీ' పేరు తీసివేసి..



చాడ వెంకటరెడ్డి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు

విపక్షాల గొంతు నొక్కి పార్లమెంటులో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి బిల్లును ఆమోదింప చేసుకున్నది బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం. ప్రతిపక్షాల పట్ల ఎన్‌డిఎ ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని పార్లమెంట్ సాక్షిగా అద్దం పడుతున్నది. వామపక్షాలు, రైతు కూలి సంఘాలు పోరాటాలు చేసి ఆనాడు 2005 సంవత్సరంలో గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యుపిఎ 1 కాలంలో అమలు చేయడం జరిగింది. దీనివలన గ్రామీణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కూలీలకు కనీసం వంద రోజులు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉన్నది. ఈ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి 2009 సంవత్సరంలో జాతిపిత మహాత్మా గాంధీ పేరును పెట్టి చట్టం చేశారు. ఆనాటి నుండి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అని పిలవడం జరుగుతుంది.

బిజెపి మహాత్మా గాంధీ మీద ఉన్న కోపంతో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి వికసిత భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజివికా మిషన్ గ్రామీణ్ బిల్లును తీసుకురావడం జరిగింది. బిజెపి ప్రభుత్వంలో ఉన్న ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలు అందరూ మహాత్మా గాంధీ పేరు నచ్చని వారు కాదు. నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలను, మహాత్మా గాంధీ పట్ల ఉన్న వ్యతిరేకతను వారు ఖండించాల్సింది. ప్రభుత్వంలో ఉన్న భాగస్వామ్యులు ప్రజా ఉద్యమాల కోసం పోరాడుతున్న ప్రతిపక్షాల పట్ల కూడా ఆలోచన చేయాలి. మహాత్మా గాంధీ అంటే భారతదేశంలో అభిమానించేవారు ఉన్నారు. ఆయనను ఒక దేవుడులా కొలిచేవారు ఉన్నారు. ప్రపంచ దేశాలలో మహాత్మా గాంధీ పేరు తెలియని వారు లేరు. అయితే మహాత్మా గాంధీ పేరు చరిత్రలో నిలిచిపోవడం బిజెపికి ఇష్టంలేదు. మహాత్మా గాంధీని చంపిన గాడ్సేను కీర్తిస్తున్నారు.

ఈ పథకం కింద 15.99 కోట్లమంది దేశవ్యాప్తంగా ఉపాధి పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సరానికి రూ. 86,000 కోట్లు కేటాయించింది. 2014 సంవత్సరంలో, అప్పటి కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వం హయాంలో ఈ పథకానికి రూ.34వేల కోట్లు కేటాయించింది. 4.36 కోట్ల మంది గ్రామీణ కూలీలు పని చేశారు. పెరుగుతున్న దేశ ద్రవ్య సూచిక ప్రకారం ఇప్పుడు ఇంకా ఎక్కువ కేటాయించవలసి ఉండేది. అయితే కేటాయించిన నిధులు ఖర్చు చేయడం లేదనేది మరో వాదన. జనాభా పెరుగుదలకు అనుగుణం గా పథకానికి నిధులు కేటాయించకపోగా పనిముట్లు, వసతులలో కోతలు విధించారు.

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఈ చట్టంలో వంద రోజులు పని కల్పించినప్పుడు 90 శాతం ఖర్చు కేంద్ర భరించే విధంగా 10 శాతం ఖర్చు రాష్ట్ర ప్రభుత్వాలు భరించేదిగా ఉంది. పని కల్పించే రోజులను 125 రోజులు పెంచినట్టయితే అందులో కేంద్రం 60 శాతం ఖర్చు భరిస్తే రాష్ట్రాలు 40 శాతం భరించాలంట! అంటే, కేంద్రం ఈ పథకంపై ఖర్చులు పెట్టకుండా రాష్ట్రాలపై మోపే చర్యగా భావించవచ్చు. ఇప్పటికే గ్రామీణ ఉపాధి హామీ పథకం బిజెపి ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి అరకొర నిధులు కేటాయిస్తూ పథకాన్ని నీరుగారుస్తుంది. అసలు విషయం పేరు మార్చడం కాదు ఆ పథకాన్ని మార్చే పద్ధతులలో కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తుంది. అనేక రోడ్లు, రైల్వే స్టేషన్‌లు, వీధుల పేర్లు మార్చేశారు.

ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలో వివిధ కంపెనీలకు పారుబకాయల కింద మాఫీ చేసిన రుణాలు కంటే ఉపాధి హామీ పథకానికి కేటాయించిన నిధులు చాలా తక్కువ. మెజారిటీ ఉందని బిజెపి అహంభావంతో గ్రామీణ ప్రాంత పేద ప్రజల పొట్ట కొట్టవద్దు.

పని కల్పించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పు కోవడానికి కొత్త బిల్లును తెచ్చారు. వంద రోజుల నుండి 125 రోజులకు పని దినాలు పెంచుతున్నామంటూనే ఇప్పటివరకు 90 శాతం నిధులు ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను ఇవ్వాలని ప్రతిపాదించడం కేంద్రం తన బాధ్యతల నుండి తప్పు కోవడం తప్ప మరొకటి కాదు. గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములకు తలొగ్గి వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న కాలంలో 60 రోజులు పనిని పెట్టకుండా వాయిదా వేస్తామని ప్రతిపాదించడం జాబ్ కార్డు కలిగిన వ్యక్తి ఎప్పుడు పని అడిగిన ఇవ్వాలి అనే చట్టం మౌలిక డైరెక్షనకు తూట్లు పొడవటమే అవుతుంది. నిరుద్యోగ భృతి వేతనాలు చెల్లింపు ఆలస్యం అయితే రాష్ట్ర ప్రభుత్వా లదే బాధ్యత అని ప్రతిపాదించడం అత్యంత దుర్మార్గమైన విషయం. ఇప్పటికే సకాలంలో కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడం వలన గత సంవత్సరం చేసిన పనికి వేతనాలు రాక కూలీలు ఎదురు చూస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మాట వినలేదని పశ్చిమ బెంగాల్లో ఉపాధి హామీ పనిని పెట్టకుండా ఎత్తివేశారు.

డిజిటలైజేషన్, కేవైసీ అప్డేట్, ఆధార్ కార్డు బ్యాంకు ఎకౌంటు ఉపాధి జాబ్ కార్డు లింక్ పేరుతో బిజెపి ఏతర రాష్ట్రాలలో లక్షలాది మంది జాబు కార్డులను తొలగించారు. కోట్లాదిమంది పేదలను పనికి దూరంగా నెట్టారు. మెటీరియల్ కాంపోనెంట్ పేరుతో 22 శాతంగా ఉన్న నిధులను 49 శాతానికి పెంచి కాంట్రాక్టర్లకు పనులను అప్పగించారు. ఉన్న కొద్దిపాటి నిధులను కూడా పేదలకు దక్కకుండా గ్రామీణ ప్రాంత భూస్వాములు, కాంట్రాక్టర్లకు అప్పగించడం కోసం బిజెపి ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకొచ్చింది. తక్షణమే దీన్ని రద్దు చేయాలి.ప్రజాస్వామ్యవాదులు, ప్రగతిశీల శక్తులు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించే విధంగా కేంద్ర ప్రభుత్వం మెడలు వంచాలి

# సంచార్ సాథి యాప్ వివాదం..

కొత్త స్మార్ట్‌ఫోన్లలో సంచార్ సాథి అనే ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ యాప్ను తప్పనిసరిగా ప్రీ ఇన్‌స్టాల్ చేయాలనే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనక్కి వెళ్లింది. గోప్యతా భయం, ప్రభుత్వ నిఘా ఆందోళన, ప్రతిపక్ష వ్యతిరేకత టెక్ కంపెనీల అసంతృప్తిని ఎదుర్కొన్న తర్వాత ఈ అరుదైన విధాన మార్పు చోటుచేసుకుంది. సంచా ర్ సాథి యాప్ ఏమి చేస్తుంది అని స్మార్ట్ ఫోన్ వినియోగదారులు తెలుసుకోవాల్సిన విషయం. రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన సంచార్ సాథి, ప్రజల కోసం రూపొందించిన టెలికాం సెక్యూరిటీ యాప్‌గా ప్రభుత్వం పేర్కొంటుంది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ మొబైల్ ఫోన్లు పోయినప్పుడు లేదా దొంగిలించబడినప్పుడు ఐయంఇఐ ఆధారంగా ట్రాక్ చేసి బ్లాక్ చేయవచ్చు. తమ పేరుతో ఎన్ని మొబైల్ కనెక్షన్లు నమోదయ్యాయని తెలుసుకోవచ్చు, మోసపూరిత నంబర్లను గుర్తించి రద్దు చేయవచ్చు, అనుమానాస్పద కాల్స్‌ను రిపోర్ట్ చేయవచ్చు, అలాగే వాడిన ఫోన్లు కొనుగోలు చేసే ముందు అవి నిజమైనవేనా అని ధృవీకరించవచ్చు.

ఇప్పటివరకు ఈ యాప్ 1.4 కోట్ల సార్లు డౌన్‌లోడ్ చేయబడిందని, 42 లక్షలకుపైగా దొంగిలించబడిన ఫోన్లను బ్లాక్ చేయడంలో, 3 కోట్లకు పైగా మోసపూరిత మొబైల్ కనెక్షన్లు నిలిపివేయడంలో సహాయపడిందని ప్రభుత్వం చెబుతోంది. నవంబర్ 28న జారీ చేసిన ఆదేశం ప్రకారం ఆపిల్, శాంసంగ్, షియోమీ వంటి కంపెనీలు భారత్‌లో అమ్మే ప్రతి కొత్త ఫోనులో ఈ యాప్‌ను తప్పనిసరిగా ప్రీఇన్‌స్టాల్ చేయాలి. ఈ యాప్ మొదటిసారిగా ఫోన్ ఆన్ చేసేటప్పుడు కనిపించాలి, పనిచేయాలి, మరియు వినియోగదారులు దీన్ని తొలగించు లేనట్లుగా ఉండాలని ఆదేశించింది. ఇప్పటికే తయారైన ఫోన్లకూ సాఫ్ట్‌వేర్ అప్ డేట్ల ద్వారా యాప్‌ను చేరవేయాలని సూచించారు.




ఐయంఇఐ టాంపరింగ్ పెరుగుతుండటం తో నేరస్థుల గుర్తింపు కష్టమవుతుందని ప్రభుత్వం ఈ నిర్ణయా న్ని సమర్థించింది ఈ ఆదేశాలు వివాదాస్పదంగా తయారయ్యాయి. ఈ ఆదేశం బహిర్గతం కావడంతో గోప్యతా నిపుణులు, సివిల్ సొసైటీ సంస్థలు, ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా స్పందించాయి.


ఐటి నిపుణులు ఇది నిఘాకు మార్గం సుగమం చేస్తుందని హెచ్చరించారు. ఆపిల్ గోప్యతా సమస్యల కారణంగా ఈ ఆదేశానికి అనుగుణంగా వ్యవహరించబోమని సంకేతాలు ఇచ్చింది. ఇదే సమయంలో కొత్త టెలికాం సైబర్ సెక్యూరి టీ నిబంధనల కింద వాట్సాప్ వంటి ప్లాట్ ఫార్మ్‌లపై కొత్త పరిమితుల కారణంగా ప్రభుత్వం మరింత విమర్శలను ఎదుర్కొంటోంది. ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్ వంటి సంస్థలు ఈ ఆదేశాన్ని పారదర్శకతలేని, అధిక జోక్యంతో కూడిన చర్యగా పేర్కొన్నాయి. ఆందోళనలు తీవ్రమవుతున్న నేపథ్యంలో కమ్యూనికేషన్స్ మంత్రి జ్యోతిరాధిత్య సింధియా పార్లమెంటులో మాట్లాడుతూ స్నూపింగ్ అసాధ్యం, ఎప్పటికీ జరగదు అని అన్నారు.

యాప్ ప్రజలను సైబర్ మోసాల నుంచి రక్షించడానికి ఉద్దేశించబడిందని ఆయన తెలిపారు. ప్రజల అభిప్రాయం మేరకు నిర్ణయాన్ని పునర్ విమర్శించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సూచించారు. బుధవారం సాయంత్రానికి డిఓటి ఆదేశాన్ని అధికారికంగా వెనక్కి తీసుకుంది. స్వచ్ఛందంగా యాప్ డౌన్లోడ్లు ఒక్కరోజులోనే 6 లక్షలకు పెరగడంతో బలవంతపు ప్రీలోడ్ అవసరం లేదని డిఓటి పేర్కొంది.

ఇదే సమయంలో భారత నియంత్రణ వ్యవస్థలో అనిశ్చితి పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత ఏడాది ల్యాప్టాప్ దిగుమతుల లైసెన్సింగ్ విధానాన్ని పరిశ్రమ వ్యతిరేకత నేపథ్యంలో ప్రభుత్వం ఉపసంహరించుకోవడం తరువాత ఇది రెండవ ప్రధాన అంశం వెనక్కి వెళ్లడం. ప్రభావం పై సరైన విశ్లేషణ లేకుండా ఈ విధమైన నిర్ణయా లు తీసుకోవడం ఆందోళనకరమని నిపుణులు చెబుతున్నారు. ప్రీఇన్స్టాలేషన్ ఆదేశం ఉపసంహరించుకున్నప్పటి కీ, కొత్త టెలికాం సైబర్ సెక్యూరిటీ నిబంధనల కింద డిఓటి అధికారాల పరిమితి, ఎఐ అండ్ డిజిటల్ ఇంటెలిజెన్స్ యూనిట్ పాత్ర, మరియు భద్రతగోప్యత మధ్య సమతుల్యత వంటి సమస్యలపై చర్చ కొనసాగుతోంది.

సంచార్ సాథి వివాదం, పౌరుల ఫోన్లలో తప్పనిసరి ప్రభుత్వ యాప్‌లపై ప్రజల ప్రతిఘటనకు ఒక ముఖ్య ఉదాహరణగా నిలిచింది. ఈ వివాదం ఇక్కడితో ముగిసిందా అన్న ఆలోచన వినియోగదారులను ఇంకా సంకోచస్థితికి చేరుస్తోంది.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130


ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

కార్మిక ఆధారిత ఎగుమతులపై సుంకాలు రద్దు 05

విపక్షాల గొంతునొక్కి.. 'గాంధీ' పేరు తీసివేసి.. 02

సంపుటి 09, సంచిక: 23 | శుక్రవారం | 19-12-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## ఉపాధికి పాతర

- 'విబి జి రామ్ జి' బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ప్రతిపక్ష ఎంపిల నుంచి తీవ్ర నిరసన
- సభలో గందరగోళం
- కొత్త బిల్లు ప్రతులను చించేసిన సభ్యులు
- స్పీకర్ వెల్ వద్ద బైఠాయింపు
- మూజువాణి ఓటుతో బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటన



**న్యూఢిల్లీ:** ప్రతిపక్షాలు ముక్త కంఠంతో వ్యతిరేకించినప్పటికీ కేంద్రంలోని మోదీసర్కారు ఉపాధిహామీ చట్టానికి పాతరేసింది. ప్రతిపక్షాల భారీ నిరసనలు, నినాదాల మధ్య గ్రామీణ పేదలకు ఆసరాగా నిలిచిన 'మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం' స్థానంలో తీసుకొచ్చిన 'వికసిత్ భారత్ జి రామ్ జి' బిల్లు – 2025ను లోక్‌సభలో ఆమోదింపచేసుకుంది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన మధ్య స్పీకర్ మూజువాణి ఓటింగ్ నిర్వహించి... బిల్లుకు ఆమోదం లభించిందని ప్రకటించారు. ఈ సమయంలో ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'విబి జి రామ్ జి' బిల్లు ప్రతులను చించి గాల్లోకి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి పంపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. అయితే, ఇప్పటికే దీనిపై సుదీర్ఘ చర్చ జరిగిందని స్పీకర్ ఓం బిర్లా పేర్కొనడంతో ప్రతిపక్ష ఎంపిలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే వెల్‌లోకి దూసుకెళ్లి.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ బిల్లు కాపీలను చింపి గాలిలోకి విసిరారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఓం బిర్లా.. కాగితాలు చింపడానికి ప్రజలు ఓట్లు వేసి గెలిపించి ఇక్కడికి పంపించలేదని ఎంపిలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లోక్‌సభలో ఏం జరుగుతోందో దేశ ప్రజలు గమనిస్తున్నారని మందలించారు. అనంతరం గందరగోళం మధ్యే వికసిత్ భారత్ జి రామ్ జి బిల్లుకు ఆమోదం లభించింది. కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, డిఎంకె నేత టిఆర్ బాలు, ఎస్‌పి ఎంపి తరువాయి 6లో

## మా ప్రభుత్వ రెండేళ్ల పాలనపై తీర్పు

మూడింట రెండవ వంతు మెజారిటీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది

### 2029 ఎన్నికల్లోనూ ఇవే పునరావృతం

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయబావుటాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హర్షం



- బిఆర్‌ఎస్ కోరుకుంటున్నట్లే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే అద్భుతం జరగనుంది
- ప్రతిపక్ష నేతలకు ఇంకా అహంకారం తగ్గలేదు.. ఇప్పటికైనా ప్రజాతీర్పును గౌరవించాలి
- గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి శాసనసభలో చర్చించేందుకు సిద్ధం
- మీడియా సమావేశంలో మంత్రులతో కలిసి సిఎం ఉద్ఘాటన

**అసెంబ్లీలో చర్చించి స్థానికం, మున్సిపల్‌పై ముందుకెళ్తాం**

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని, 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతమవుతాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. ''గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలను చూసి బిఆర్‌ఎస్ నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం. బిఆర్‌ఎస్ కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. మూడింట రెండవ వంతు మెజారిటీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. మూడింట ఒకటవ వంతు బిఆర్‌ఎస్ ఉండగా, మూడింట రెండవ వంతు మెజారిటీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో తరువాయి 6లో

సాహెబ్‌నగర్ – గుర్రంగూడ

## అటవీ భూమిపై రాష్ట్రానికే హక్కు

సుప్రీంకోర్టు సంచలన తీర్పు రూ.15 వేల కోట్ల విలువైన భూమిని కాపాడిన వైనం



ప్రజాపక్షం/హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా సాహెబ్‌నగర్ కలాన్ గ్రామ పరిధిలోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించిన కీలక కేసులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఊరటనిచ్చింది. ఈ భూమిపై తరువాయి 12లో

## సుక్మాలో ఎన్‌కౌంటర్

**ముగ్గురు మావోయిస్టుల మృతి**

**చింతూరు:** చత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరోసారి తుపాకుల మోత మోగింది. భద్రతా దళాల కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మతి చెందారు. మృతుల్లో మహిళ ఉన్నారు. మరికొందరు మావోయిస్టులు గాయపడినట్టు తెలుస్తోంది. భద్రతాదళాలు, మావోయిస్టుల మధ్య గురువారం ఎదురుకాల్పులు జరిగాయి. గొల్లపల్లి అటవీప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ తరువాయి 6లో

## సేవకుడిగా ఉండండి

- అప్పుడే సివిల్ సర్వీసెస్ హోదాకు న్యాయం
- నిజాయితీతో సేవచేస్తూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి
- శిక్షణ పూర్తిచేసుకున్న సివిల్ సర్వీసెస్ అధికారులకు ఉపముఖ్యమంత్రి భట్టి సూచన
- పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్‌గవర్నెన్స్' : మంత్రి శ్రీధర్ బాబు



ప్రజాపక్షం/హైదరాబాద్

అధికారిగానే కాకుండా ప్రజా సేవకుడిగా మన్నలను పొందినప్పుడే సివిల్ సర్వీసెస్ హోదాకు న్యాయం చేసినవారిగా గుర్తింపు పొందుతారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మానవత్వంతో వ్యవహరిస్తూ .. నిజాయితీతో సేవ చేస్తూ ధైర్యంగా నిర్ణయాలు తీసుకుని నాయకత్వంతో తరువాయి 12లో

## పుస్తకాల పండుగొచ్చింది

- నేడు ప్రారంభించనున్న మంత్రి జూపల్లి
- 368 స్టాళ్ల ఏర్పాటు
- విద్యార్థులకు ఉచిత ప్రవేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద గల ఎన్‌టిఆర్ స్టేడియంలో బుక్ ఫెయిర్ (పుస్తకాల పండుగ) ప్రాంగణం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి 38 హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను నేడు ప్రారంభిస్తారని బుక్ ఫెయిర్ సొసైటీ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు గురువారం ఎన్‌టిఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ అధ్యక్షులు కవి యాకూబ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి.శోభన్ బాబు, కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు కె. సూరిబాబు, పి.నారాయణ రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి మాట్లాడారు. నేటి నుంచి ఈ నెల 29వ తేదీ వరకు తరువాయి 12లో





## కాంగ్రెస్ ర్యాలీ ఉద్రిక్తం

ప్రజాపక్షం /హైదరాబాద్

న్యాయం గెలివడానికి సమయం పట్టొచ్చు. కానీ చివరికి గెలిచేది న్యాయమే గెలుస్తుందని టిపిసిసి అధ్యక్షులు బి. మహేశ్ కుమార్, ఎఐసిసి రాష్ట్ర ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఇడి తప్పుడు కేసులను పెట్టిందని దీనిని నిరసిస్తూ దేశ వ్యాప్తంగా బిజెపి కార్యాలయాల ముందు నిరసన వ్యక్తం చేయాలన్న ఎఐసిసి పిలుపు మేరకు గురువారం గాంధీభవన్ నుంచి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తో పాటు వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, తరువాయి 12లో

## ఓటు ధర ఘనం



- పంచాయతీ ఎన్నికల్లో విచ్చలవిడి ఖర్చు
- పంపిణీపై పట్టింపులేని అధికారులు
- గెలుపొచ్చింది.. మరి ఖర్చు సంగతి ఏమిటంటూ సందిగ్ధంలో కొత్త సర్పంచ్‌లు

ప్రజాపక్షం/ఖమ్మం

పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని ఓటు ధర గణనీయంగా పెరిగింది. ఎంతగా పెరిగిందంటే సామాన్యుడే కాదు ఎగువ మధ్యతరగతి ప్రజలు సైతం ఎన్నికలకు దూరం జరగాల్సిన పరిస్థితి దాపురించింది. లక్షల్లో ఖర్చు చేస్తే తప్ప బరిలో నిలవని పరిస్థితి. ఇక ఓట్ల విషయానికి వస్తే ఆర్థిక సూత్రం పల్లెల్లో బాగా పనిచేసింది. డిమాండ్‌ను బట్టి ఓటు ధర అమాంతంగా పెరగడంతో పాటు ఎంతో కొంత చెల్లింపు లేకుండా పోలైన ఓట్ల శాతం అతి స్వల్పం. మూడు దశాబ్దాలుగా ఓటు అంగడి సరుకుగా మారుతూ వచ్చి ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల పుణ్యమా అని దాదాపు గరిష్ట ధరకు చేరింది. ఇందులో ఏ పార్టీకి చెందని తటస్థ ఓట్ల ధర తరువాయి 6లో





# జనరల్
STATE & REGIONAL NEWS

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే పంచాయతీలు నిర్వీర్యం

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకపోవడం ప్రభుత్వ అసమర్థత అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పంచాయతీ ఎన్నికలను ఆలస్యం చేయడంతో గ్రామ పంచాయతీలు నిర్వీర్యమయ్యాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ పనితీరు బాగుంటే ప్రజలు బ్రహ్మరథం పడతారని, కానీ ప్రజలు ప్రభుత్వం పట్ల తీవ్ర అసహనం, అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఓటు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని నిరంజన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
అధికార పార్టీ ఎన్ని అరాచకాలకు, దౌర్జన్యాలకు, ప్రలోభాలకు, మాయమాటలకు పాల్పడినప్పటికీ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, బిఆర్ఎస్ ఎక్కడుందని, పార్టీని బొందపెట్టామని చెప్పిన వారికి బిఆర్ఎస్ విజయం చెంపపెట్టులాంటిదని అన్నారు.

### ప్రభుత్వ ఒప్పందం ప్రకారం...

# హమాలీ రేట్లు పెంచాలి

తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయిస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత 2 సంవ్సరాల క్రితం జరిగిన ఒప్పందం ప్రకారం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు పెంచాలని తెలంగాణ స్టేట్ సివిల్ సప్లయిస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో గుంపల్లి మునీశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సివిల్ సప్లయిస్ హమాలీస్ యూనియన్, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ మాట్లాడుతూ హమాలీ రేట్లు ప్రతి క్వింటాలుకు ఎగుమతి, దిగుమతికి రూ.38లకు పెంచి అమలు చేయాలని, ప్రతి సంవత్సరం దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీటుకు రూ.1200లు చెల్లించాలని కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్‌ను కోరారు. హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా, నేటికీ కల్పించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పోరాడి సాధించుకున్న ఇఎస్ఐ చట్టాన్ని అమలు చేయాల్సివుండగా, ప్రభుత్వం తాత్సార్యం చేయటాన్ని తప్పుబట్టారు. ప్రతి సంవత్సరం బోనస్ (ఇన్సెంటీవ్) చెల్లిస్తున్న దానిని రూ.10వేలకు పెంచడంతో పాటు అన్ని గోడౌన్లలో పనిచేస్తున్న స్వీపర్లకు సమాన పనికి సమాన వేతనం చట్టం ప్రకారం కనీసం నెలకు రూ.12వేలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్(పిఎఫ్) సౌకర్యం కల్పిస్తున్న అధికారులు రిటైర్ అయిన హమాలీ కార్మికులకు పెన్షన్ అమలు చేయకుండా కేవలం రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రావిడెండ్ ఫండ్ అమౌంట్ మాత్రమే చెల్లిస్తున్నారన్నారు.

**హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలి..**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు ఇస్తున్నట్లు ప్రకటిస్తున్నందున సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అర్హులైన హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనిఫాం, కుట్టుకూలి రూ.2వేలకు పెంచి చెల్లించాలని, అన్ని గోడౌన్లలో అవసరాన్ని బట్టి కార్మికులను నియమించుకునే అవకాశం హమాలీలకే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కొత్తగూడెంలో తిరుగులేని శక్తిగా సిపిఐ

అధిక ఓట్లు రాబట్టిన కమ్యూనిస్టు పార్టీ
ద్వితీయ స్థానంతో సరిపెట్టుకున్న కాంగ్రెస్
47 సర్పంచ్ స్థానాల్లో ఎర్రజెండా రెపరెపలు



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం నియోజకవర్గంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి తిరుగులేదని మరోసారి రుజువైంది. తాజాగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ వరుస విజయాలను సొంతం చేసుకోగా, ఆయా గ్రామపంచాయతీల్లో ఎర్రజెండా రెపరెపలాడుతోంది. కొత్తగూడెం నియోజకవర్గ పరిధికి సంబంధించిన రెండు, మూడో విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఓటర్లు సిపిఐకి బ్రహ్మరథం పట్టడంతో అధికార కాంగ్రెస్ పార్టీకి మంచి ఓట్లను రాబట్టగలిగింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అత్యధిక స్థానాల్లో సిపిఐ ఒంటరి పోరుకు దిగింది. అక్కడక్కడా కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు పలికినప్పటికీ కాంగ్రెస్ మాత్రం సిపిఐకి ఏ మాత్రం సంధి అవకాశాన్ని ఇవ్వలేదు. అయినప్పటికీ ప్రజా ఆశీర్వాదం బలంగా ఉందని నేతలు నమ్మడంతో అత్యధిక స్థానాల్లో ఒంటరిపోరుకు దిగి మేజర్ గ్రామ పంచాయతీలను సైతం సిపిఐ కైవసం చేసుకుంది. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి మండలంలో సిపిఐ 14313 ఓట్లను రాబట్టగా అధికార కాంగ్రెస్ పార్టీ 8550 ఓట్లతో సరిపెట్టుకుంది. అదేవిధంగా పాల్వంచ మండలంలో సిపిఐకి 9652 ఓట్లు, కాంగ్రెస్‌కు 9478 ఓట్లు, లక్ష్మీదేవిపల్లి మండలంలో సిపిఐకి 10727, కాంగ్రెస్‌కు 12509 ఓట్లు పోలయ్యాయి. సుజాత నగర్ మండలంలో సిపిఐ 4313 ఓట్లు పడగా, 6824 ఓట్లు కాంగ్రెస్‌కు పడ్డాయి. మొత్తంగా కొత్తగూడెం నియోజకవర్గంలో సిపిఐ 39005 ఓట్లతో అగ్రభాగన నిలవగా, కాంగ్రెస్ 37361 ఓట్లతో ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది. అదేవిధంగా చుంచుపల్లి మండలంలో 8, పాల్వంచ మండలంలో 14, లక్ష్మీదేవిపల్లి మండలంలో 12, సుజాత నగర్ మండలంలో 3 సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకోవడంతో పాటు జిల్లాలోని చర్ల మండలంలో 2, దుమ్ముగూడెం మండలంలో 4, మణుగూరు మండలంలో 2, ఆళ్లపల్లి మండలంలో 1,చంద్రుగొండ మండలంలో 1 సర్పంచ్ స్థానాలను దక్కించుకుంది. మొత్తంగా జిల్లా వ్యాప్తంగా 47 సర్పంచ్ స్థానాల్లో సిపిఐ విజయకేతనాన్ని ఎగురవేయడంతో ఆయా స్థానాల్లో ఎర్రజెండా రెపరెపలాడుతోంది.

**ఎత్తులను చిత్తు చేసుకుంటూ :**
అధికార కాంగ్రెస్ పార్టీ సిపిఐని నిలువరించాలనే దురుద్దేశ్యంతో ముందు నుండీ ఎత్తు గడలు ప్రదర్శించింది. అక్కడక్కడా సిపిఐ కాంగ్రెస్ మద్దతు పలికినప్పటికీ, సిపిఐ మాత్రం అత్యధిక స్థానాల్లో ఒంటరి పోరు చేసింది. చావోరేవో తేల్చుకునేందుకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తూ రాజకీయ చాణిక్యునిలా పనిచేసి దిశా నిర్దేశం చేశారు.

## 20న ఎల్‌బి స్టేడియంలో క్రిస్టమస్ వేడుకలు

ఏర్పాట్లను సమీక్షించిన రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజహరుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే క్రిస్టమస్ పండుగ విందు కార్యక్రమ ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజాహరుద్దీన్ అధికారులను ఆదేశించారు. ఎల్‌బి స్టేడియంలో గురువారం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, మైనార్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీ ఉల్లా, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ క్రాంతి వెస్లీ, డైరెక్టర్ సిఇడిఎం శుకూర్, ఈడి వాటర్ వర్క్స్ మయాంక్ మిథల్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా ఈనెల 20న ఎల్‌బి స్టేడియం నందు క్రిస్టమస్ పండుగ సందర్భంగా విందు కార్యక్రమాన్ని చేపట్టనున్నందున అధికారులు గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, సమన్వయంతో కలిసి పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, క్రైస్తవ సోదరులు దాదాపు పదివేలకు వరకు పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. అలాగే ప్రోటోకాల్ తప్పక పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ పోలీసుల పాత్ర కీలకమని వచ్చే అతిథులు ఇబ్బంది పడకుండా వారికి కేటాయించిన గ్యాలరీలలోకి పంపించాలని సూచించారు .

# రాష్ట్రం మరిన్ని సంస్కరణలతో ముందుకు వెళ్లాలి

ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం మరిన్ని సంస్కరణలు, ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను ఆయన ప్రశంసించారు. డియుడిఎస్ చట్టాన్ని నోటిఫై చేయాలని ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆర్‌బిఐ బోర్డ్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు హైదరాబాద్‌కు వచ్చిన నేపథ్యంలో గురువారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో సంజయ్ మల్హోత్రా మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలను ఆర్‌బిఐ గవర్నర్‌కు సిఎం వివరించారు. విద్యుత్ రంగంలో సంస్కరణలు, మూడో డిస్కమ్ ఏర్పాటుపై ఆర్‌బిఐ గవర్నర్‌కు వెల్లడించారు. సోలార్ విద్యుత్ వినియోగం పెంచే దిశగా చర్యలు చేపట్టినట్లు సిఎం తెలిపారు. యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్ ఫేజ్ (యుఎల్ఐ) విషయంలో ఆర్‌బిఐ తీసుకుంటున్న చొరవను సిఎంకు ఆర్‌బిఐ వివరించారు. ప్రభుత్వ, ప్రైవేటు డిపాజిట్స్ క్లెయిమ్ క్యాంపెయినింగ్‌పై సిఎంకు గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, ఫైనాన్స్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్‌బిఐ హైదరాబాద్ రీజనల్ డైరెక్టర్ చిన్మోయ్ కుమార్, జనరల్ మేనేజర్స్ మేజర్ యశ్పాల్ చరణ్, ఎస్.పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.

## 'బయోమెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్'ను ఏర్పాటు చేయాలి : మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖలు, కార్పొరేషన్ల కార్యాలయాల్లో డివిజన్ లెవెల్ ఉద్యోగుల వరకు హాజరుపై నిర్లక్ష్యం ఉండకుండా 'బయోమెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్'ను ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఆదేశించారు. ఇటీవల పలు హెచ్ ఒడి కార్యాలయాలను మంత్రి తుమ్మల ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా,ఉద్యోగులు ఆలస్యంగా విధులకు హాజరవుతున్నట్టు గుర్తించారు. విధులు పట్ల నిర్లక్ష్యంగా ఉన్న ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేందర్ మోహన్‌ను మంత్రి తుమ్మల ఆదేశించారు.
ప్రజా పాలనలో రైతాంగ సంక్షేమానికి సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా ఉద్యోగులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సూచించారు. కొందరు ఉద్యోగులు వల్ల అందరికీ చెడ్డ పేరు వస్తుందని ఉద్యోగులు విధుల విషయంలో జవాబుదారిగా ఉండాలన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలోని అనుబంధ కార్పొరేషన్ల కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరుపై ఆన్‌లైన్ లో సమాచారం ఉండే విధంగా డ్యాష్ బోర్డు పని చేయాలని, ఈ బాధ్యతలను ఐటి డిపార్ట్ మెంట్‌కు అప్పగించాలన్నారు.ద్మొద

**కొద్ది రోజుల్లో ప్రక్షాళన దిశగా చర్యలు : సురేందర్ మోహన్**
కొద్ది రోజుల్లో వ్యవసాయ శాఖ,అనుబంధ కార్పొరేషన్ల కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో ప్రక్షాళన దిశగా చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేందర్ మోహన్ వెల్లడించారు. మంత్రి ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ పరిధిలోని అనుబంధ శాఖలు, కార్పొరేషన్ల కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరుపై బయో మెట్రిక్ ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌ను ఏర్పాటు చేయాలని హెచ్ ఒడిలకు సురేందర్ మోహన్ ఆదేశించారు. విధులకు ఆలస్యంగా హాజరయ్యే ఉద్యోగుల పట్ల తీసుకున్న యాక్షన్ రిపోర్టు లులను కూడా తమకు సమర్పించాలని సురేందర్ మోహన్ సూచించారు.

## రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణ' పోరాటాలను నిర్వహించండి

ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వర రావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశంలోని ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా భారత రాజ్యాంగం,ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటాలు చాలా బలంగా నిర్వహించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం(ఐప్సో) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం పిలుపునిచ్చింది. ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వర రావు అధ్యక్షతన హైదరాబాద్, హిమాయత్ నగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంఎల్‌సి యాదవరెడ్డి, జాతీయ అధ్యక్షవర్గ సభ్యులు డాక్టర్ డి. సుధాకర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయంగా యుద్ధోన్మాద విధానాలు ప్రమాదకరంగా, శాంతికి భంగంగా పరిణమించాయని, భారతదేశం అలీన విధానం నుండి తప్పుకుంటుందని, రాజ్యాంగం ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రమాద అంచుల్లోకి వెళ్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నించేతత్వాన్ని, బావ ప్రకటన స్వేచ్ఛను కేంద్రంలోని పాలకులు సహించడం లేదని, ప్రశ్నించినవారిపైన కేసులు నమోదు చేసి, జైలులో పెడుతున్నారని దుయ్యబట్టారు. కాగర్ ఆపరేషన్, ఆదివాసీలను , ఉద్యమకారులను చంపడం రాజ్యాంగ వ్యతిరేక, అప్రజాస్వామిక చర్యలకు పాల్పడడమేనని మండిపడ్డారు. అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ ఐప్సో ఆధ్వర్యంలో రాష్ట్రంలో నిర్వహించిన కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెట్టారు అన్ని జిల్లాల్లో అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. శాంతి ఉద్యమ ప్రాధాన్యతను తెలియజేస్తూ సంఘం బలోపేతానికి, నిర్మాణానికి పునాది అయిన సభ్యత్వ నమోదును చేపట్టాలని, సమావేశాలను నిర్వహించాలని సూచించారు. వచ్చే నూతన సంవత్సరంలో జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా కళాశాలలు, పాఠశాలలో వివిధ రూపాల్లో విస్తృతంగా సమావేశాలను, సెమినార్లను నిర్వహించాలన్నారు.
రాష్ట్ర అధ్యక్ష వర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని మారుస్తూ, జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాన్ని తుంగలో తొక్కె ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మతపరమైన ఆలోచనలతో పాలన విధానాలను కొనసాగిస్తున్నారన్నారు. ఐప్సో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావు, తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజలంతా యుద్ధాలకు వ్యతిరేకంగా ఐక్యంగా నిలబడాలని, మానవజాతిని కాపాడుకోవాలని కోరారు. అధ్యక్ష వర్గ సభ్యులు ఎంఆర్ జి వినోద్ రెడ్డి, డాక్టర్ సమత రోషిని మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా ఐప్సో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు.
వివిధ జిల్లాల నుండి వచ్చిన జిల్లా నాయకులు ఉదయ భాస్కర్, కోటంరాజు, డాక్టర్ ప్రశాంతి, గురు బచ్చన్ సింగ్ ,జె.కె.శ్రీనివాస్, గురు బచ్చన్ సింగ్, పోలగాని రవి కిషోర్ ,తిప్పర్తి మహేష్, పల్లె కుమార్, వెంకట్రాంరెడ్డి, ప్రేమపావని, కమలా రెడ్డి, కరుణ, లెనిన్, రాజమౌళి, రామ్ రెడ్డి,, రామ్ నారాయణ, అమరేందర్ రెడ్డి, సుభాష్ యాదవ్, డి.జి. నరేంద్ర ప్రసాద్, సుధావన్, వెంకటేశ్వర్లు, నాగసేనారెడ్డి, ఎస్.ఎన్ .శెట్టి, జగన్మోహన్, బాలయ్య, శివయ్య, పల్లె వెంకన్న, చిత్రం సైదులు నగేష్ అప్ప, జావేద్, అజీమ్, రాకేష్ తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

## ఎసిబి వలలో కారేపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్



**ప్రజాపక్షం/కారేపల్లి :** కారేపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దౌలూరి శుభకామేశ్వరి దేవి ఎసిబి వలలో చిక్కారు. కారేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు పదివేల రూపాయలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్‌గా దొరికిపోయింది. ఎసిబి డిఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో కారేపల్లిలోని ఆమె ఇంటి వద్ద వలవేసి దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఈసందర్భంగా ఎసిబి డీఎస్పీ వై రమేష్ మాట్లాడుతూ ప్రజల పనుల కోసం అధికారులు లంచం అడిగితే వెంటనే ఎసిబికి సమాచారం అందించాలని తెలిపారు.

## 10 మంది సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ అభ్యర్థులు గెలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో తాము బలపర్చిన 16 మంది సర్పంచ్‌లు, పది మంది ఉప సర్పంచ్‌లు గెలిచారని, రెండు స్థానాల్లో న్యూడెమోక్రసి బలపర్చిన అభ్యర్థులు గెలిచారని, వంద వార్డులలో వార్డు సభ్యులు గెలిచారని సిపిఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. వామపక్ష అభ్యర్థులను గెలిపించినందుకు ఆయన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గెలుపొందిన అభ్యర్థులను అభినంధించారు. ఎన్నికలలో గెలుపు, ఓటములు సహజమని, అయినప్పటికీ ఎన్నికలను పారదర్శకంగా ,నిజాయితీ,స్వేచ్ఛగా , స్వచ్ఛందంగా జరిగేలా రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద వర్గాలు, ప్రజాస్వామిక శక్తులు పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కేంద్రం కుట్రలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలి

సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని ఒక పథకంగా మార్చి నిర్వీర్యం చేసే కుట్రను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మహాత్మాగాంధీ పేరుతో ఉన్న నరేగా పేరును విబి జీరామ్‌జీ గా మార్చడమంటే, గాంధీని అవమానపర్చడమేనని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగిస్తూ, మరిన్ని నిధులను పెంచాలని, 200ల పనిదినాలను చేయాలని డిమాండ్ చేశారు. చట్టంపరిరక్షణకు ఐక్య పోరాటాలు చేస్తామన్నారు. విబి జీరామ్‌జీ బిల్లును కేంద్రం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఆ బిల్లును వ్యతిరేకిస్తూ హైదరాబాద్, ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో బిల్లు ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, రాష్ట్ర నాయకులు వెంక్రటాములు, భూపాల్, బి.ప్రసాద్, ఆశయ్య, శ్రీరామ్ నాయక్, ఉడుత రవీందర్, ఎం.శ్రీనివాస్, బాబూరావు, కోట రమేశ్, విజయ్, పద్మ, ప్రజాసంఘాల నాయకులు, నగర కార్యదర్శి వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ రోజ్‌గార్ , ఆజీవికా మిషన్ (గ్రామీణ్) బిల్లు 2025 ను తీసుకురావాలనే దుర్మార్గ చర్యను ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం ఉన్న తన వాటాను 60 శాతానికి కుదించడం అంటే చట్టాన్ని నిర్వీర్యం చేయడమేనని విమర్శించారు. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వనరులను దెబ్బతీస్తూనే మరోవైపు 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని కేంద్రం ముసాయిదా బిల్లులో పెట్టడం దుర్మార్గమన్నారు.


### ప్రభుత్వ – స్టార్టప్ భాగస్వామ్యంతో

# దివ్యాంగుల జీవితాల్లో కొత్త వెలుగు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంక్షేమంతో పాటు దివ్యాంగులు స్వతంత్రంగా, గౌరవప్రదమైన జీవనం సాగించాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సాంఘిక సంక్షేమ,ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని అలీన్ ఇనోవేషన్ కార్యాలయంలో గురువారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన అసిస్టివ్ టెక్నాలజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దృష్టిలోపం ఉన్న దివ్యాంగుల కోసం రూపొందించిన అసిస్టివ్ టెక్ పరికరాలను 20 మందికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రిమాట్లాడుతూ దివ్యాంగులు కేవలం సహాయం పొందే వర్గం కాదని, అవకాశం ఇస్తే తమ కాళ్లపై తామే నిలబడి ఆత్మవిశ్వాసంతో జీవించగల సామర్థ్యం ఉన్న పౌరులని పేర్కొన్నారు. ఇదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన దృక్పథమని తెలిపారు. అందుకే తెలంగాణ ప్రభుత్వం పింఛన్లకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, ఉద్యోగ రిజర్వేషన్, టెక్నాలజీ, స్వయం ఉపాధి అన్నీ కలిసేలా సమగ్ర విధానంతో పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దివ్యాంగుల పెన్షన్లు వారి చేతికి చేరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే చదువుతున్న దివ్యాంగ విద్యార్థి ఎక్కడా ఆగిపోకుండా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు ఉన్న రిజర్వేషన్ కాగితాల్లోనే కాకుండా వాస్తవంగా ఉద్యోగాల్లో కనిపించాలన్నదే సిఎం స్పష్టమైన ఆదేశమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిజిఐసి సీఈఓ మిరాజ్, యునిసెఫ్ (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) ఫీల్డ్ ఆఫీసర్ జెలామియాలి, ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధి ప్రదీప్‌తో పాటు నెట్‌వర్క్ మోడల్‌పై పనిచేస్తున్న పలు ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రఖ్యాత శిల్పి రామ్ సుతార్ కన్నుమూత



**నోయిడా:** ప్రఖ్యాత శిల్పి రామ్ సుతార్(100) బుధవారం అర్ధరాత్రి నోయిడాలోని తన నివాసంలో వద్ధాప్య సంబంధిత అనారోగ్యాలతో కన్నుమూశారు. గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటు చేయడం ద్వారా 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' రూపకర్తగా ఆయన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. 1925 ఫిబ్రవరి 19న మహారాష్ట్రలోని ధూలే జిల్లా గోండూర్ గ్రామంలో జన్మించిన సుతార్... చిన్ననాటి నుంచే శిల్పకళపై ఆసక్తి చూపారు. ముంబై జేఏజే స్కూల్ ఆఫ్ ఆర్ట్‌లో గోల్డ్ మెడలిస్ట్‌గా నిలిచారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఉన్న ధ్యాన భంగిమలోని మహాత్మాగాంధీ విగ్రహం, గుర్రంపై ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహం ఆయన రూపొందించిన ప్రముఖ శిల్పాలు. దేశ తొలి ఉప ప్రధాని సర్దార్ పటేల్ విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ'తో ఆయన ప్రతిభను మరోసారి చాటి చెప్పారు. రామ్ సుతార్‌కు పద్మశ్రీ (1999), పద్మభూషణ్ (2016) పురస్కారాలు అందుకున్నారు.

## గ్రామ జనాభా 1,500... 27,000కుపైగా జననాలు!



**ముంబయి:** మహారాష్ట్రలోని యావత్మల్ జిల్లా అర్ని తహసీల్‌లోని షెందుర్సాని గ్రామ పంచాయతీ జనాభా కేవలం 1,500. అయితే ఈ ఏడాది సెప్టెంబరు నుంచి నవంబరు మధ్య కేవలం మూడు నెలల్లోనే 27,397 జననాలు ఆ గ్రామంలో నమోదయ్యాయి. కాగా, ఈ విషయం తెలిసి జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు షాక్ అయ్యారు. ఆ గ్రామాన్ని సందర్శించారు. అసాధారణ రీతిలో నమోదైన జననాల ధ్రువీకరణ కోసం ప్రత్యేక వ్యవస్థ నిర్వహించారు. దీంతో అభిప్రాయ జనన ధ్రువీకరణ పత్రాల కుంభకోణం బయటపడింది. జనన, మరణ నమోదు వ్యవస్థ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్)ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు గుర్తించారు. పంచాయతీ సీఆర్ఎస్ లాగిన్ ఐడీ ముంబైకి మ్యాప్ అయ్యిందని తెలుసుకుని అధికారులు షాక్ అయ్యారు. మరోవైపు జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కూడా పంచాయతీ శాఖ డిప్యూటీ సీఈవో అధ్యక్షతన విచారణ కమిటీ ఏర్పాటు చేశారు. మూడు నెలల్లో నమోదైన 27,397 జననాలు, ఏడు మరణాలు పంచాయతీ పరిధికి వెలుపల ఉన్నట్లు ఆ కమిటీ నిర్ధారించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆరోగ్య అధికారి ఈ స్కామ్‌పై యావత్మల్ నగర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐటీ చట్టంతోపాటు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బీజేపీ సీనియర్ నేత కిరీట్ సోమయ్య ఆ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ నమోదైన జననాల్లో 99 శాతం పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన వ్యక్తులవేనని తెలిపారు. ఈ నేపథ్యంలో సీఎం దేవేంద్ర ఫడ్నవిస్‌తో మాట్లాడినట్లు చెప్పారు. ఈ జననాల నమోదులన్నీ రద్దు చేయాలని డిమాండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు.

## కార్మిక ఆధారిత ఎగుమతులపై సుంకాలు రద్దు

- భారత్–ఒమన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు



**మస్కట్:** భారత్–మస్కట్ దేశాలమధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరింది. కార్మిక ఆధారిత కీలకరంగాల ఉత్పత్తులపై సుంకాలు లేకుండా భారత్ ఎగుమతులకు ఒమన్ దేశం అంగీకరించడం ఈ ఒప్పందంలో ప్రధానాంశం. ఈ ఒప్పందాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిత్రాత్మకమైన నిర్ణయంగా పేర్కొన్నారు. ఒమన్ ఈ అవకాశం ఇవ్వడంతో భారత్ కూడా కొన్ని సుంకాల రాయితీలు ఇచ్చింది. అమెరికాకు భారత్ ఎగుమతులపై ట్రంప్ యాభైశాతం సుంకాల భారం మోపడంవల్ల కలిగిన నష్టంతో సమస్యల్లో ఉన్న ఎగుమతిదారులకు ఈ ఒప్పందం ఊరట కలిగిస్తుంది. రత్నాలు, ఆభరణాలు, వస్త్రాలు, తోలు ఉత్పత్తులు, చెప్పులు, క్రీడా వస్తువులు, ప్లాస్టిక్స్, గృహోపకరణాలు, వ్యవసాయ ఉత్పత్తులు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, ఫార్మాస్యూటికల్స్, వైద్యరంగానికి సంబంధించిన పరికరాలు, ఆటోమొబైల్స్ వంటి అన్ని వస్తువులను మస్కట్ దేశం దిగుమతి చేసుకున్న తర్వాత ఒక్క రూపాయి కూడా సుంకాలను వసూలు చేయదు. ప్రస్తుతం ఈ వస్తువులపై ఒమన్ దేశం 5–100 వరకు సుంకాలు వసూలు చేస్తోంది. ఈ ఒప్పందం ప్రకారం ఒమన్ ప్రధానమంత్రి, సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ ఆహ్వానం మేరకు గురువారం ఒమన్‌లో పర్యటించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఘన స్వాగతం లభించింది. రాజధాని మస్కట్‌లో ప్రధామంత్రి బిన్ తారిక్‌తో మోదీ చర్చల అనంతరం వారిద్దరి సమక్షంలో భారత వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్, ఒమన్ వాణిజ్య,పరిశ్రమలు,పెట్టుబడుల ప్రోత్సాహకమంత్రి క్వాజీ బిన్ మొహ్మద్ అల్ యూసెఫ్‌లు సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సిఇపిఎ)పై సంతకాలు చేశారు. వచ్చే ఏడాది (2026) ఆర్థికసంవత్సరం తొలి త్రైమాసికం నుండి ఈ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఒమన్‌దేశం పూర్తిగా సుంకాలు రద్దుచేసిన నేపథ్యంలో భారత ప్రభుత్వం కూడా మొత్తం టారిఫ్ లైన్స్‌లో 77.79 శాతం మేరకు ఆ దేశ ఉత్పత్తులకు సుంకాల రాయితీలు ఇచ్చింది. కాగా ఒమన్‌లో నరేంద్రమోదీ భారత్–ఒమన్ వ్యాపార వేదిక సమావేశంలో ప్రసంగించారు. ఒమన్‌తో ద్వైపాక్షిక ఒప్పందంవల్ల పెట్టుబడులకు కొత్త శక్తి సామర్థ్యాలు సమకూరుతాయన్నారు. ఇరుదేశాల వృద్ధికి గొప్ప అవకాశాలను సృష్టించుకోవచ్చునన్నారు. ఈనాడు ఈ ఒప్పందం ద్వారా ఒక చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్నామని , రాబోయే దశాబ్దాలపై దీని ప్రభావం కనిపిస్తున్నదన్నారు. ఈ సిఇపిఎ ఒప్పందం రెండు దేశాలమధ్య భాగస్వామ్యానికి కొత్త విశ్వాసాన్ని ఇస్తుందని, 21వ శతాబ్దంలో కొత్త శక్తిని ఇస్తుందన్నారు. భారత ఎగుమతిదారులకు ఈ వాణిజ్య ఒప్పందం గొప్ప అవకాశాలను ఇస్తుందని మంత్రి పీయూశ్ గోయల్ అన్నారు. సూక్ష్మ,చిన్న,మధ్యతరగతి పరిశ్రమలకు ఈ ఒప్పందం ఎంతో ముఖ్యమైనదని, దేశ ప్రయోజనాలను కాపాడుతుందన్నారు. బ్రిటన్‌తో కూడా భారతదేశం గడచిన జులై నెలలో సమగ్ర వాణిజ్య ఒప్పందంపై సంతకాలు చేసింది. మధ్యాసియాలో కూడా భారతదేశం ఇప్పుడు తన ఉనికిని విస్తరించుకుంటున్నది. 2022 మే నెలలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో భారతదేశం ఒప్పందాన్ని అమలు చేసింది. ఖతార్ దేశంతో కూడా త్వరలో వాణిజ్య ఒప్పందంపై చర్చలు ప్రారంభం కానున్నాయి.

### ప్రవాస భారతీయులలో మోదీ

21వ శతాబ్దపు భారతదేశం 'పెద్ద','వేగవంతమైన' నిర్ణయాలు తీసుకుంటుందని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో ఫలితాలను సాధిస్తూ ముందుకు సాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రెండు రోజుల ఒమన్ దేశ పర్యటనలో ఉన్న మోదీ గురువారం మస్కట్‌లో భారతీయ విద్యార్థులు, ప్రవాసభారతీయులతో నిర్వహించిన సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. సహజీవనం, సహకారం భారతీయ ప్రవాసుల ప్రత్యేక లక్షణంగా ఉందని ప్రధానమంత్రి నొక్కి చెప్పారు. భారతదేశం పరివర్తనాత్మక వృద్ధి అభివృద్ధి, మార్పు వేగం, స్థాయి, దాని ఆర్థిక వ్యవస్థ బలాన్ని వివరిస్తూ గత త్రైమాసికంలో ఎనిమిది శాతానికి పైగా వృద్ధిని సాధించడాన్ని మోదీ ఉదహరించారు. అధిక వృద్ధి రేటుతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల లో ఒకటిగా మారే దిశగా భారతదేశం స్థిరంగా పయనిస్తోందని, ప్రపంచం సవాళ్లతో సతమతమవుతున్న సమయంలో ఇది జరిగిందని ఆయన అన్నారు.'మైత్రి పర్వ్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, వివిధ భారతీయ పాఠశాలల నుండి 700 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సంవత్సరం ఒమన్‌లోని భారతీయ పాఠశాలలకు ప్రత్యేక ప్రాముఖ్యతను కలిగి ఉందని, ఆ దేశంలో వాటిని స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయని న్యూఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. అంతరిక్షం భారతదేశం, ఒమన్ మధ్య సహకారంలో ఒక ముఖ్యమైన భాగమని మోదీ అన్నారు. మస్కట్‌తో అంతరిక్ష సహకార ఒప్పందం కింద ఇస్రో ఇండియాఒమన్ స్పేస్ పోర్టల్‌ను అభివృద్ధి చేసిందని పేర్కొన్నారు.

## క్షమాపణ చెప్పకపోతే చంపేస్తాం

### నితీశ్ కుమార్‌కు పాక్ గాంగ్‌స్టర్ బెదిరింపు



**పట్నా:** హిజాబ్ వివాదంలో చిక్కుకున్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు వచ్చిన బెదిరింపు వీడియో సంచలనంగా మారింది. ఇప్పటికే ఈ సంఘటనపై కాంగ్రెస్, ఆర్జేడీ తీవ్రంగా స్పందించాయి. నితీశ్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేయగా, నితీశ్ మానసిక స్థితిపై ఆర్జేడీ అనుమానం వ్యక్తం చేసింది. బీహార్ సీఎం వెంటనే ఆ మహిళకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని నటి జైరా వసీం డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజాగా నితీశ్ కుమార్‌కు పాకిస్తాన్‌కు చెందిన ఒక గ్యాంగ్‌స్టర్ ద్వారా సోషల్ మీడియాలో బెదిరింపులు వచ్చాయి. ఈ సంఘటనపై క్షమాపణ చెప్పాలని సీఎంను గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టి డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ముస్లిం మహిళతో నితీశ్ ప్రవర్తించిన తీరును ప్రస్తావిస్తూ ఆ మహిళకు క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భట్టి హెచ్చరించాడు. బాధ్యతా యుతమైన పదవిలో ఉండి ఇలా ప్రవర్తించడం తగదని వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఈ వీడియోపై ఎలాంటి ధృవీకరణ లేనప్పటికీ, బీహార్ డీజీపీ వినయ్‌కుమార్ స్పందించారు. ఈ విషయాన్ని పరిశీలించమని పట్నా ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌ను కోరినట్లు చెప్పారు. ఇంతకుమించి ప్రస్తుతానికి వివరాలేమీ లేవంటూ... తదుపరి వ్యాఖ్యానించడానికి ఆయన నిరాకరించారు, ఈ వీడియోపై అధికారిక విచారణ అనంతరం బెదిరింపులను పరిశీలిస్తామన్నారు.

## శబరిమల బంగారం చోరీ కేసులో పురోగతి

**తిరువనంతపురం:** శబరిమల బంగారం చోరీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బందం (సిట్) కొంత పురోగతి సాధించింది. దీనికి సంబంధించి ఓ ప్రవాస వ్యాపారి వాంగ్మూం నమోదు చేయగలిగింది. పండలం స్థానికుడైన ప్రవాస వ్యాపారి నుంచి వివరణాత్మక వాంగ్మూలం సేకరించింది. ఆ సమాచారాన్ని ప్రవాస దర్యాప్తు బందంతో పంచుకున్నది. ఆ వాంగ్మూలం ఆధారంగా సిట్ తదుపరి దర్యాప్తుకు సిద్ధమవుతోంది. ఇటీవల, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రమేష్ చెన్నితాల శబరిమల బంగారు దోపిడీ వెనుక అంతర్జాతీయ పురాతన వస్తువుల స్మగ్లింగ్ ముఠా ఉన్నట్లు తనకు సమాచారం అందిందని ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. ఆయన ఫిర్యాదులో నిందితుడిగా ఉన్న దుబాయ్ వ్యాపారవేత్త నుంచి సిట్ గతంలో వాంగ్మూలం నమోదు చేసింది. దోపిడీలో పాల్గొన్న ఒకరితో తనకున్న వ్యక్తిగత అనుభవాల గురించి ఆ వ్యాపారవేత్త చెప్పాడు. కానీ అందుకు సంబంధించి ఎటువంటి పత్రాలను ఇంతవరకు అతడు సమర్పించలేదు.

## ఎయిరిండియా విమానానికి తప్పిన ముప్పు

**కొచ్చి:** ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం కొచ్చి అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయినట్లు ఓ అధికారి గురువారం తెలిపారు. 160 మంది ప్రయాణికులతో జెడ్డా నుండి కోజికోడ్ బయలుదేరిన విమానంలో ల్యాండింగ్ గేర్, టైర్ వైఫల్యమైనట్లు వెల్లడించారు. అత్యవసర పరిస్థితుల్లో గురువారం ఉదయం 9.07 గంటలకు విమానాన్ని కొచ్చిలో సురక్షితంగా దించినట్లు ఆ అధికారి ప్రకటించారు. జెడ్డా నుండి కోజికోడ్‌కు బయలుదేరిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం ఐఎక్స్ 398ను అత్యవసరంగా సురక్షితంగా ల్యాండింగ్ చేయడంలో తాము విజయం సాధించినట్లు కొచ్చి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ ఒక ప్రకటన విడుదల చేసింది. కుడివైపు ప్రధాన ల్యాండింగ్ గేర్, టైర్ వైఫల్యం చెందడంతో విమానంలో సాంకేతిక సమస్య ఎదురైందని, దీంతో అత్యవసరంగా ఈ విమానాన్ని కొచ్చికి మళ్లించినట్లు ఆ ప్రకటన తెలిపింది.

## జెడ్‌పి ఎన్నికల్లో ఆప్ హవా

**చండీగఢ్:** పంజాబ్‌లోని జిల్లా పరిషత్ ఎన్నికల్లో పాలక ఆమ్ ఆద్మీ పార్టీ విజయం సాధించింది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం... పంచాయతీ సమితిలోని మెజారిటీ జోన్‌లలో ఆధిక్యంలో కొనసాగుతున్నట్లు అధికారులు గురువారం తెలిపారు. బ్యాలెట్ పేపర్ల లెక్కింపు కొనసాగుతోందని, మరికొన్ని గంటల్లో తుది ఫలితాలు వెల్లడికానున్నాయని అన్నారు. జిల్లా పరిషత్‌లో ఇప్పటివరకు వెలువడిన 317 జోన్‌ల ఫలితాల్లో 201 జోన్‌లలో ఆప్ విజయం సాధించింది. కాంగ్రెస్ 60 జోన్‌లతో రెండవ స్థానంలో, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) 39 జోన్‌లతో మూడవ స్థానంలో, బీజేపీ 4, బీఎస్‌పీ 3, స్వతంత్రులు 10 మంది విజయం సాధించారు. పంచాయతీ సమితి ఎన్నికల్లో మెజారిటీ జోన్‌లలో ఆప్ ఆధిక్యంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు.

## ఎస్ఐఆర్ గణన ఫారాల సమర్పణ గడువు పొడిగించండి: 'సుప్రీం'

**న్యూఢిల్లీ:** ఎస్ఐఆర్ గణన ఫారాల సమర్పణ తేదీని పొడిగించాలని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)ని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. ఉత్తరప్రదేశ్, కేరళ సహా వివిధ రాష్ట్రాల్లోని వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని... ఎస్ఐఆర్ 2026 ఓటర్ల జాబితా కింద గణన ఫారాల సమర్పణ తేదీ పొడిగించాలన్న అభ్యర్థనలపై సానుభూతి దక్పథంతో నిర్ణయం తీసుకోవాలని ఈసీఐని సుప్రీంకోర్టు కోరింది. ఎస్ఐఆర్ రాజ్యాంగబద్ధతపై విచారణను 2026 జనవరి 6కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం పేర్కొంది. కేరళ షెడ్యూల్‌ను ముందుగా సవరించారు. గణన గడువును డిసెంబర్ 18కి వాయిదా వేశారు. అలాగే ముసాయిదా ఓటరు జాబితాను డిసెంబర్ 23న ఈసీఐ ప్రచురించనుంది. అయితే ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వస్తే... సవరించిన తుది గడువు డిసెంబర్ 26తో ముగియనుంది. ఈ అంశాలను సీనియర్ న్యాయవాదులు సుప్రీంకోర్టులో లేవనెత్తారు. 2027లో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉండగా... ఇంతముందుగా ఈ ప్రక్రియను ఎందుకు నిర్వహించారని బారాబంకి ఎంపీ తనుజ్ పూనియా సహా యూపీ ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తున్న పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ప్రశ్నించారు. ముసాయిదా జాబితా నుండి 25 లక్షల మంది ఓటర్లు తొలగించనున్నట్లు కేరళ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో గణన దశకు చివరి తేదీ డిసెంబర్ 18 అని అన్నారు. జాబితాలో భర్తను మినహాయించారని, భార్యను చేర్చారని, అధికారులకు ఈ విషయం తెలిస్తే... వారు భార్యను కూడా తొలగిస్తారని అన్నారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణను శీతాకాలపు సెలవుల తర్వాత జనవరి 6న చేపడతామని ఆదేశించింది.

## 'కర్మశ్రీ'కి మహాత్మాగాంధీ పేరు: మమత




**కోల్‌కతా:** జాతీయ ఉపాధి హామీ పథకం పేరును 'వీబీజీ రామ్ జీ'గా మార్చడంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా మండిపడ్డారు. కొన్ని రాజకీయ పార్టీలు జాతీయ నాయకులను గౌరవించకపోయినా... తాము గౌరవిస్తామని బీజేపీని పరోక్షంగా ఉద్దేశిస్తూ అన్నారు. తమ ప్రభుత్వ ఉపాధి హామీ పథకం 'కర్మశ్రీ'కి మహాత్మా గాంధీ పేరు పెట్టనున్నామని ప్రకటించారు. 'కేంద్ర ఉపాధి హామీ పథకం పేరు మార్చాలని నిర్ణయించినందుకు సిగ్గుపడుతున్నా. నేనూ ఈ దేశ పౌరురాలినే. మనం ఇప్పుడు జాతిపితను కూడా మరచిపోతున్నాం' అని గురువారం ఓ బిజినెస్ కాంక్లేవ్‌లో మమత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో చేపడుతున్న కర్మశ్రీ పథకానికి మహాత్మా గాంధీ పేరు పెడుతున్నామన్నారు. ఎంజీఎన్ఆర్ఈజీఏ స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్(గ్రామీణ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపిన నేపథ్యంతో మమత ఈ ప్రకటన చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి వచ్చే నిధులను కేంద్రం అడ్డుకుంటోందని మమత ఆరోపించారు. కర్మశ్రీ పథకం కింద లబ్ధిదారులకు 75 రోజులపాటు పని కల్పిస్తున్నామన్నారు. భవిష్యత్తులో దీనిని 100 రోజులకు పెంచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కేంద్ర నిధులు ఇవ్వనప్పటికీ రాష్ట్ర నిధులతోనే దీనిని కొనసాగిస్తున్నామని చెప్పారు.

## తాగడానికి నీళ్లే లేవు... బాటిళ్లకు నాణ్యతా?



**న్యూఢిల్లీ:** నీళ్ల బాటిళ్లకు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో ప్రజలకు కనీస తాగునీరే అందడం లేదని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది. ఇది కేవలం లగ్జరీ వ్యాజ్యమే అంటూ పిటిషన్‌ను తిరస్కరించింది. ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నాణ్యతా ప్రమాణాలు మెరుగుపర్చేలా ఆదేశాలు జారీ చేయాలంటూ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. 'ఇది అర్బన్‌రిచ్ మనస్తత్వంతో వేసిన పిటిషనే. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ చాలా మందికి తాగునీటి సరఫరా సరిగా లేదు. వారు శుద్ధి చేయని జలాలపై ఆధారపడుతున్నారు. ముందు వారి సంగతి ఆలోచిద్దాం. నీళ్ల బాటిళ్ల నాణ్యత గురించి తర్వాత చూద్దాం' అని ధర్మాసనం తెలిపింది. 'అమెరికా, జపాన్, ఈయూ మార్గదర్శకాలను మన దేశంలో ప్రవేశపెట్టగలమా అనే విషయాన్ని మీరు ఆలోచించుకోవాలి. భారత్‌లోని వాస్తవిక పరిస్థితులు తెలుసుకోవాలి. గాంధీజీ దేశానికి వచ్చినప్పుడు... ఆయన చాలా మారుమూల ప్రాంతాల్లో పర్యటించారు. మీరు కూడా అలా అభివదికి నోచుకోని ప్రాంతాలు సందర్శించండి. అక్కడి ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో చూడండి. అప్పుడు మీకు మన దేశం అంటే ఏంటో అర్థమవుతుంది' అని పిటిషనర్‌కు సుప్రీం కోర్టు ధర్మాసనం సూచించింది.

## డిఎంకె దుష్టశక్తి: విజయ్



**ఈరోడ్:** తమిళనాడులో డిఎంకె ప్రభుత్వంపై టివికె పార్టీ అధినేత విజయ్ విమర్శలు గుప్పించారు. నీట్ పరీక్ష మినహాయింపు, శాంతిభద్రతల సమస్యలపై స్టాలిన్ ప్రభుత్వాన్ని నిందించారు. డీఎంకే పార్టీకి సమస్యలు ఫెవికాల్‌తో ముడిపడి ఉన్నాయని, వాటిని వేరు చేయలేమని వ్యాఖ్యానించా రు. అధికార డిఎంకెను దుష్టశక్తిగా, తన పార్టీ టీవీకే(తమిళగ వెట్రి కజగం)ను స్వచ్ఛమైన శక్తిగా అభివర్ణించారు. పోరాటం స్వచ్ఛమైన శక్తికి, చెడుకుమధ్య అని విజయ్ చెప్పారు. విజయ్ గురువారం మధ్యాహ్నం ఈరోడ్ జిల్లాలో భారీ ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబర్ 27న కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మరణించిన తర్వాత రాష్ట్రంలో ఆయన పెద్ద ఎత్తున జరిపిన సభ ఇదే కావడం విశేషం. ఈ ర్యాలీ ద్వారా విజయ్ వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు తన ప్రచారానికి స్వరం సిద్ధం చేసుకున్నారు. ర్యాలీకి వచ్చిన జనసమూహాన్ని సురక్షితంగా వెళ్లమని విజయ్ విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీ ఏఐఏడీఎంకే మాజీ నాయకుడు కేఏ సెంగొట్టయన్ స్వస్థలం విజయమంగళం సమీపంలో జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. సెంగొట్టయన్ గత నెలలో ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన తర్వాత విజయ్ పార్టీ టీవీకేలో చేరారు. ఆయనను సీనియర్ రాజకీయ నాయకుడు, అద్భుతమైన ప్రచార వ్యూహకర్తగా పరిగణిస్తారు. కరూర్ తొక్కిసలాట ఘటన తర్వాత విజయ్ నిర్వహించిన రెండవ పెద్ద బహిరంగ సభ ఇదే కావడం విశేషం. మొదటి సభ గత వారం పుదుచ్చేరిలో జరిగింది. కాగా, తోపులాట, తొక్కిసలాటకు ఆస్కారం ఇవ్వకుండా కార్యకర్తలను నిర్ణీత సమయంలో లోనికి అనుమతించడం, నిర్ణీత సమయంలో విజయ్ అక్కడికి వచ్చే విధంగా ఆదేశాలు ఇచ్చారు. ఇక్కడ ఏర్పాట్లను టీవీకే వర్కింగ్ కమిటీ సమన్వయకర్త సెంగొట్టయన్, ప్రధాన కార్యదర్శి భుస్సీ ఆనంద్ పర్యవేక్షించారు. గుర్తింపు కార్డులు ఉన్న కేడర్‌ను మాత్రమే లోనికి అనుమతించే విధంగా ఏర్పాట్లు చేశారు.

## న్యాయ వ్యవస్థలో దురదృష్టకర విధానం: సిజెఐ

**న్యూఢిల్లీ:** న్యాయ వ్యవస్థలో జరుగుతున్న అవినీతిని అరికట్టేందుకు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ గట్టి ప్రయత్నం చేశారు. పదవీ విరమణ వయసు దగ్గరపడుతున్న సమయంలో... జడ్జిలు తమ ఆదేశాలతో సిక్సర్లు కొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఓ కేసు విషయంలో గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఆ సమయంలో చీఫ్ జస్టిస్ ... న్యాయ వ్యవస్థలో ఓ దురదష్టకరమైన విధానం నడుస్తోందని, పదవీ విరమణ సమీపిస్తున్న జడ్జిలు తమ తీర్పులతో సిక్సర్లు కొట్టే ప్రయత్నం చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ జోయ్‌మాలా బాగ్చీ కూడా ఉన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ జిల్లా జడ్జి తన పదవీ విరమణకు పది రోజుల ముందు సస్పెన్షన్‌కు గురయ్యారు. తన సస్పెన్షన్‌ను సవాల్ చేస్తూ ఆ జడ్జి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పదవీ విరమణ సమీపిస్తున్న సమయంలో ఆ జడ్జి రెండు కేసుల్లో కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆ తీర్పులపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ జడ్జీపై సస్పెన్షన్ విధించారు. పిటిషన్ దాఖలు చేసిన వ్యక్తి తన పదవీ విరమణకు ముందు సిక్సర్లు కొట్టే ప్రయత్నం చేశారని, ఈ అంశంపై లోతుగా ఏమీ చెప్పలేమని అన్నారు. వాస్తవానికి ఆ జిల్లా జడ్జి నవంబరు 30వ తేదీన పదవీ విరమణ కావాల్సి ఉంది. కానీ 19వ తేదీనే ఆయన్ను సస్పెండ్ చేశారు. అయితే ఆ జడ్జి పదవీవిరమణ వయసును మరో ఏడాది కాలం పాటు పొడిగించాలని సుప్రీంకోర్టు తన ఆదేశాల్లో మధ్యప్రదేశ్ సర్కారుకు చెప్పింది. రెండు కీలక ఆదేశాలు ఇచ్చిన అంశం ఆ జడ్జికి కూడా తెలియదని, కానీ పదవీ విరమణ వయసును ఏడాది పొడిగించినట్లు చెప్పారు. రిటైర్మెంట్‌కు ముందు సంచలన ఆదేశాలు ఇవ్వడం జడ్జిలకు ఓ ట్రెండ్‌గా మారిందన్నారు. తన సస్పెన్షన్‌ను ఛాలెంజ్ చేస్తూ హైకోర్టును ఎందుకు ఆశ్రయించలేదని బెంచ్ ప్రశ్నించింది. జిల్లా జడ్జి తరపున సీనియర్ న్యాయవాది విపిన్ సంఘీ వాదించారు. అనుచిత ఆదేశాలు ఇచ్చిన జడ్జిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడం సరికాదని, దీని కోసం ఆయన్ను సస్పెండ్ చేయలేమని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ హైకోర్టును ఆశ్రయించాలని ఆదేశించింది.

## వీధి కుక్కల కేసు విచారణ వాయిదా



**న్యూఢిల్లీ:** వీధి కుక్కల కేసు విచారణను సుప్రీంకోర్టు జనవరి 7వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. మానవత్వం అంటే ఏమిటి అని ప్రశ్నిస్తూ... తదుపరి విచారణలో ఓ వీడియో ప్రదర్శిస్తామని తెలిపింది. అనంతరం విచారణను జనవరి 7కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం పేర్కొంది. వీధి కుక్కల కేసులో ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) రూపొందించిన కొన్ని నిబంధనలను వ్యతిరేకిస్తూ ఒకరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాటి పట్ల అమానవీయ ప్రవర్తన కనిపిస్తుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎంసీడీ పూర్తి విరుద్ధంగా కొన్ని నిబంధనలు రూపొందించిందని, డిసెంబర్‌లోనే అధికారులు ఈ నిబంధనలు అమలు చేయవచ్చని పిటిషనర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ పేర్కొన్నారు. వీధి కుక్కలను తొలగించవచ్చని, అయితే వాటి కోసం షెల్టర్ల నిర్మాణం పూర్తి కాలేదని అన్నారు.


SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS03UB-8773 | SANGANI SURYA KIRAN | TOYOTA INNOVA CRYSTA-P | 2017 |
| 2 | TS36T-8197 | RENUKA GOLLENA | AL 2518 FBT-T | 2018 |
| 3 | AP31TH-8989 | CHINTHAKINDI HARIKA | AL VIKING FBV-P | 2014 |

AUCTION DATE:20-12-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda. Cell : 9849955900 & 9573787776

SHRIRAM Finance **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS30K 2529 | Mallesh Budige | Ertiga VDI Bs4 Diesel 7 Seater | 2016 |
| 2 | TG27T0617 | Pandhiboina Saraiah | Bajaj Maxima Bs6 | 2024 |
| 3 | TS27G3338 | Guguloth Bhagya | Eicher 380 | 2023 |
| 4 | TS30A2477 | Jamandla Mahender | John Dere 5310 Harvester | 2017 |
| 5 | TS32C5761 | Siddlu Gulla | Tafe Cruzer 7504 Combine Harvester | 2018 |

AUCTION DATE:20-12-2025
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయ్యే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
H.No.6-2-7/35-B, 3rd Floor, Hyderabad Raod, Jangaon. Cell - 9985217519 , 98499 11793



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
EE-Div16/EE/Divn.16/(SBZ)/GHMC
NIT No.35/Cir-16/Engg-Div-16/SBZ/GHMC/2024, తేది:17.12.2025
పని పేరు: జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్ జోన్, అంబర్‌పేట్ సర్కిల్-16లో నిర్వహణ పనులు (రోడ్ నిర్వహణ పనులు). మొత్తం టెండర్ విలువ: రూ.198.50 లక్షలు, క్ర.సం.1 నుండి క్ర.సం.7 వరకు ప్రారంభ తేది: 19.12.2025న మ.3.30గం.ల నుండి, బిడ్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 24.12.2025న మ.3.30గం.ల వరకు, శ్రీమతి డి.అశలత, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, సర్కిల్-16, అంబర్‌పేట్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి. సెల్: 9963550657 / 6309920591. సంప్రదించవలసిన చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి అబిడ్స్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-16, ఎస్‌బిజెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 12140-PP/CL/ADVT/1/2025-26, Date: 18-12-2025



**సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
ఆపరేషన్: రూరల్ జోన్: హైదరాబాద్.
'ఆదా చేసిన విద్యుత్తే ఉత్పత్తి చేసిన విద్యుత్'
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు - 19/2025-26
వివరాలు:- కొత్త స్పెసిఫికేషన్ నెం. 17/25-26, 18/25-26, 19/25-26, 20/25-26 (ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది). 21/25-26, 22/25-26, 23/25-26, 24/25-26, 25/25-26, 26/25-26, 27/25-26 (ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది), 28/25-26, 29/25-26 (ఎస్టీలకు రిజర్వ్ చేయబడింది), 30/25-26, 31/25-26, 32/25-26 (మహిళలకు రిజర్వ్ చేయబడింది) మరియు స్పెసిఫికేషన్ నెం. 06/25-26 (ఎస్సీలకు రిజర్వ్ చేయబడింది) రీకాల్. 1. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభం: 19.12.2025 మధ్యాహ్నం 14:00 గంటల నుండి. 2. ఆన్‌లైన్‌లో బిడ్ డౌన్‌లోడ్ ముగింపు తేదీ & సమయం: 29.12.2025 మధ్యాహ్నం 14:00 గంటల వరకు. 3. బిడ్ సమర్పణ చివరి తేదీ & సమయం: 29.12.2025 మధ్యాహ్నం 14:30 గంటల వరకు. 4. డిడిలు/బిజిలతో పాటు హార్డ్ కాపీల కోసం చివరి తేదీ & సమయం: 30.12.2025 మధ్యాహ్నం 14:00 గంటలకు. 5. టెక్నికల్ బిడ్ తెరిచే తేదీ & సమయం: 30.12.2025 మధ్యాహ్నం 15:00 గంటలకు. 6. ధరల బిడ్ తెరిచే తేదీ & సమయం: 06.01.2026 మధ్యాహ్నం 15:00 గంటలకు. మరిన్ని వివరాల కోసం దయచేసి www.tender.telangana.gov.in మరియు www.tgsouthernpower.org వెబ్‌సైట్లను సందర్శించండి మరియు కార్యాలయాన్ని సంప్రదించండి. చీఫ్ ఇంజనీర్ /ఆపరేషన్/రూరల్ జోన్, గగన్‌విహార్, నాంపల్లి, హైదరాబాద్. ఫోన్ నెం. 040-29301311.
సం/- చీఫ్ ఇంజనీర్, ఆపరేషన్, రూరల్ జోన్, TGSPDC గగన్ విహార్, నాంపల్లి, హైదరాబాద్.
DIPR R.O. No. : 12167-PP/CL/ADVT/1/2025-26, Date: 18-12-2025



దేవాదాయ - ధర్మాదాయ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
**శ్రీ ఆంధోల్ మైసమ్మ దేవాలయము**
గ్రా॥ దండుమల్కాపురం, మం॥ చౌటుప్పల్, జి॥ యాదాద్రి భువనగిరి
లేఖ నెం. 29/SAMT/2025 సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన తేది: 18/12/2025
ఇందుమూలముగా సమస్త భక్త జనులకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించి 2025-26 సంవత్సరమునకు గాను ఈ క్రింద తెలుపబడిన టెండర్లు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ద్వార దేవస్థాన కార్యాలయము నందు తేది : 29/12/2025, సోమ వారము రోజున ఉదయం 11:30 నిర్వహించబడును.
సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ద్వార :

| క్ర.సం. | వేలంపాటకు పెట్టిన దుకాణం పేరు | కాల పరిమితి | ధారవత్తు రూ. | టెండర్ షెడ్యూల్ ధర |
|---|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి అమ్ముకొను హక్కు | 10/01/2026 నుండి 09/01/2027 | 5,00,000/- | 1000/- |
| 2. | భక్తులకు టెంట్ సామాగ్రి సరఫరచేయు హక్కు | | 1,00,000/- | 500/- |
| 3. | కిరాణా సామాగ్రి అమ్ముకొను హక్కు | | 2,00,000/- | 500/- |
| సీల్డ్ టెండర్ ద్వార : | | | | |
| 4. | CC కెమరాల నిర్వహణ | 10/01/2026 నుండి 09/01/2027 | 10,000/- | 500/- |

వేలముపాటలో పాల్గొను వారు టెండర్ షెడ్యూల్ కొరకై తేది: 27/12/2025 నుండి తేది: 29/12/2025, ఉదయం 10 గం. దేవస్థాన కార్యాలయములో పొందగలరు. మరిన్ని వివరములకు సంప్రదించ వలసిన ఫోన్ నెం. 9030932493, 9948278478.
సం./- ఎస్.మోహన్ బాబు గ్రేడ్ -1, కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 12153-PP/CL/ADVT/1/2025-26, Date: 18-12-2025



# ప్రపంచం
WORLD NEWS

## ఈ వారంలోనే అమెరికా–రష్యా చర్చలు

**మియామి :** ఉక్రేన్‌లో యుద్ధ విరమణకు సంబంధించి అమెరికా–రష్యా మధ్య రాబోయే మూడు రోజుల్లో ఫ్లోరిడాలోని మియామి సిటీలో సంభాషణలు జరుగుతాయని భావిస్తున్నారు. అమెరికా,యూరోపియన్ యూనియన్, ఉక్రేన్ ప్రతినిధుమధ్య బెర్లిన్‌లో విస్తారంగా చర్చల అనంతరం ఈ సంభాషణలు జరుగుతున్నాయి. ఉక్రేన్‌కు అమెరికా సెక్యూరిటీ గ్యారంటీలపై ఇ.యు నాయకులను, జెలెన్స్కీ ప్రతినిధులను ఒప్పించేందుకు ట్రంప్ దూతలు ఈ వారారంభంలోనే చర్చలు జరిపారు. బెర్లిన్‌లో చర్చల తర్వాత ఉక్రేన్ తన ప్రతిపాదనలను అమెరికా మధ్యవర్తులకు అందజేస్తుంది. ఈ ప్రతిపాదనలపై రష్యా అధికారులతో ట్రంప్ దూతలు చర్చలు జరుపుతారు. దీని ఆధారంగా తదుపరి సంభాషణలు, శాంతి ఒప్పంద భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

అమెరికా తరపున స్టీవ్ విట్‌కాఫ్, ట్రంప్ అల్లుడు జారెడ్ కుష్నెర్, రష్యా తరపున కిరిల్ దిమిత్రియేవ్ (రష్యా సావరిన్ వెల్త్ ఫండ్ అధిపతి) ఇతరులు పాల్గొంటారు.

## వలసలపై విజయం సాధించాం, యుద్ధాలు ఆపాం

### జాతిని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగం
### అమెరికా సైనికులకు క్రిస్మస్ బోనస్

**వాషింగ్టన్ :** క్రిస్మస్ వేడుకల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. ఏడాది పాలనలో సాధించిన ఘన విజయాలను ఏకరువు పెట్టారు. వలసలపై పాలనాపరమైన విజయం సాధించామని,ప్రపంచవ్యాప్తంగా పది నెలల వ్యవధిలోనే ఎనిమిది యుద్ధాలను ఆపామని ఆయన ప్రకటించారు. గాజా యుద్ధం ఆపామని, ఇరాన్ అణు ప్రమాదాన్ని నివారించామని ప్రకటించుకున్నారు. గడచిన 3000 సంవత్సరాలలో మొదటిసారి పశ్చిమ ఆసియాలో శాంతిని సాధించామన్నారు. ఐదు ప్రధానాంశాలను ఆయన గట్టిగా చెప్పారు. అమెరికా బలంగా ఉంది, ఎన్నో విజయాలు సాధించాం, ఆర్థికంగా ప్రపంచం ఊహించనిస్థానిలో ఎదగబోతున్నాం, అమెరికాకు ఎంతో గౌరవం లభించింది, వలసలను అడ్డుకున్నాం, ఇక మనకు ఎన్నో అవకాశాలు పెరగుతాయి అని ట్రంప్ ప్రధానంగా చెప్పారు.



క్రిస్మస్ సందర్భంగా అమెరికా సైనికులకు ,776 డాలర్ల బోనస్ ప్రకటించారు. ఆర్థిక వ్యవస్థ ఎంతో బలంగా ఉందని ఆయన ప్రకటించారు. టారిఫ్‌లు విధించడంవల్ల దేశానికి ఆదాయం గణనీయంగా పెరిగిందని ప్రజలను ఆయన మెప్పించే ప్రయత్నం చేశారు.బుధవారం రాత్రి జాతిని ఉద్దేశించి 19 నిమిషాలు ప్రసంగించారు. దేశ ఆర్థిక ఆరోగ్యం గురించి బాధపడాల్సిన పనిలేదని ఆయన భరోసా ఇచ్చారు. కానీ అమెరికాలో ఎన్నడూలేనివిధంగా నిరుద్యోగం 4.6 శాతానికి పెరిగిందని ఒకవైపు నివేదికలు వెలువడుతున్న తరుణంలో ట్రంప్ ప్రకటన వచ్చింది. దేశంలో లక్షల మంది ప్రజలు ధరల పెరుగుదల సమస్యలతో బాధపడుతున్న తరుణంలో అమెరికా సైనికులకు ఆయన బోనస్ ప్రకటించడం ముఖ్యాంశంగా మారింది. దేశంలో 1.45 మిలియన్ల మంది సైన్యం ఉన్నారు. వారికి మాత్రమే ఆయన బోనస్ ప్రకటించారు. 2026లో ట్రంప్ ఆయన ప్రభుత్వం,పార్టీ రిఫరెండంను ఎదుర్కోబోతున్నది. కీలకమైన మధ్యంతర ఎన్నికలు ట్రంప్‌కు అగ్నిపరీక్షగా మారనున్నాయి.

**ట్రంప్ మోస్ట్ వరస్ట్ ప్రెసిడెంట్**
**బైడెన్, క్లింటన్, ఒబామా విమర్శలు**

వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేసిన శిలాఫలకాలను దేశంలో ఉన్న ముగ్గురు మాజీ అధ్యక్షులు తప్పుపట్టి తీవ్రస్థాయిలో విమర్శించారు. రాజకీయ ఆరోపణలకు తావిచ్చిన ఈ శిలాఫలకాలను ట్రంప్ సమర్థిస్తూ ఈ శిలాఫలకాలను చరిత్రాత్మకమైనవిగా అభివర్ణించగా మాజీ అధ్యక్షుడు జో బైడెన్ ట్రంప్‌ను అసమర్థుడుగా పేర్కొన్నారు. ఇంతకుమును ఎన్నడూ ఇంత చెడ్డ,దుష్ట అధ్యక్షుడు లేడని అన్నారు. మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, బిల్ క్లింటన్‌లు సైతం డోనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. బైడెన్, క్లింటన్, ఒబామా చిత్రాపటాలతో ఆ కిందనే ఏర్పాటు చేసిన శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. ఈ ముగ్గురినీ అపకీర్తిపాల్చేసేవిధంగా ఆ ఫలకాలపై రాతలు రాశారు. అసాధారణమైన రీతిలో వైట్‌హౌస్‌లో ఈ శిలాఫలకాలను ఏర్పాటు చేశారు.

## తైవాన్‌కు భారీ ఆయుధ ప్యాకేజీ

### అమెరికాకే తీవ్ర నష్టం : చైనా హెచ్చరిక

**బీజింగ్:** తైవాన్‌కు మునుపు ఎన్నడూలేని రీతిలో రికార్డుస్థాయిలో 11 బిలియన్ డాలర్ల (8.2 బిలియన్ పౌండ్లు) విలువైన ఆయుధాలు సరఫరా చేసే ఒప్పందానికి అమెరికా వైట్‌హౌస్ ఆమోదం తెలియజేసింది. దీనిపై చైనా తీవ్రంగా స్పందించింది. తైవాన్‌కు ఆయుధ సరఫరా ద్వారా చైనాను అడ్డుకోవాలనుకుంటే తనను తాను నిలువునా దహనం చేసుకున్నట్లే అవుతుందని, తైవాన్ భూభాగంలో యుద్ధజ్వాలలు రగిల్చినట్లే కాగలదని హెచ్చరిక చేసింది. చైనాను అడ్డుకునేందుకు ఇలాంటి అమెరికా చర్యలు ఎప్పటికీ విజయవంతం కాబోవని స్పష్టం చేసింది.





తైవాన్‌కు అడ్వాన్స్‌డ్ రాకెట్ లాంఛర్లు, సెల్ఫ్ ప్రొఫెల్డ్ హోవిట్జర్స్, వివిధ రకాల క్షిపణులను ఈ ఒప్పందం కింద తైవాన్‌కు సరఫరా చేసేందుకు అమెరికా గురువారం ఆమోదం తెలియజేసింది. ఐతే ఈ ప్యాకేజీకి ఇంకా అమెరికా చట్టసభ ఆమోదముద్ర వేయాల్సి ఉంది. జనవరినెలలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తైవాన్‌కు ఆయుధాలు విక్రయించేందుకు ఆయన చేసిన రెండో ఒప్పందం ఇది. ఈ సందర్భంగా తైవాన్ రక్షణమంత్రిత్వశాఖ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. తైవాన్‌కు ఇబ్బడిముబ్బడిగా ప్రమాదం పెరుగుతున్న తరుణంలో ఈ ఆయుధాలు రక్షణ వ్యవస్థను బలోపేతం చేసుకోవడానికి దోహదం చేస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా ఈ పరిణామాలపై చైనా తీవ్రస్థాయిలో మండిపడింది. తైవాన్‌కు బహిరంగంగా అధునాతన ఆయుధాలను సరఫరా చేసేందుకు బహిరంగ వ్యాపార విక్రయ చర్యలు చేపట్టడాన్ని చైనా విదేశీమంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. తక్షణం ఆయుధాల విక్రయ చర్యలను నిలిపివేయాలని అమెరికాను తైవాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గువో జియాకున్ డిమాండ్ చేశారు. బీజింగ్‌లో గురువారం ఆయన పత్రికాగోష్టిలో మాట్లాడుతూ, ఈ ఆయుధ విక్రమ ఒప్పందం ఒకే చైనా అనేసూత్రాన్ని, అమెరికా–చైనా మధ్య కుదిరిన ఉమ్మడి ఒప్పందాన్ని కూడా ఉల్లంఘిస్తోందని విమర్శించారు. చైనా భద్రత, ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమాధికారాలను ఈ ఆయుధ విక్రయ ఒప్పందం ఖరారు తీవ్రంగా ఉల్లంఘిస్తోందని ఆయన అన్నారు. తైవాన్ జలసంధి అంతటా శాంతి, స్థిరత్వాలను ఈ ఒప్పందం దెబ్బతీస్తుందని హెచ్చరించారు. తైవాన్ స్వాతంత్ర వేర్పాటువాదులు బలవంతంగా స్వాతంత్ర్యంకోసం బలప్రయోగానికి సిద్ధం అవుతున్నారని, అందుకు వారిని ఈ చర్య ఉసిగొల్పుతుందని అన్నారు. ఈ విధమైన అమెరికా చర్యలవల్ల తైవాన్ యుద్ధ సమస్యలలో కూరుకుపోతుందని, చైనాను అదుపు చేయడంకోసం ఇలాంటి చర్యలకు పాల్పడితే అది అమెరికాకే నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు.

### సిపిఎన్–యుఎంఎల్ పార్టీ చైర్మన్‌గా..
## కె.పి.శర్మ ఓలి తిరిగి ఎన్నిక

**కాట్మండు :** నేపాల్‌లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సిపిఎన్–యుఎంఎల్ పార్టీ ఛైర్మన్‌గా కె.పి.శర్మ ఓలి తిరిగి ఎన్నికయ్యారు. నేపాల్‌లో ఇటీవల జనరేషన్ జెడ్ విద్యార్థుల ఉద్యమం కారణంగా పదవీచ్యుతుడైన ప్రధాన మంత్రి కె.పి.శర్మ ఓలిని 11వ పార్టీ జనరల్ కన్వెన్షన్‌లో నాయకులు నేపాల్–యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్ (సిపిఎన్–యుఎంఎల్) పార్టీ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఓలికి వ్యతిరేకంగా ఈశ్వర్ పోఖరెల్ (71) పోటీ చేశారు. పోఖరెల్‌కు 584 ఓట్లు లభించగా, కె.పి.శర్మ ఓలికి భారీగా 1,663 ఓట్లు లభించడంతో ఆయన ప్రజాస్వామ్యబద్ధంగా తిరిగి పార్టీ నాయకుడయ్యారు. పార్టీ అత్యున్నత కమిటీలో 19 ఆఫీస్ బేరర్లకుగాను 17 మంది ఓలి తరపు ప్యానల్ నుండి విజయం సాధించారు. పోఖరెల్ ప్యానల్ నుండి ఇద్దరు ఆఫీస్ బేరర్లు గెలిచారు. ఈ సందర్భంగా వందలమంది కాట్మండులోని భృకుటిమండపంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గడచిన పదేళ్ళుగా ఓలి పార్టీ ఛైర్మన్‌గా ఉన్నారు. పోఖరెల్‌కు పార్టీ మాజీ అధ్యక్షుడు బిద్యాదేవి భండారీ మద్దతుగా నిలిచారు. భక్తపూర్ జిల్లా మొదట భారీ బహిరంగ సభలో సిపిఎన్–యుఎంఎల్ పార్టీ సదస్సు ప్రారంభమైంది.



## ఆస్ట్రేలియాలో విద్వేష ప్రసంగాలపై చట్టం

**సిడ్నీ:** ఆస్ట్రేలియాలో విద్వేష ప్రసంగాలను అణచివేస్తామని ఆ దేశ ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బెనీస్ ప్రకటించారు. గడచిన ఆదివారం (డిసెంబరు 14) సిడ్నీ బాండీ బీచ్‌లో యూదుల ఉత్సవం హనుక్కా వేడుకలు చేసుకుంటున్న వందల మందిపై తండ్రీ కొడుకులు కాల్పులు జరిపిన ఘటనను ఆస్ట్రేలియా ప్రభు త్వం చాలా తీవ్రంగా పరిణించింది.

ఆస్ట్రేలియాలో ఇకమీదట విద్వేష ప్రసంగాలకు, హింస, ఉగ్రవాద చర్యలకు అవకాశం లేకుండా అణచివేస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆస్ట్రేలియా పార్లమెంటు ఈ మేరకు కఠిన చట్టాలు తెచ్చేందుకు దృష్టి సారించిందని ఆల్బెనీస్ చెప్పారు. విద్వేష ప్రసంగాలు ప్రోత్సహించేవారి వీసాలను రద్దుచేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు వీసాలు రద్దు చేయడానికి హోంశాఖకు అదనపు అధికారాలు సమకూర్చినట్లు చెప్పారు. ఉగ్రవాదాన్ని అణచివేయాలంటే, ఆస్ట్రేలియా అంతకంటే బలంగా, పటిష్టంగా ఉండాలన్నారు. గడచిన ఆదివారం జరిగిన కాల్పుల్లో 15 మంది యూదు కుటుంబీకులు మరణించారు. ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు స్పందించాయి. ఇస్లామిక్ రాడికల్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా అన్ని దేశాలు స్పందించి పోరాటం చేయాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉండగా బాండీబీచ్‌లో కాల్పులు జరిపిన తండ్రీ కొడుకులలో తండ్రి సాజిద్ అక్రమ్ భారతదేశం హైదరాబాద్ టోలీచౌకీకి చెందినవాడని వార్తలు వెలువడిన తర్వాత భారత ప్రభుత్వం కూడా ఈ కేసు దర్యాప్తు నిమిత్తం ఒక బృందాన్ని సహాయంగా పంపాలని నిర్ణయించుకుంది. ఐఎస్ఐఎస్ కార్యకలాపాలకు, సాజిద్ అక్రమ్‌కు ఉన్న సంబంధాలు ఏమిటో తెలుసుకోవడానికి ఆస్ట్రేలియా అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ దర్యాప్తులో భారతదేశం కూడా భాగస్వామిగా ఉండాలని భావిస్తోంది.

## ఓటు ధర ఘనం
(మూడవ పేజీ తరువాయి)

రికార్డు స్థాయికి చేరుకుంది. పోటీలో ఉన్న అభ్యర్థులందరూ తటస్థ ఓట్లకు టెండర్లు వేసి భారీ మొత్తమే చెల్లించుకున్నారు. ఐదు ఓట్లు కలిగిన ఓ కుటుంబానికి ఓ గ్రామంలో రూ.1.20 లక్షలు వచ్చాయంటే తటస్థ ఓటర్లకు ఉన్న డిమాండ్ అవగతమవుతుంది. జనరల్ రిజర్వ్డ్ అనే తేడా లేకుండా అన్ని పంచాయతీలలోనూ ఓట్ల కొనుగోలు యథేచ్ఛగా సాగింది. గ్రామం తీరును బట్టి ధరలో హెచ్చు తగ్గులు ఉన్నాయి తప్ప ఓట్ల కొనుగోలు మాత్రం ఆగలేదు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో ఒక వార్డులో ఓటు ధర రూ.25వేలు పలికింది. అత్యధిక ధర చెల్లించిన అభ్యర్థి రెండు ఓట్ల తేడాతో ఓడిపోయినట్లు సమాచారం. రాజకీయ పార్టీలు సైతం ఓట్లు కొని నెగ్గగలిగిన వారిని మాత్రమే బరిలో దించాయి.

ఖమ్మం సమీపంలోని 3,500 ఓట్లు కలిగిన ఓ పంచాయతీలో ముగ్గురు అభ్యర్థులు చేసిన ఖర్చు రూ.2.10 కోట్లు ఇటువంటివి చాలా పంచాయతీలు ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అధికార యంత్రాంగం నగదు పంపిణీపై గతంలో ప్రత్యేక దృష్టి సారించేది. గడిచిన రెండు ఎన్నికల నుంచి ఆ విషయమే అధికారులు మరిచిపోయారు. ఇప్పుడు సాధారణ ఎన్నికల్లోనే పోలీసులు వారు అటు పంచుతున్నారు మీరు ఇటు పంచండి అంటూ సూచనలు ఇస్తున్నారు. ఇక పంచాయతీ ఎన్నికల్లో విచ్చలవిడి ఖర్చు జరుగుతుందని సమాచారం ఉన్నా రాష్ట్ర వ్యాప్తంగా నగదు పట్టుకున్న దాఖలాలు లేవు. ఈ విచ్చలవిడి ఖర్చుకు అధికార యంత్రాంగం నుంచి పరోక్ష సహకారం అందుతుందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతుంది. గతంలో ఎన్నికలకు సంబంధించి ఓ సామెత ఉండేది. ఓడిన వాడు ఆరోజు ఏడుస్తాడు. గెలిచిన వాడు తర్వాత బాధపడతాడని చెబుతుండే వారు. ఇప్పుడు చాలా మంది సర్పంచ్‌లది అదే పరిస్థితి. ఎన్నికల బరిలోకి దిగిన తర్వాత ఖర్చుకు వెనుకాడకుండా పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. ఎంతగా ఖర్చు చేశారంటే పాతికేళ్లలో ఆ పంచాయతీకి ప్రభుత్వం ఇచ్చే నిధుల కంటే రెట్టింపు ఖర్చు చేశారు. తెచ్చిన అప్పులు చేసిన ఖర్చును తలచుకుని తీవ్ర వేదనకు గురవుతున్నారు. గెలిచిన రోజు కేకలు, శుభాకాంక్షలు మస్తు ఆనందాన్ని ఇచ్చినా లెక్కలు చూసుకుని గుండెలు బాదుకుంటున్నారు కొందరు. పోటీలు పడి ఖర్చు చేసిన చోట పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది. మొత్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు ఓటర్లకు సరికొత్త దారి చూపాయి. గ్రామ పంచాయతీలకు తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పెద్ద మొత్తంలో నగదు పంపించినా ప్రస్తుత, మాజీ ప్రజా ప్రతినిధులు రేపటి ఎన్నికలను ఊహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకటి మాత్రం నిజం భవిష్యత్తులో చెల్లింపులు లేకుండా ఓట్లు పోలయ్యే పరిస్థితి లేదు. ఇది భవిష్యత్తుకు సూచనో, హెచ్చరికనో కానీ జరిగేది వాస్తవం.

## బిఆర్‌ఎస్‌ను బలహీనపర్చే రేవంత్ రెడ్డి కుట్రలు ఫలించవు..

### నేను..కెటిఆర్ మరింత సమర్ధవంతంగా పోరాటం చేస్తాం: హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనకు, కెటిఆర్‌కు మధ్య మిత్ర బేదాన్ని సృష్టించి, తద్వారా బిఆర్‌ఎస్‌ను బలహీన పరచాలని సిఎం రేవంత్ రెడ్డి 'చీప్‌ట్రిక్'ను ప్లే చేస్తున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు అన్నారు. రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలకు ఎవ్వరూ పడిపోరని,ఆయన కుట్రలకు, కుత్సితాలు ఫలించబోవమని స్పష్టం చేశారు. ఎప్పటికైనా హరీశ్ రావు గుండెల్లో ఉండేది కెసిఆర్ అని, గులాబీ జెండానే అని అన్నారు.

దాష్టీకాలు, దుర్మార్గలకు వ్యతిరేకంగా తాను, కెటిఆర్ మరింత సమన్వయంగా, మరింత సమర్థవంతంగా రెట్టించిన ఉత్సాహంతో పోరాడుతామని, సిఎం అవినీతిని ఎండగడుతామని, అసమర్థతను నిలదీస్తామని హరీశ్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యమ కాలం నుంచి నేటి వరకు తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్న రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్‌ను గద్దె దించుతామని, తన, కెటిఆర్, గులాబీసైనికుల లక్ష్యం కూడా అదేనని అన్నారు. బిఆర్ ఎస్ విజయపథంలో పురోగమించడం ఖాయమని, మరోసారి కెసిఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత సిఎం రేవంత్ రెడ్డిలో ఫ్రస్టేషన్ పీక్ స్థాయికి చేరిందని, రోజురోజుకూ పరిస్థితులు చేజారి పోతున్నాయనే సత్యాన్ని సిఎం జీర్ణించుకోలేకపోతున్నారని హరీశ్‌రావు అన్నారు.

## ఉపాధికి పాతర (మూడవ పేజీ తరువాయి)

ధర్మేంద్ర యాదవ్ సహా విపక్ష నేతలు ఈ కొత్త బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. భారత జాతిపిత మహాత్మా గాంధీ పేరును చట్టం నుంచి తొలగించడం ఆయనను అవమానించడమేనని ప్రతిపక్షాలు తీవ్రంగా మండిపడ్డాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం అధిక శాతం నిధులు ఇచ్చేదని... కొత్త చట్టం ప్రకారం ఇప్పుడు 60:40 నిష్పత్తిలో నిధుల భారం పడటం వల్ల పేద రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేయలేవని... పేదలకు పనుల్లేక అవస్థలు పడతారని ప్రియాంక గాంధీ వాద్రా సభ దృష్టికి తెచ్చారు. ఈ చట్టం వల్ల ఉపాధి హామీ పథకం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పని సాధించేందుకు పేదప్రజలు కష్టపడి సాధించిన హక్కుపై ప్రభుత్వం దాడి చేస్తోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. రైతులు, వ్యవసాయ కార్మికుల మధ్య ఘర్షణ సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, భూమిపై నియంత్రణ హక్కులున్నవారిని మెప్పించడానికే కొన్ని నిబంధనలు తెచ్చారని నిరసించా రు. వ్యవసాయ పనులకు కూలీలు అందుబాటులో ఉండేలా చేస్తామనేది పచ్చి మోసమన్నారు. ఇక ఈ కొత్త బిల్లును సమర్థిస్తూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు చేశారు. పాత చట్టం అవినీతికి నిలయంగా మారిందని.. కొత్త చట్టం పారదర్శకతను తీసుకువస్తుందని పేర్కొన్నారు. 100 రోజుల నుంచి 125 రోజులకు ఉపాధిని పెంచడం ద్వారా గ్రామీణ పేదలకు మరింత మేలు జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గతంలో అన్ని పథకాలకు జవహర్ లాల్ నెహ్రూ పేరు పెట్టిందని, ఇప్పుడు పేర్లు మార్చడంపై మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కేవలం పనిపైనే దృష్టి పెడుతుందన్నారు.

**మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడతాం: ఖర్గే**

అంతకు ముందు విబి జి రామ్ జి బిల్లును వ్యతిరేకిస్తూ పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. వెంటనే బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అని రాసి ఉన్న పెద్ద బ్యానర్‌తో గాంధీ విగ్రహం నుంచి మకర ద్వారం వరకు ప్రతిపక్ష ఎంపీలు ర్యాలీ చేశారు. ఇందులో కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖడ్గే, ఎంపీలు కేసీ వేణుగోపాల్, కనిమొళి, టీఆర్ బాలు, ఏ రాజా తదితరులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరును తొలగించడం ద్వారా కేంద్రం ప్రజాస్వామ్యాన్ని చంపేస్తోందని ఎంపీ కేసీ వేణుగోపాల్ విమర్శించారు. వీబీ జీ రామ్ జీ బిల్లును పార్లమెంటు స్థాయి సంఘానికి పంపాలని డిమాండ్ చేశారు. కాగా ఖడ్గే 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ... మోదీ సర్కారు మహాత్మా గాంధీని అవమానించడమే కాకుండా, గ్రామాల్లో సామాజిక, ఆర్థిక పరివర్తన తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన పని హక్కును కూడా అణచివేసిందని ఆగ్రహించారు. ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టం చేశారు.

**2005లో 'ఉపాధి'కి బీజం**

గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పించడం కోసం 2025లో అప్పటి యూపీఏ ప్రభుత్వం 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని తీసుకొచ్చింది. 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు. ఇప్పుడు మోదీ సర్కారు తీసుకొచ్చిన కొత్త బిల్లు ప్రకారం, పేరు మార్చడంతోపాటు ఉపాధి హామీ పథకం అమలులో మార్పులు రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి సంవత్సరంలో కనీసం 125 రోజుల పాటు వేతనంతో కూడిన ఉపాధి కల్పిస్తామని కేంద్రం చెబుతోంది. ఇక పథకం అమలును పర్యవేక్షించడమే తమ బాధ్యతని... నిర్వహణ, జవాబుదారీతనం రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అవుతుందని బిల్లులో పేర్కొన్నారు. రైతులకు కూలీల లభ్యత పెరిగి కూలి రేట్లు నియంత్రణలో ఉండేందుకు వీలుగా వ్యవసాయ సీజన్లో 60 రోజులపాటు ఉపాధి హామీ పనులను నిలిపివేయాలని బిల్లులో ప్రతిపాదించారు. ఉపాధి కల్పించడంతోపాటు నాలుగు ప్రాధాన్య రంగాల్లో చిరకాలం మన్నే మౌలికవసతుల కల్పనకు కొత్త చట్టం వీలు కల్పిస్తుందని బిల్లులో పేర్కొనడం జరిగింది.

**నేడు దేశవ్యాప్త నిరసనలకు వివిధ సంఘాల పిలుపు**

ఎంజీ నరేగా చట్టం బదులు కేంద్రం తీసుకువచ్చిన జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని వివిధ సంఘాలు నిర్ణయించాయి. 'నరేగా సంఘర్ష్ మోర్చా' ఢిల్లీ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. గ్రామీణ ఉపాధి పథకం స్వరూపాన్నే మార్చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పనిదినాల సంఖ్య పెంచడం కంటితుడుపేనని, వ్యయభారం రాష్ట్రాలపై గణనీయంగా పెరగబోతోందని చెప్పారు. పని చేయడాన్ని హక్కుగా తొలిసారి మార్చిన ఎంజీ నరేగాను పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని, కొత్త బిల్లు విషయంలో అలా జరగలేదని ఆర్థికవేత్త ప్రభాత్ పట్నాయక్ చెప్పారు. ఏకాభిప్రాయం లేకుండా కేవలం మెజారిటీ ఓటు సాయంతో ప్రధాన మార్పుల్ని చేయడం తగదన్నారు. రాష్ట్రాలు, కార్మిక సంఘాలతో ఎంతో లోతుగా చర్చించాకే గతంలో ఉపాధి హామీ చట్టాన్ని తెచ్చారని సీపీఐ జాతీయ కార్యదర్శి అనీ రాజా గుర్తుచేశారు. హక్కును కాస్తా ప్రభుత్వమిచ్చిన బహుమతిగా మార్చేస్తున్నారని మరో ఆర్థికవేత్త జయతీఘోష్ విమర్శించారు. శుక్రవారం మొదలయ్యే నిరసనలు ఇకపై దేశమంతటా కొనసాగుతాయని ఉద్యమకారుడు యోగేంద్ర యాదవ్ చెప్పారు.

## సుక్మాలో ఎన్‌కౌంటర్
(మూడవ పేజీ తరువాయి)

జిల్లాలో డిసెంబర్ 3వ తేదీన పోలీస్ బలగాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరగ్గా 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మతి చెందారు. మరో ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, సీఆర్‌పీఎఫ్ బలగాల కూంబింగ్ కొనసాగుతోంది. తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు చత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో 278 మంది మావోయిస్టులు మతి చెందారు. బీజాపూర్, దంతెవాడ సహా ఏడు జిల్లాలతో కూడిన ఒక్క బస్తర్ డివిజన్‌లోనే 246 మంది మరణించారు. మరోవైపు, మావోయిస్టులు లొంగుబాట పడుతున్నారు. గత వారంలో మరో 10 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా పోలీసుల ఎదుట లొంగిపోయిన వారిలో ఆరుగురు మహిళలు ఉన్నారు. మావోయిస్టులపై రూ.33 లక్షల చొప్పున రివార్డ్ ఉంది. ఈ ఏడాది జిల్లాలో మొత్తం 263 మంది మావోయిస్టులు హింసను విడిచిపెట్టారని పోలీసు అధికారులు తెలిపారు. పూనా మార్గెం పునరావాస, సామాజిక సమ్మిళితం కార్యక్రమంలో భాగంగా మావోయిస్టులు లొంగిపోయారని అధికారులు వెల్లడించారు. డిసెంబర్ 8న చత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో గల ఖైరాగఢ్ ప్రాంతంలో పలువురు మావోయిస్టులు ఆయుధాలతో సహా పోలీసుల ఎదుట లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఎంఎంసీ(మధ్యప్రదేశ్‌మహారాష్ట్రచత్తీస్‌గఢ్) జోన్‌లో చురుకుగా పనిచేసిన మావోయిస్టు కమాండర్ రామ్‌ధేర్ మజ్జీ తన 12 మంది సహచరులు సహా పోలీసుల సమక్షంలో లొంగిపోయాడు.

## పాలనపై తీర్పు (మూడవ పేజీ తరువాయి)

కూడా పునరావృతం కానుంది.'' అని సిఎం చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని, గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ప్రభుత్వంపై మరింత బాధ్యతను పెంచిందన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సి.దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్క, జి.వివేక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి సిఎం మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని సిఎం చెప్పారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నామని, 94 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే 87 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించిందన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తామన్నారు.

**కోపంతో, అసూయతో ప్రజలకు మంచి జరగకుండా అడ్డుకోవద్దు**

ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదని, ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా కొందరికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఒకాయన (బిఆర్‌ఎస్ నేతలను ఉద్దేశించి) కడుపులో మూసీలో కాలుష్యం కంటే ఎక్కువ విషం కనిపిస్తోంది. మీ కోపంతో అసూయతో ప్రజలకు మంచి జరగకుండా అడ్డుకోవద్దు. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతాం. మాజీ సిఎం కెసిఆర్ క్రియాశీల రాజకీయాల్లో ఉండగానే ఆయనను ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చాం. ప్రస్తుతం కెసిఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరు' అని సిఎం అన్నారు.

**అసెంబ్లీలో చర్చించి ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికలపై ముందుకు వెళతాం**

బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపిటిసి, జెడ్‌పిటిసి, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయమని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి చెప్పారు.

**కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం**

కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'మాజీ సిఎం కెసిఆర్‌కు సూటిగా సవాల్ విసురుతున్నా. ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వానికి లేఖ రాయమనండి. కృష్ణా జలాలపై ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. ఎప్పుడంటే అప్పుడు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తాం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేళ్లలో తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం చేసింది బిఆర్‌ఎస్, కెసిఆర్. గోదావరి, కృష్ణా జలాలపై వారు చేసిన ద్రోహం ఆధారాలతో సహా నిరూపిస్తాం.

**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు అద్భుతమైన ఫలితాలు**

''రాష్ట్రంలోని 12,702 పంచాయతీలకు గాను 7,527 చోట్ల కాంగ్రెస్, 808 స్థానాల్లో కాంగ్రెస్ రెబల్స్ ఈ ఎన్నికల్లో గెలుపొందారు. మొత్తానికి 8,335 పంచాయతీలు, 66 శాతం ఫలితాలను కాంగ్రెస్, కాంగ్రెస్ రెబల్స్ సాధించారు. బిఆర్‌ఎస్, బిజెపి ఒక కూటమిగా ఈ ఎన్నికల్లో పోటీచేసి 3511 బిఆర్‌ఎస్, 710 బిజెపి గెలుపొందాయి. బిఆర్‌ఎస్. బిజెపి కూటమి మొత్తం 4,221 పంచాయతీలు (33శాతం) గెల్చుకున్నాయి. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సిపిఐ, సిపిఐ(ఎం), ఇతరులు గెలుచుకున్నారు'' అని సిఎం వివరించారు.

**సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం**

పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణమని సిఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ.500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు, ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని అని సిఎం వివరించారు.

**ఏడో గ్యారంటీని అమలు చేస్తున్నాం**

ప్రభుత్వం ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజలకు స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని అందించామని సిఎం చెప్పారు. పన్నెండు వేలకు పైగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్దంగా జరిగాయని, ఎక్కడా ప్రతిపక్షాల పట్ల ఓక్ష సాధింపు చర్యలు జరగలేదని, హోదాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను ప్రభావితం చేసేలా తాము నిర్ణయం తీసుకోలేదన్నారు. ఎన్నికల్లో గెలిస్తే కళ్లు నెత్తికెక్కినట్లుగా మేం ఏనాడు వ్యవహరించలేదు

మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర బిజెపి చేస్తోందని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని సిఎం అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## సజ్జనార్ చేతికి ఫోన్ ట్యాపింగ్ కేసు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేశారు. ఈ మేరకు డీజీపీ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే విచారణ పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. సజ్జనార్తో పాటు మరో నలుగురు ఐపీఎస్లతో కలిపి మొత్తం 9 మంది పోలీసు అధికారులను ఈ సిట్లో నియమించారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసును వెంటనే సిట్ దర్యాప్తునకు స్వీకరించనుంది.

## అల్పాదాయ వర్గాలకు అందుబాటు ధరల్లో ఫ్లాట్లు

### తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ విక్రయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రత్యేకంగా అల్పాదాయక వర్గాల ప్రజలకు (ఎల్ఐజి) హైదరాబాద్, ఖమ్మం, వరంగల్ ప్రాంతాల్లోని మొత్తం 339 ఫ్లాట్లను అందుబాటు ధరలతో ఎక్కడ ఉన్నవి, అలానే అనే ప్రాతిపదికన తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ విక్రయించనుంది. గచ్చి బౌలి ప్రాంతం లోని ఫ్లాట్ల ధర రూ.26 లక్షల నుంచి గరిష్టంగా రూ 36.20 లక్షల వరకు, వరంగల్ లో రూ.19 నుంచి రూ 21.50 లక్షలకు, ఖమ్మంలో రూ.11.25 లక్షలకే ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి గౌతం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ ప్రాంతాల్లోని ఫ్లాట్లను కొనుగోలు చేయడానికి ఆసక్తి ఉన్న వారు ఆన్ లైన్, మీ సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గచ్చిబౌలి ప్రాంతం ఫ్లాట్ల కేటాయింపు లాటరీ ప్రక్రియ జనవరి 6 వ తేదీన, వరంగల్ లోని ఫ్లాట్ల కేటాయింపు జనవరి 8న, ఖమ్మం ఫ్లాట్ల లాటరీ జనవరి 10 వ తేదీన నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ విక్రయాలకు సంబధించిన వివరాలన్నీ కూడా హౌసింగ్ బోర్డు వెబ్ సైట్ https://tghb.cgg.gov.in లో అందుబాటులో ఉన్నాయని, అల్పాదాయ వర్గాల ప్రజలకు (ఎల్ ఐ జి) మంచి వసతులతో కూడిన సొంత ఇంటి వసతిని కల్పించాలనే ఉద్దేశ్యంతో ఇప్పటికే అనేక కుటుంబాలు నివసిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్ మెంట్ లలోని ఫ్లాట్లను కేటాయించాలనే నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. అభివృద్ధి చెందిన, అత్యధిక డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోని ఫ్లాట్లను బహిరంగ మార్కెట్ కంటే చాలా తక్కువ ధరలతో విక్రయిస్తున్నామన్నారు. వివిధ ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో హౌసింగ్ బోర్డు నిర్మించిన అపార్ట్ మెంట్ లలోని ఈ ఫ్లాట్లను ప్రత్యేకించి అఫర్డెబుల్ హౌసింగ్ కింద అల్పాదాయ వర్గాల ప్రజల సొంత ఇంటి కలను నెరవేర్చాలన్న లక్ష్యంతో ఏడాదికి ఆరు లక్షల రూపాయల (నెలకు రూ.50 వేలు ) ఆదాయం ఉన్న వారికే వీటిని కేటాయించాలనే నిర్ణయించారు. హైదరాబాద్ గచ్చిబౌలి లోని 111 ఫ్లాట్లు, వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని అపార్ట్ మెంట్ లో 102 , ఖమ్మంలో శ్రీరామ్ హిల్స్ వద్ద 126 ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని విపి గౌతం తెలిపారు. వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకుంటే వారికి పూర్తి పారదర్శకమైన విధానంలో లాటరీ పద్ధతిలో కేటాయిస్తామని అన్నారు. ఫ్లాట్ల విస్తీర్ణం 450 చదరపు అడుగుల నుంచి 650 చదరపు అడుగుల వరకు ఉన్నదన్నారు.

### బిసి రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ


## ఎందుకు చేయడం లేదు ?

### అవ్వారు వేణు కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జనాభా గణాంకాలు లేకున్నా అగ్రకులాలకు 10 శాతం ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేసిన కేంద్రం, నేడు అన్ని శాస్త్రీయ ఆధారాలు ఉన్న 42శాతం బిసి రిజర్వేషన్లపై వెనుకడుగు వేయడం సామాజిక న్యాయంపై ద్రోహమని బిసి ఇంటలెక్చువల్స్ ఫోరం స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ అవ్వారు వేణు కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయి నుంచి బిసి వాళ్ళందరూ అన్ని కులాలను కలుపుకొని, తమ ఆవేదన యొక్క దుఃఖాన్ని ఒక ఉద్యమ చైతన్యంగా మార్చాలని కోరారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించి, గవర్నర్ ద్వారా రాష్ట్రపతి వద్దకు చేరిన 42శాతం బిసి రిజర్వేషన్ల బిల్లు గడిచిన పార్లమెంట్ సమావేశాల్లోనూ, ప్రస్తుతం జరుగుతున్న సమావేశాల్లోనూ అజెండాలోకి రాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ బద్ధంగా అన్ని అర్హతలు ఉన్నా కేంద్రం మౌనం పాటించడం బిసిలపై జరుగుతున్న రాజకీయ నిర్లక్ష్యమని ఆయన అన్నారు. అన్ని అర్హతలూ ఉన్నా, కేంద్ర ప్రభుత్వం మౌనం ఎందుకు? బిసిల వెనుకబాటుతనాన్ని స్పష్టంగా చూపించే కుల గణన సర్వే, డెడికేషన్ కమిషన్ నివేదిక, తెలంగాణ శాసనసభ ఆమోదం అన్నీ పూర్తయినా కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోకపోవడాన్ని డాక్టర్ వేణు కుమార్ తీవ్రంగా విమర్శించారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీల మధ్య బహిరంగ పోరాటాలు కనిపించినా, బిసి హక్కుల విషయంలో మాత్రం గల్లీలో కుస్తీ ఢిల్లీలో స్నేహం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు పెట్టిన బిసిలు ఆత్మస్థైర్యంతో ముందుకు వస్తారని ఆయన ప్రకటించారు. 42శాతం బిసి రిజర్వేషన్ల బిల్లును తక్షణమే పార్లమెంటులో చర్చకు తీసుకువచ్చి, తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బిసిల హక్కుల కోసం సాగుతున్న ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, భవిష్యత్తులో రాజకీయంగా గట్టి సమాధానం తప్పదని హెచ్చరించారు.

## ప్రజా ప్రయోజనాలు విస్మరించిన ప్రభుత్వం

### భూమిని కబ్జా చేసిన ఎమ్మెల్యే అరికెపూడి : దాసోజు శ్రవణ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తయ్యాయని, ఈ రెండేళ్ల పాలనలో ప్రజా ప్రయోజనాలను విస్మరించి, రియల్ ఎస్టేట్ మాఫియాగా వ్యవహరిస్తోందని బిఆర్ఎస్ ఎంఎల్‌సి దాసోజుశ్రవణ్ ఆరోపించారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దాసోజుశ్రవన్ మాట్లాడుతూ పార్టీ పిరాయింపులకు పాల్పడిన నాయకులకు నజరానాలుగా వేల కోట్ల రూపాయల భూములను అక్రమంగా బదలాయిస్తున్నారన్నారు. గాజుల రామారం ప్రాంతంలో ఎంఎల్‌ఏ అరికెపూడి గాంధీ 11 ఎకరాల భూమిని అక్రమంగా కబ్జా చేశారని, ఆయన పార్టీ మారిన వెంటనే ఆ భూమిని ల్యాండ్ రెగ్యులరైజ్ చేయడం ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం గాజుల రామారం పరిధిలోని సర్వే నంబర్ 307లో మొత్తం 411 ఎకరాల భూమి ఉండగా, ఇందులో 317 ఎకరాలను ల్యాండ్ సీలింగ్ చట్టం కింద ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వివరించారు. మిగిలిన 123 ఎకరాల 28 గుంటల భూమి మాత్రమే ప్రైవేట్ భూమిగా రికార్డుల్లో ఉందని, కానీ ల్యాండ్ సీలింగ్ కిందకి వచ్చే భూములపై అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in లో చూడగలరు.

**ఓపెన్ ఇ-టెండర్ నోటీస్ నెం.: DRM/Works/BZA/43/2025, తేదీ: 15-12-2025** PUB/1613

భారత రాష్ట్రపతి తరపున మరియు వారి ఆదేశానుసారం, అధో సంతకం చేసిన వారు ఈ క్రింది పనుల కోసం పేర్కొన్న తేదీన సాయంత్రం 15:00 గంటల వరకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

**క్రమ సంఖ్య : 1. టెండర్ నెం.:** E-52-నార్త్-BZA-2025. **పని వివరాలు:** పని పేరు: ADEN/SLO సబ్ డివిజన్ - సిబ్బంది క్వార్టర్లకు (SLO, CCT & COA వద్ద బహుళ అంతస్తుల బ్లాక్‌లు) ప్రతిపాదిత మెరుగుదలలు చేయడంలో భాగంగా పాడైపోయిన తలుపులు మరియు కిటికీలను మార్చడం, దోమల వలలను ఏర్పాటు చేయడం, విరిగిన/ దెబ్బతిన్న డ్రాప్ గోడలు, మెట్ల చేతి పట్టులకు మరమ్మతులు, తుప్పు పట్టిన పైప్‌లైన్‌లను మార్చడం, మురుగు కాలువల్లో పూడిక తీయడం మరియు శిధిలాలను తొలగించడం మొదలైనవి. (SLO- క్వార్టర్ నెం. 111, 113, 116, 118, 124 & 134 - మొత్తం 76 యూనిట్లు, CCT - క్వార్టర్ నెం. 50, 52, 72, 75, 76 & 86 మొత్తం 52 యూనిట్లు & COA - క్వార్టర్ నెం. 78, 107 & 108 - మొత్తం - 31 యూనిట్లు) (అంబ్రెల్లా వర్క్ ప్రాజెక్ట్ ID: 11.06.51.24.3.55.002, 2024-25). **పని పూర్తి చేయు కాలం:** 06 (ఆరు నెలలు). **టెండర్ విలువ:** రూ. 1,97,35,816/-. **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** రూ. 2,48,700/-. **ముగింపు తేదీ:** 07–01–2026

**క్రమ సంఖ్య : 2. టెండర్ నెం.:** E-53-నార్త్-BZA-2025. **పని వివరాలు:** పని పేరు: CCT- ఒకటో నెంబరు ప్లాట్‌ఫారమ్‌పై మరుగుదొడ్లు, VIP లాంజ్, బుకింగ్ కార్యాలయం, పార్శిల్ కార్యాలయం మరియు ఇతర ప్రయాణీకులకు సంబంధించిన సౌకర్యాలతో సహా వెయిటింగ్ హాళ్లు మరియు గదుల మెరుగుదలలు & ప్లాట్‌ఫారమ్ ఉపరితలం, నీటి సరఫరా ఏర్పాట్లు, SS వాటర్ బూత్‌లు, ప్లాట్‌ఫారమ్ నెం. 2 & 3పై కూర్చునే బెంచీల మెరుగుదలలు. (అంబ్రెల్లా వర్క్ ప్రాజెక్ట్ ID: 11.06.53.24.3.55.071 ఆఫ్ 2024-25) **పని పూర్తి చేయు కాలం:** 12 (పన్నెండు నెలలు). **టెండర్ విలువ:** రూ. 8,30,18,959/-. **ముందస్తు ధరావత్తు:** రూ. 5,65,100/-. **ముగింపు తేదీ:** 07-01-2026.

**క్రమ సంఖ్య : 3. టెండర్ నెం.:** E-54-నార్త్-BZA-2025. **పని వివరాలు:** పని పేరు: YLM- రెండో నెంబరు ప్లాట్‌ఫారంపై మిగిలిన పొడవుకు మాడ్యులర్ మరుగుదొడ్లు మరియు ప్రీమియం వెయిటింగ్ హాల్, COP షెల్టర్ల ఏర్పాటు, రెండో నెంబరు ప్లాట్‌ఫారమ్‌పై బుకింగ్ కార్యాలయం మరియు విశ్రాంతి గదులను కలుపుకొని కొత్త భవనం నిర్మాణం. (అంబ్రెల్లా వర్క్ ప్రాజెక్ట్ : 11.06.53.24.3.55.034, 2024-25). **పని పూర్తిచేయు కాలం:** 12 (పన్నెండు నెలలు). **టెండర్ విలువ:** రూ. 8,12,00,136/-. **ముందస్తు ధరావత్తు:** రూ. 5,56,000/-. **ముగింపు తేదీ:** 07–01–2026

**క్రమ సంఖ్య: 4. టెండర్ నెం.:** E-55-నార్త్-BZA-2025. **పని వివరాలు:** పని పేరు: SLO - ఒకటో నెంబరు ప్లాట్‌ఫామ్‌పై మరుగుదొడ్లు, VIP లాంజ్, బుకింగ్ కార్యాలయం, పార్శిల్ కార్యాలయం మరియు ఇతర ప్రయాణీకులకు సంబంధించిన సౌకర్యాలతో సహా వెయిటింగ్ హాళ్లు మరియు వెయిటింగ్ గదుల మెరుగుదలలు, 2, 3 నెంబర్ల ప్లాట్‌ఫారాలపై నీటి సరఫరా ఏర్పాట్లు, SS వాటర్ బూత్‌లు, కూర్చునే బెంచీలతో సహా ప్లాట్‌ఫారమ్ ఉపరితలం మెరుగుదలలు, మరియు IRS రకం COP షెల్టర్ల ఏర్పాటు చేయవలెను. (అంబ్రెల్లా వర్క్ ప్రాజెక్ట్ ID: 11.06.53.24.3.55.070, 2024-25). **పనులు పూర్తి చేయు కాలపరిమితి:** 12 (పన్నెండు నెలలు). **టెండర్ విలువ:** రూ. 8,32,29,568/-. **ముందస్తు ధరావత్తు:** రూ. 5,66,200/-. **ముగింపు తేదీ :** 07–01–2026

**క్రమ సంఖ్య : 5. టెండర్ నెం.:** E-56-North-BZA-2025. **పని వివరాలు:** పని పేరు: విజయవాడ డివిజన్: BZA-VSKP సెక్షన్: సీనియర్ డివిజనల్ ఇంజనీర్/నార్త్/BZA అధికార పరిధిలోని ADEN/RJY, SLO & TUNI సబ్ డివిజన్లలో రెండు సంవత్సరాల కాలానికి ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న కాలువలు/వాలులు మొదలైన వాటితో సహా ట్రాక్‌లను శుభ్రపరచడం, చెత్త, ప్లాస్టిక్ మరియు కాగితపు వ్యర్థాలు మరియు ఇతర పదార్థాలను తొలగించడం/ ఏరివేయడం ద్వారా ట్రాక్ పొడవునా శుభ్రపరచడం. **పనులు పూర్తి చేయు కాలపరిమితి:** 24 (ఇరవై నాలుగు నెలలు). **టెండర్ విలువ:** రూ. 37,65,840/-. **ముందస్తు ధరావత్తు:** రూ. 75,300/-. **ముగింపు తేదీ :** 09–01–2026.

1) టెండర్ షరతులు/పని పేరు యొక్క పూర్తి వివరాలు, పైన పేర్కొన్న పనుల యొక్క సారూప్య స్వభావం, అర్హత ప్రమాణాలు మొదలైన ఇతర వివరాలు **www.ireps.gov.in** వెబ్‌సైట్‌లో ప్రచురించిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) టెండర్దారులు ఏదైనా టెండర్‌కు సంబంధించిన మార్పులు/ సవరణలను గమనించడానికి టెండర్ ముగింపుతేదీకి ముందు **www.ireps.gov.in** వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించడమైనది.
3) ఈ టెండర్ నోటీసు విజయవాడలోని డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), దక్షిణమధ్య రైల్వే కార్యాలయంలో మరియు విజయవాడ డివిజన్‌లోని ADEN సబ్-డివిజనల్ కార్యాలయాలలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడింది, దీనిని చూడవచ్చు.
4) రైల్వే ఎటువంటి కారణం చెప్పకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేశాఖకు ఉన్నది.

**డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్)**
**విజయవాడ**

**టెండర్ నోటీసు నెం.: 11-GS-SC-II-25-OT, తేదీ: 12-12-2025.** PUB/1612

భారత రాష్ట్రపతి తరపున, CAO/C/RSP/SCR-ఇంజనీరింగ్/ దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ **ఇ-ప్రొక్యూర్‌మెంట్** ద్వారా ఈ క్రింది పనుల కోసం ఓపెన్ టెండర్లను ఆహ్వానిస్తోంది. ముగింపు తేదీ : 09–01–2026.

**టెండర్ నెం.:** 11-GS-SC-II-25-OT. పని పేరు: హైదరాబాద్ డివిజన్ యొక్క గతిశక్తి యూనిట్ కోసం జనరల్ కన్సల్టెంట్‌ను నియమించడానికి ప్రతిపాదనల కోసం అభ్యర్థన (RFP). ప్రకటించబడిన విలువ: రూ. 3,57,47,760.00. **ముందస్తు ధరావత్తు:** రూ. 3,28,700.00.

మరిన్ని వివరాల కోసం www.ireps.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.
**డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/గతిశక్తి/ హైదరాబాద్.**

**సవరణ నెం.: E-05-BZA తేదీ: 15-12-2025** PUB/1614

ఇ-టెండర్ నోటీసు నెం. DRM/Works/BZA/41/2025 ఈ కింద ఆహ్వానించబడిన టెండర్ నెం. E-37-Central-BZA-2025 కోసం ఈ క్రింది మార్పు చేయబడింది. తేదీ: 02–12–2025 మరియు వివరాలు క్రింద సూచించబడ్డాయి.


**క్రమ సంఖ్య : 1. తొలగించబడిన టెండర్ పత్రం:** ఫైల్ పేరు: 3-కండిషన్స్ ట్రాక్ వర్క్. ఇప్పుడు జోడించబడిన **కొత్త టెండర్ పత్రం:** ఫైల్ పేరు: 3-కండిషన్స్ ట్రాక్‌వర్క్-పిడిఎఫ్.

**క్రమ సంఖ్య : 2. తొలగించబడిన టెండర్ పత్రం:** పత్రం వివరణ: కండిషన్స్ ట్రాక్ వర్క్. ఇప్పుడు జోడించబడిన **కొత్త టెండర్ పత్రం:** **టెండరు పత్రం వివరణ :** కండిషన్స్ ట్రాక్‌వర్క్.

దయచేసి గమనించండి, పై టెండర్ నోటీసు యొక్క ఇతర నిబంధనలు మరియు షరతులు మార్చబడలేదు.
**డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ**
A2046

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


## 'న్యూయేజ్' జనార్ధనన్ ఆకస్మిక మృతి



**న్యూఢిల్లీ :** ఢిల్లీ నుంచి నిర్వహిస్తున్న 'న్యూ యేజ్' వీక్లీలో పని చేస్తున్న ఆర్.జనార్ధనన్ ఆకస్మికంగా మరణించారు. జి. బి. పంత్ ఆసుపత్రిలో గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆయన మృతి చెందారు. ఆయన నాలుగు దశాబ్దాలకు పైగా పత్రికకు అంకితభావంతో సేవలను అందజేశారు. న్యూయేజ్ పత్రిక లే ఔట్ డిజైనింగ్‌లో అందెవేసిన చెయ్యి. జనార్ధనన్ ఆకస్మిక మరణం పట్ల భారత కమ్యూనిస్ట్ పార్టీ ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేసింది.ఆయన మరణం పార్టీకి, న్యూ యేజ్ వీక్లీకి తీరని లోటు అని, ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచరులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

### గ్రూప్-3 ఉద్యోగుల భర్తీకి

## తాత్కాలిక ఎంపిక నోటిఫికేషన్ విడుదల




**ప్రజాపక్షం /హైదరాబాద్ :** గ్రూప్3 ఉద్యోగల భర్తీకి సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తాత్కాలిక ఎంపిక నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మొత్తం 1388 పోస్టులకు గాను 1370 మందితో కూడిన లిస్ట్‌ను గురువారం టిజిపిఎస్‌సి ఛైర్మన్ బి. వెంకటేశం, కమిషన్ సభ్యులతో కలిసి విడుదల చేశారు. 2025 మార్చి 14న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా ఆధారంగా తాత్కాలికంగా ఎంపిక చేయబడిన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్‌లు కమిషన్ వెబ్‌సైట్ https://www.tgpsc.gov.inలో పొందపర్చినట్లు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రియాంక అలా తెలిపారు. అయితే ఇవి పూర్తిగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల తీర్పులకు లోబడి ఉంటాయని వెల్లడించారు. తాత్కాలికంగా ఎంపిక చేయబడిన అభ్యర్థుల్లో ఎవరైనా తప్పుడు సమాచారం అందించడం, తప్పిదాలకు పాల్పడడం ఎంపిక సక్రమంగా జరగలేదని కమిషన్ దృష్టికి వస్తే ఆలాంటి అభ్యర్థిని తాత్కాలిక ఎంపికను ఏ దశలోనైనా రద్దు చేయబడుతుందని వెల్లడించారు. ఆలాంటి కేసులకు సంబంధించి గెజిట్ నం.60 టిజిపిఎస్ విధాన నియమాలలో నోటిఫై చేయబడిన నిబంధనల ప్రకారం, ఏదైనా చర్య తీసుకునే హక్కు కమిషన్‌కు ఉందని ప్రకటించారు.

## 22న ఒయు ఎంప్లాయిమెంట్ బ్యూరోలో జాబ్ మేళా

### డిప్యూటి చీఫ్ అధికారి టి. రాములు

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదురుగా నున్న ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆవరణలో ఈ నెల 22వ తేదీన ఉదయం 11.00 గంటల నిర్వహిస్తున్న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో చీఫ్ అధికారి టి. రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో మెడ్‌ప్లస్ గ్రూప్ కంపెనీ పాల్గొంటుందని, ఫార్మసిస్ట్ , అసిస్టెంట్ లోని రెండు విభాగాల్లో దాదాపు 200 పోస్టులు భర్తీ చేయుటకు గాను డి.బి.యం. ఫార్మసీ ఏదేని డిగ్రీ అర్హత కలిగి ఉండి, 18 సంవత్సరాలు నుండి 30 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులని ఆయన తెలిపారు. అర్హత, ఆసక్తి గల నిరుద్యోగ యువతి ,యువకులు తమ తమ పూర్తి బయోడేటా లో పాటు విద్యార్హతల జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9666662481 ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చాని తెలిపారు.

## డిజిపి నియామకంపై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర డిజిపిగా బి.శివధర్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. డీజీపీగా శివధర్‌రెడ్డి నియామకాన్ని సవాల్ చేస్తూ హైదరాబాద్కు చెందిన సోషల్ వర్కర్ ధన్గోపాల్ రావు వేసిన పిటిషన్ను జస్టిస్ పుల్లా కార్తీక్ విచారించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 2025న ప్రభుత్వం జారీ చేసిన డీజీపీ నియామక ఉత్తర్వులు 2018లో సుప్రీంకోర్టు జారీ చేసిన గైడ్లైన్స్కు వ్యతిరేకమని పిటిషనర్ వాదన, డీజీపీ రిటైర్ అవ్వడానికి ముందే అర్హులైన వాళ్ల ముగ్గురి పేర్ల యూపీఎస్సీకి ప్రభుత్వం అందజేయాలని సుప్రీం కోర్టు ప్రకాష్ సింగ్ కేసులో తీర్పు చెప్పిందన్నారు. అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను యూపీఎస్సీకి పంపడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ, యూపీఎస్సీకి జాబితా పంపామన్నారు.కొర్రీలు రావడంతో జాప్యమైందన్నారు. ఈ దశలో పిటిషనర్ కల్పించుకుని మధ్యంతర స్టే ఆదేశాలు జారీ చేయాలని కోరగా అందుకు న్యాయమూర్తి నిరాకరించారు. విచారణను ఈ నెల 22కి వాయిదా వేశారు.

## హీరా గ్రూప్ అధినేత్రి నౌహీరా షేక్కు రూ.5 కోట్లు జరిమానా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైకోర్టు చరిత్రలో తొలిసారిగా హీరా గ్రూప్ సంస్థల అధినేత్రి నౌహీరా షేక్కు అక్షరాలా రూ. 5 కోట్ల జరిమానా విధిస్తూ జస్టిస్ నగేశ్ భీమపాక గురువారం తీర్పు చెప్పారు. కోర్టు సమయాన్ని వృధా చేసినందుకు రూ.5 కోట్ల జరిమానాను 8 వారాల్లో ప్రధాన మంత్రి రిలీఫ్ ఫండ్కు చెల్లించాలన్నారు. హీరా గ్రూప్లో పెట్టుబడులు పెట్టిన వాళ్లకు పెద్ద ఎత్తున లాభాలతో తిరిగి చెల్లిస్తామని నమ్మించి జనాన్ని మోసం చేసిందనే కేసులో నౌహీరా షేై ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టింది. ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టు హీరా గ్రూప్ ఆస్తులను వేలం వేయాలని ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఈడీ ఆస్తుల వివరాలను వెబ్ పోర్టల్లో అప్లోడ్ చేసింది. అత్యంత విలువైన తమ ఆస్తులను ఈ నెల 26న వేలం వేయకుండా స్టే ఉత్తర్వులను జారీ చేయాలంటూ నౌహీరా షేక్ లంచ్మోషన్ పిటిషన్ వేయడంపై న్యాయమూర్తి ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇది కోర్టు సమయాన్ని వృధా చేయడమేనని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆస్తులను వేలం వేసేందుకు ఈడీకి అనుమతి ఇచ్చిందన్నారు. కేసులు వేసి కోర్టును తప్పుదోవ పట్టించినందుకు రూ.5 కోట్లు జరిమానాను ప్రధాన మంత్రి రిలీఫ్ పండ్కు చెల్లించాలన్నారు.



హైటెక్ సిటీ యశోదా హాస్పిటల్‌లో మోకాలి నొప్పి చికిత్స చేయించుకున్న మాజీ మంత్రి కుందురు జానారెడ్డిని పరామర్శించిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి.

## బిజెపి, బిఆర్ఎస్ కలిసి పోటీ చేయడం అవాస్తవం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారతీయ జనతా పార్టీ స్వతహాగా కార్యకర్తల కష్టంతో, ప్రజల అండతో రాష్ట్రంలో అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా పెద్ద ఎత్తున సర్పంచులను, వార్డు సభ్యులను గెలుచు కోవడం జరిగిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు ఒకటి కాకపోతే, పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. 'నేను కొట్టినట్టు చేస్తా నీవు ఏడ్చినట్టు చెయ్యి అన్నట్టు' బిఆర్ఎస్ పార్టీ ఫిరాయింపులపై ఫిర్యాదు చేయడం, కాంగ్రెస్ పార్టీ స్పీకర్ పై ఒత్తిడి తీసుకొచ్చి దాన్ని తిరస్కరించడం ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు లోక్‌సభ ఎన్నికలలో ఎవరి తరపున ప్రచారం చేశారో? పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి సమర్థించడం ఆయన దివాలా కోరుతనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. 42 శాతం బిసి రిజర్వేషన్లపై మరోసారి అసెంబ్లీలో చర్చిస్తామనడం రిజర్వేషన్లను దాటవేయడానికి చేస్తున్న కుట్రలో భాగమేనని అన్నారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుట్రలు కుతంత్రాలతో బిఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటైనప్పటికీ బిజెపిపై అబండాలు వేస్తూ ప్రజలను మోసం చేయాలనే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి దృష్టిలో తెలంగాణ ప్రజలు అబద్ధాలు సైతం నమ్ముతారనే నమ్మకంతో అబద్దాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న సీట్లు సున్నా అనే విషయం మర్చిపోయి మాట్లాడడం వారి జ్ఞాపకశక్తిని గుర్తు చేస్తుందన్నారు.

## సున్నం చెరువుపై సర్వే రిపోర్టు ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం అల్లాపూర్లోని సున్నం చెరువు భూమిపై సర్వే చేసి రిపోర్టు ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. సర్వే విచారణ అధికారిగా నియమితులైన ఆర్డీవో హైడ్రా సహా ఉన్నతాధికారులకు ప్రభావానికి గురికారాదని చెప్పింది. స్వతంత్రంగా సర్వే చేసి నివేదిక ఇవ్వాలంది. సర్వే అధికారికి రంగారెడ్డి, మెదక్ మల్కాజిగిరి జిల్లాల నీటిపారుదల, సర్వే, భూ రికార్డులు, రెవెన్యూ శాఖల అధికారుతోపాటు జీహెచ్‌ఎంసీ అఫీసర్లు సహకరించాలంది. తదుపరి విచారణ ఈ నెల 23కు వాయిదా వేస్తూ జస్టిస్ అనిల్కుమార్ జూకంటి ఉత్తర్వులను జారీ చేశారు. తమకు నోటీసులు జారీ చేయకుండా, ఎఫ్టీఎల్ నిర్ధారించకుండా అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంటూ మారుతి హిల్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఇతరులు పిటిషన్లు వేశారు. చెరువు సమీపంలో హైడ్రా తవ్వకం పనులను కొనసాగిస్తోందని పిటిషనర్ న్యాయవాది చెప్పారు. అదనపు అడ్వకేట్ జనరల్ మహమద్ ఇమ్రాన్ ఖాన్ వాదిస్తూ, పిటిషనర్ ఆరోపణలను తోసిపుచ్చారు. అధికారుల విచారణలో ఎఫ్టీఎల్, బఫర్జోన్లో విల్లాలున్నా కూడా కూల్చివేస్తామన్నారు. చెరువును పునరుద్ధరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వాదనలపై స్పందించిన న్యాయమూర్తి, సర్వే నివేదికలో ఎవరిది తప్పు అని తేలినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తేల్చి చెప్పారు. విచారణను 23కి వాయిదా వేశారు.

## విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్న రైతు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆయన వయసు 89 ఏళ్లు. పేరు కళ్లెం నర్సింహా రెడ్డి. అచ్చం రైతు బిడ్డ. ఈ వయసులోనూ వ్యవసాయం మీద మమకారం పోలేదు. 30 ఏళ్లు అమెరికాలో ఉన్నారు. అక్కడ కూడా వ్యవసాయమే. ఐదువేల ఎకరాలు లీజుకు తీసుకుని రకరకాల పంటలు సాగు చేసి రికార్డు సృష్టించారు. అమెరికా ప్రెసిడెంట్ జిమ్మీ కార్టర్ నుంచి కూడా ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. కొన్నాళ్ళ క్రితం మాతృభూమిపై మమకారంతో తెలంగాణకు తిరిగి వచ్చారు. చిలుకూరు సమీపంలో కళ్లెం నర్సింహారెడ్డి పేరుతో వ్యవసాయ క్షేత్రం ఏర్పాటు చేసుకున్నారు. ఎన్నో సాగు పద్ధతులతో పేరు గడించిన కళ్లెం ఇప్పుడు తన సొంత ఫామ్‌లో మొక్కలు...చెట్లు పెంచి ప్రకృతిలోనే జీవితం గడుపుతున్నారు. దేనికీ వయసు అడ్డురాదని ఇప్పటికే తన పనులన్నీ తానే చేసుకుంటారు. తోటంతా కలియ తిరగనిదే ఆయనకు నిద్ర పట్టదు. తెలంగాణ పల్లె నుంచి అమెరికా దాకా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్న కళ్లెం నర్సింహారెడ్డి ఇప్పుడు మరోలా వార్తల్లోకి ఎక్కారు. వ్యవసాయ క్షేత్రంలో తన భార్య కళ్లెం లక్ష్మి విగ్రహంతో పాటు తన విగ్రహాన్ని కూడా ఆవిష్కరించుకుంటున్నారు. భార్య ప్రథమ వర్ధంతి సందర్భంగా నేడు (శుక్రవారం) విగ్రహాలు ఏర్పాటు చేసుకున్నారు. భార్యపై ఉన్న ప్రేమతో రాజస్థాన్‌లో విగ్రహాలు తయారు చేయించారు. ఆమె ఒంటరిగా ఉండొద్దు అనే ఉద్దేశంతో తన విగ్రహాన్ని కూడా పక్కనే పెట్టుకుంటున్నారు. ఈ విగ్రహాలు స్వయంగా ఆయనే ఆవిష్కరించుకోనున్నారు.

## రైల్వే బ్రిడ్జి కూలివేతకు ప్రణాళిక సిద్ధం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దక్షిణ మధ్య రైల్వే ప్రజలకు భద్రతను కల్పించడానికి, సురక్షితమైన రైలు కార్యకలాపాలను కొనసాగించడానికి హైదరాబాద్(నాంపల్లి) రైల్వే స్టేషన్‌లోని బేగంపేట వైపు ఉన్న పాత పాదచారుల వంతెనను కూల్చివేయాలని ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి రెడ్‌హిల్స్ ప్రాంతాన్ని పబ్లిక్ గార్డెన్‌తో కలుపుతుంది.ఈ స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌లలో దేనికీ ఈ బ్రిడ్జి అనుసంధానించబడలేదు. ఈ బ్రిడ్జి నిర్మాణం ఐదు దశాబ్దాలకు పూర్వం జరిగింది. ప్రస్తుతం ఈ బ్రిడ్జ్ శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన స్టేషన్ లోనున్న రైల్వే యార్డ్ లైన్ల మీదుగా ఉండడంవలన , రైల్వే కార్యకలాపాలతో పాటు ప్రజలకు ప్రాణ హాని కలిగించే అవకాశముంది. ఊహించని ప్రమాదాన్ని నివారించడానికి, మొత్తం ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఈ నెల 20నుంచి 23 తేదీల మధ్య తొలగిస్తారు. ఈ సమయంలో అవసరమైన భద్రతా ఏర్పాట్లు అమలులో ఉంటాయి. అవసరమైన విధంగా రైలు కార్యకలాపాలు నియంత్రించబడతాయి. కూల్చివేత పనులు కఠినమైన భద్రతా జాగ్రత్తలతో సంబంధిత రైల్వే విభాగాల సమన్వయంతో నిర్వహించబడతాయి. ప్రజలు ఇందుకు సహకరించాలని కోరారు.

## అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ రహీన బేగంను బదిలీ చేయాలి

### జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు బిఆర్ఎస్ నేత ఆనంద్‌కుమార్ గౌడ్ విజ్ఞప్తి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అర్హత లేకున్నా సెంట్రల్ జోన్ ఖైరతాబాద్ అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్‌గా అగ్రికల్చర్ విభాగం నుండి డిప్యూటేషన్ పై కొనసాగుతున్న రహీన బేగంను వెంటనే సొంత శాఖకు బదిలీ చేయాలని గోషామహల్ బిఆర్ఎస్ నేత ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ట్యాంక్‌బండ్‌లోని జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆర్‌వి.కర్ణన్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అర్హత లేకుండా జిహెచ్‌ఎంసి సెంట్రల్ జోన్ ఖైరతాబాద్ స్పోర్ట్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కొనసాగుతూ, గడువు ముగిసినప్పటికి అదే పదవిలో కొనసాగుతున్న రహీన బేగంను వెంటనే సొంత విభాగనికి బదిలీ చేసి, అర్హులైన వారిని ఆ పదవిలో నియమించాలని కోరారు. రహీన బేగం డిప్యూటేషన్ గడువు ముగియడంతో జిహెచ్‌ఎంసి కమిషనర్ హోదాలో సొంత విభాగానికి రిలీవ్ చేస్తూ, నెల రోజుల క్రితమే ఉత్తర్వులు జారీ చేసినప్పటికి అక్కడి నుంచి బదిలీ కాకుండా సెంట్రల్ జోన్ ఖైరతాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ సీటుపై తిష్ట వేసిన రహీన బేగంను బదిలీ చేసి, సీనియారిటీ ప్రకారం అర్హత కలిగి జిహెచ్‌ఎంసి స్పోర్ట్స్ మేన్స్‌కి సెంట్రల్ జోన్ జిహెచ్‌ఎంసి అసిస్టెంట్ డైరెక్టర్ పదవిలో నియమించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్‌ను కోరారు. దీంతో కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సానుకూలంగా స్పందిస్తూ రహీన బేగంను సొంత శాఖకు బదిలీ చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ తెలిపారు. మరో వారం రోజులు చూస్తామని, రహీన బేగంను బదిలీ చేయని పక్షంలో న్యాయ పోరాటం చేస్తానని, రహీన బేగం ను సొంత శాఖకు పంపించే వరకు తన పోరాటాన్ని కొనసాగిస్తానని ఆనంద్

## దేశభక్తిని పెంపొందిద్దాం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో అన్ని సామాజిక వర్గాల వారు వారి దైవ భక్తిని చాటుకుంటూనే ఉన్నారు. అయితే ప్రతీ ఒక్కరు దేశభక్తిని సైతం చాటుకోవాల్సిన అవసరం ఉందని వందేమాతరం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు చెన్నూరి నాగ శ్రీధర్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ నగరంలోని నల్లకుంట్లలోని నిత్య జనగనమన కేంద్రంలో గురువారం జెండా విష్కరణ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు నేలంటి మధు,మిర్చి డెవలపర్స్ డైరెక్టర్ ఓంకారేశ్వర్, వందేమాతరం ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు చెన్నూరి నాగ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రతీ సంవత్సరం జనవరి 26,ఆగస్టు 15 పవిత్ర దినాలను పురస్కరించుకుని వందేమాతరం దీక్ష చేపట్టాలని పిలుపునిచ్చారు. భారతదేశంలోనే తొలిసారిగా వందేమాతరం దీక్షను నగరంలోని నల్లకుంట్ల నిత్యజనగనమన వేదికగా ప్రారంభిస్తున్నామని వివరించారు.

## ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి మేస్త్రీ మృతి

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** భవన నిర్మాణంలో పనిచేస్తున్న ఓ మేస్త్రీ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన సంఘటన గురువారం శంకర్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. శంకర్‌పల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...పశ్చిమబెంగాల్ రాష్ట్రానికి చెందిన అనరులోహక్ (31) బతుకుదెరువు నిమిత్తం తన అన్నతో కలిసి శంకర్‌పల్లికి వచ్చి మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం పట్టణంలోని శాంటమ్‌హోమ్స్‌లో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. చికిత్స కోసం శంకర్‌పల్లి లోని లలిత హాస్పిటల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం పఠాన్‌చెరువుకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భవన నిర్మాణంలో జాగ్రత్తలు తీసుకోకుండా తన సోదరుడి మృతికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎల్.బి.నగర్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

### మంత్రి శ్రీధర్‌బాబుకు మధుయాష్కి గౌడ్ వినతి



**ప్రజాపక్షం/హయత్‌నగర్ :** ఎల్‌బినగర్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని టిపిపిసి ప్రచార కమిటీ చైర్మన్ మాజీ ఎంపి మధుయాష్కిగౌడ్ గురువారం సెక్రటేరియట్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్ బాబుని కలిశారు.నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీలలో చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు, కమ్యూనిటీ హాల్స్, తదితర అభివృద్ధి పనులపై వినతిపత్రాలు అందజేశారు. జిహెచ్‌ఎంసి పునర్విభజనలో ప్రజల నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని పరిష్కారం చూపాలని ఆయన కోరారు.

## కార్మిక హక్కులు కాలరాస్తున్న కేంద్రం

### ఎఐటియుసి సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకోచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తుందని ఎఐటియుసి రాష్ట్ర నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు అన్నారు. గురువారం నాగోల్ డివిజన్ లోని ఎస్‌ఏ డాంగే భవనంలో కొత్తపేట, నాగోల్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టర్ వర్కర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉజ్జిని రత్నాకర్ రావు, మున్సిపల్ కార్మికుల రాష్ట్ర కార్యదర్శి ఎం.మద్దిలేటి పాల్గొని మాట్లాడారు. కనీస వేతనం చట్టం అమలుకు నోచుకోవడం లేదని, పనికి దగ్గటూ వేతనం అమలు చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందిందన్నారు. ప్రతి కార్మికుడిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు నుంచి 35 వేలు పెంచాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారి జీతాలు పెంచాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అండాలు, శ్రీరాములు, ఎల్లయ్య, భాగ్యమ్మ, భారతమ్మ, లక్ష్మి, అండాలు, వెంకటమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కేశంపేట :** పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామ పంచాయతీలో ఉన్న తుర్కలపల్లి గ్రామ బిఆర్ఎస్ వార్డు సభ్యుడు వినోద్‌కుమార్‌తోపాటు అనుచర వర్గం కాంగ్రెస్‌లో చేరారు. వారందరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాకరిస్తుందని వివరించారు. పల్లె సీమలను ప్రగతి సీమలుగా మార్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గ్రామాల్లో ప్రజలందరు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు వీరేశంతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గామ పంచాయతీల అభివృద్దే ప్రభుత్వం లక్ష్యం : భీంభరత్




**ప్రజాపక్షం/షాబాద్:** గ్రామ పంచాయతీల అభివృద్ధే కాంగ్రేస్ ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజక వర్గ ఇన్‌చార్జ్ పామెన భీంభరత్ అన్నారు. గురువారం అజీజ్ నగర్‌లోని ఆయన నివాసంలో షాబాద్, చేవెళ్ల శంకర్‌పల్లి మొహినాబాద్ మండలాలకు చెందిన వివిధ గ్రామాల సర్పంచులుగా గెలుపొందిన వారు భీంభరత్‌ను కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం సర్పంచ్‌లుగా గెలపొందిన వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేవెళ్ల ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపటేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కారక్రమంలో నియోజకవర్గంలోని గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధానం మారాలి : బక్కని



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఎన్నికల విధానంలో మార్పులు రావమే కాకుండా రాజకీయాల్లో సైతం మార్పులు రావాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింలు మాట్లాడుతూ ఎన్నికలు వచ్చాయంటే మద్యం, డబ్బులు ఇష్టారాజ్యంగా వేదజల్లుతున్నారని, దాంతో యువత, స్థానిక పరిస్థితులు చిన్నభిన్నం అవుతున్నాయన్నారు. చట్ట సభల్లో ప్రమాణం చేసిన వ్యక్తులు సైతం సమాజంలో కాలుష్యం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలు సమాజంలో పూర్తిగా పతనమయ్యాయని, రాజకీయాల్లో మార్పులు, ఎన్నికల విధానం మారితేనే విలువలు ఉంటాయనే విషయాన్ని ప్రతి పౌరుడు గ్రహించాలని పేర్కొన్నారు. సమావేశంలో నేతలు తోకల దామోదర్‌రెడ్డి, ప్రకాష్‌లు ఉన్నారు.

## సిఐ ప్రసాద్‌ను కలిసిన సర్పంచ్ ముడావత్ గబ్రు చౌహాన్



**ప్రజాపక్షం/కొత్తూరు:** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన చాకలిదానిగుట్ట తండా సర్పంచ్ ముడావత్ గబ్రు చౌహాన్ గురువారం నందిగామ సిఐ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సర్పంచ్ చౌహాన్ సిఐని సత్కరించారు. గ్రామ పంచాయతీకి సర్పంచ్‌గా ఎన్నికైన గబ్రు చౌహాన్‌ను శాలువాలతో సిఐ ప్రసాద్, ఎస్‌ఐ దేవరాజ్ సన్మానించారు. సిఐ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించడమే కాకుండా ప్రజలకు జవాబుదారి తనంగా వ్యవహరించాలని సూచించారు. చాకలిదానిగుట్ట తండాలో ఏ సమస్య ఉన్నా పరిష్కారం అయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత సర్పంచ్‌పై ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్‌నాయక్, వార్డు సభ్యులు శ్రీనునాయక్, శంకర్ నాయక్, శాంతి శ్రీనునాయక్, నాగేష్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రజలందరూ స్వీయ స్వచ్ఛతను పాటించాలి

### వర్షాకాలపు సవాళ్లు, ప్రజా భద్రత మెరుగుపరచడమే లక్ష్యం

### కన్వర్జెన్స్ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరంలోని నివాసితులు స్వీయ స్వచ్ఛతను పాటించడంతో పాటు చెత్త, ప్లాస్టిక్ వస్తువులు, ముఖ్యంగా పాలిథిన్ కవర్లు డ్రైనేజీల్లో వేయడం మానుకోవాలని, ప్రజలందరు హైదరాబాద్ పట్టణ శుభ్రతపై దృష్టి సారించాలని వక్తలందరు ముక్తకంఠంతో కోరారు. నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వర్షాకాలపు సవాళ్లు, ప్రజా భద్రతను మెరుగుపరిచే లక్ష్యంతో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి.సజ్జనర్ అధ్యక్షతన గురువారం టిజిఐసిసిసిలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో 'కన్వర్జెన్స్ సమావేశం' నిర్వహించారు. ఈ సమావేశంలో జిహెచ్‌ఎంసి, ట్రాఫిక్ పోలీస్, హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల ట్రాఫిక్ పోలీసులు, హైడ్రా, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపి సజ్జనర్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి కమిషనర్ వివిధ శాఖలతో సమన్వయ సమావేశాలను పునః ప్రారంభించడంపై హర్షం వ్యక్తం చేశారు. పోలీస్, మున్సిపల్ విభాగాలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఆర్‌వి.కర్ణన్ మాట్లాడుతూ వాటర్ బోర్డు, విద్యుత్‌తో పాటు ఇతర స్థానిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎ.వి. రంగనాథ్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిలిచే ప్రాంతాలను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపుతామని, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డి.జోయల్ డెవిస్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను వివరిస్తూ, వాటి పరిష్కారం కోసం ఆయన పలు సూచనలు చేశారు. గజరావు భూపాల్ మాట్లాడుతూ రోడ్డు తవ్వకాలు జరిపినప్పుడు ప్యాచ్ వర్క్ ఆలస్యం కాకుండా ఉండేందుకు, తవ్వకం, మరమ్మతు పనులను ఒకే కాంట్రాక్టరుకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అశోక్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాదు నగరంలోని సెవరేజ్, డ్రైనేజ్‌లను ఇంకా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టినామని తెలిపారు. అన్ని శాఖలు కలిసి పనిచేసినప్పుడే ట్రాఫిక్, పాదచారుల సమస్యలు తీరుతాయన్నారు. ఈసమావేశంలో అడిషనల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, ట్రాఫిక్ డిసిపిలు, హెచ్ఎండిఎ, జిసిబి, కంటోన్ మెంట్, హైడ్రా, వాటర్ వర్క్స్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### సమావేశంలోని ముఖ్యాంశాలు

* ప్రధాన జంక్షన్లలో రద్దీని తగ్గించేందుకు రోడ్ల మరమ్మతులతో పాటు పెండింగ్‌లో ఉన్న జంక్షన్ ఇంప్రూవ్ మెంట్ పనులను వేగవంతం చేయడం.
* వర్షాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా ఉండేందుకు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం. మలక్‌పేట వంటి ప్రాంతాల్లో విజయవంతమైన 'రోబోటిక్ క్లీనింగ్' విధానాన్ని అన్ని వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అమలు చేయడం.
* ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న బస్ స్టాప్‌లను రోడ్డు వెడల్పు ఎక్కువగా ఉన్న చోటికి మార్చడం, రోడ్డు మధ్యలో ఉన్న సులాబ్ కాంప్లెక్సులను తొలగించడం, పాదచారుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం.
* నగరంలో పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ సౌకర్యాలను మెరుగుపరచడానికి ఇతర స్థలాల్లో కూడా మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలు ఏర్పాట్లు చేయడంతో పాటు 'మల్టీ లెవల్ పార్కింగ్ యాప్' ను తీసుకురావడం.

## 21న మదర్‌థెరిసా చారిటబుల్ సొసైటీ మెగా రక్తదాన శిబిరం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 21న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ అధ్యక్షులు చేపూరి శంకర్ తెలిపారు. గురువారం రక్తదాన శిబిరం ఇండియన్ రెడ్ క్రాస్‌సొసైటీ రంగారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసే క్యాంపు ఆహ్వాన పత్రికను వనస్థలిపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి.మహేష్‌గౌడ్‌కు అందచేశారు. ఈసందర్భంగా సిఐ మహేష్‌గౌడ్ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. క్యాంపు వైదేహి నగర్ రోడ్ నెంబర్ 3/5 పార్క్ కప్పల చెరువు రోడ్ వద్ద నిర్వహిస్తున్నట్లు శంకర్ తెలిపారు.

## క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంచుతాయ్

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం /రంగారెడ్డి:** క్రీడలు మానసిక ఉత్సాహాన్ని పెంచుతాయని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అన్నారు. సిపిఐ శత వారోత్సవాల సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ పిఎస్‌కె టీం ఆధ్వర్యంలో జరుగుతున్న ఫైనల్ మ్యాచ్ గురువారం శివరాంపల్లిలోని విజయనంద్ గ్రౌండ్ జరిగింది. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటే సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలతో కలిసి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో చైతన్యమైన యువత క్రీడలలో నైపుణ్యం సాధించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి క్రీడారంగాలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. సిపిఐ వంద సంవత్సరాల ఉత్సవాలను దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్ధంగా క్రీడా నిర్వాహకులను అభినందించారు. సురవరం సుధాకర్‌రెడ్డి జాతీయ అంతర్జాతీయ వేదికలలో ఎన్నో అద్భుతమైన ఉపన్యాసాలు ఇచ్చారని, ఆయన జ్ఞాపకార్థం టోర్నమెంట్ నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, ఎఐవైఎఫ్ జిల్లా నాయకులు శివకుమార్, క్రికెట్ ఆర్గనైజర్లు మహమ్మద్ ఇంతియాజ్, క్రికెట్ జట్ల కెప్టెన్లు, ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

## 31వరకు ఇంటింటికీ వైద్యసిబ్బంది సర్వే







### రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** డిసెంబర్ 18 నుంచి 31వరకు జిల్లా అంతటా ఇంటింటి సర్వేను నిర్వహించి, సమాజంలో దాగి ఉన్న కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి, వారందరికి ఎండిటి చికిత్స అందిస్తామని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె,లలితాదేవి తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ మండలం శివరాంపల్లిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కుష్టువ్యాధి అనుమానితులను గుర్తించి ఎండిటి చికిత్స అందించడానికి చేపట్టే అవగాహన ర్యాలీని డిఎంహెచ్ఓ లలితాదేవి ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సర్వేలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాపారావు మాట్లాడుతు ప్రతి గ్రామం, పట్టణం, జిల్లాలో సర్వే నిర్వహించి, అవగాహన కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. కుష్టువ్యాధిని గుర్తించి ఎంఒటి చికిత్స అందించడం ద్వారా అంగవైకల్యం ఏర్పడకుండా కాపాడవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిప్యూటీ డిఎంహెచ్ఓ విజపుర్ణిమ్మ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ నిఖిల్, డాక్టర్ సుజిత్, డాక్టర్ స్వాతి, జిల్లా పారామెడికల్ ఆఫీసర్ సులోచన, డి.లింగ నాయక్, డిపిఎంఒ గౌరీ పాల్గొన్నారు.

### డిఎంహెచ్ఓ కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో గురువారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ లలితాదేవి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సహోదర ప్రేమ కలిగి వైద్యసేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మాస్‌మీడియా అధికారి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఎ 24 శాతం పెంపు

### హర్షం వ్యక్తంచేసి కృతజ్ఞతలు తెలిపిన రంగారెడ్డి జిల్లా టిజిఒ సంఘం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కలెక్టరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఎ 11నుండి 24 శాతం పెరిగినందుకు టిజిఒ సంఘం ఆధ్వర్యంలో హర్షం వ్యక్తంచేస్తూ జిల్లా కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా టిజిఒ కార్యవర్గ సమావేశంలో 24 హెచ్‌ఆర్‌ఎ పెరిగినందుకు జిల్లా కలెక్టర్‌కు ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు చెప్పాలని, ఈ విషయంలో సహకరించిన టిజిఒ సెంట్రల్ అసోసియేషన్‌కు కూడా ధన్యవాదాలు తెలపాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు చెప్పారు. రిటైర్మెంట్ తర్వాత ఖాళీ అయిన అసోసియేట్ అధ్యక్ష పదవికి నూతనకంటి వెంకట్‌ను అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించుటకు ఏకగ్రీవంగా తీర్మానించినట్లు పేర్కొన్నారు. జిహెచ్‌ఎంసి పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు ఐడిఓసి, కొంగరకలాన్, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏను 11 నుండి 24 శాతం పెంచినట్లు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చినరని, ఇది తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం చొరవతో జరిగిందన్నారు. దీనికి తెలంగాణా గెజిటెడ్ అధికారుల సంఘం రంగారెడ్డి జిల్లా పక్షాన హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకున్నందుకు, గత 3 సంవత్సరాలుగా బాధపడుతున్న ఐడిఓసి కొంగరకలాన్ ఉద్యోగులకు ఉపశమనం ఇచ్చినందుకు కలెక్టర్‌కు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నూతన కంటి వెంకట్, శాంతిశ్రీ, అనిత, రాకేష్, సైదమ్మ, పద్మావతి, బాలరాజ్ గౌడ్, బాలేశ్వరి, మసూద్ అలీ, పావని, ఉద్యోగులు పాల్గొన్నారు.



## కెటిఆర్‌ను కలిసిన పట్నం అవినాష్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** షాబాద్ మాజీ జడ్పిటిసి పట్నం అవినాష్ రెడ్డి గురువారం నగరంలోని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట తారకరామరావును మర్యాద పూర్వకంగా కలసి పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. షాబాద్‌లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అత్యధికంగా సర్పంచులను గెలిపించుకోవడంతో అవినాష్‌ను అభినందించారు. రాబోయో ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో సత్తా చాటాలని వివరించారు. షాబాద్‌లో నీ లాంటి యువ నాయకులు పని చేయడంతో పార్టీకి నీకు మంచి భవిష్యత్తు ఉందని ఆశీర్వదించారు.

# గాంధీ కుటుంబాన్ని వేధించేందుకే నేషనల్ హెరాల్డ్ కేసు

### రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి

### శంషాబాద్‌లో భారీ నిరసన






**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గాంధీ కుటుంబాన్ని వేధించేందుకే నేషనల్ హెరాల్డ్ కేసు అని డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అన్నారు. ఎఐసిసి, టిపిసిసి పిలుపుమేరకు గురువారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో భారీ ధర్నా చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గాంధీ కుటుంబాన్ని వేధించడమే నేషనల్ హెరాల్డ్ కేసు లక్ష్యం అని, కేవలం రాజకీయ ప్రతీకార దృక్పథంతోనే దీనిని దాఖలు చేశారన్నారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయం నరేంద్రమోదీ, అమిత్‌షాలకు చెంపదెబ్బలాంటిదన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం,ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి ఇడి ద్వారా కేసులు పెట్టిస్తుందన్నారు. ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర రోడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్ గౌడ్, రామ్మోహన్‌గౌడ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తీగల అనితరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు ఏనుగు జంగారెడ్డి, జనరల్ సెక్రటరీ సదాలక్ష్మి, సెక్రెటరీ శ్రీనివాస్ గౌడ్, మాజీ మేయర్ పారిజాత నరసింహారెడ్డి, సానం శ్రీనివాస్‌గౌడ్, శంషాబాద్ మండల అధ్యక్షుడు, నర్కూడ సర్పంచ్ గడ్డం శేఖర్‌యాదవ్, జిల్లా అధ్యక్షులు రోహిత్‌రెడ్డి, నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్:** షాద్‌నగర్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్ళారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఈడి దాఖలు చేసిన చార్జిషీటును డిల్లీ హైకోర్టు పరిగణలోకి తీసుకోకపోవడం బిజెపి ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి, ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, జంగ నర్సింలు, సుదర్శన్ గౌడ్, గూడ వీరేష్, మాజీఎంపిపి శివశంకర్‌గౌడ్, జితేందర్‌రెడ్డి, కావలి కృష్ణ, మల్లేష్, దయానంద్ గుప్తా పాల్గొన్నారు.

## క్రీడ

# పట్టుబిగించిన ఆసీస్..

### చేతులెత్తేసిన ఇంగ్లాండ్!



యాషెస్ సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ అడిలైడ్ వేదికగా మూడో టెస్ట్ మ్యాచ్‌లో తలపడుతున్నాయి. 326/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఆస్ట్రేలియా 91.2 ఓవర్లలో 371 పరుగుల భారీ స్కోర్ చేసి ఆలౌటైంది. మిచెల్ స్టార్క్ (54; 75 బంతుల్లో, 9 ఫోర్లు) హాఫ్ సెంచరీ చేసి ఔటయ్యాడు. మొదటిరోజు అలెక్స్ కేరీ సెంచరీ (106; 143 బంతుల్లో, 8 ఫోర్లు, 1 సిక్స్), ఉస్మాన్ ఖవాజా హాఫ్ సెంచరీ (82, 126 బంతుల్లో, 10 ఫోర్లు) సాధించిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 5, బ్రెడన్ కార్స్, విల్ జాక్స్ తలో రెండు వికెట్లు, జోష్ టంగ్ 1 వికెట్ తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఇంగ్లాండ్ రెండోరోజు ఆట ముగిసే సమయానికి 68 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 213 పరుగులు చేసింది. జాక్ క్రాలీ (9), ఓలీపోప్ (3), జో రూట్ (19), జెమీ స్మిత్ (22), బెన్ డకెట్ (29), విల్ జాక్స్ (6) బ్యాటింగ్ విఫలయ్యారు. హ్యారీ బ్రూక్ (45) రాణించాడు. ప్రస్తుతం క్రీజులో బెన్ స్టోక్స్ (45*; 151 బంతుల్లో 3 ఫోర్లు), జోఫ్రా ఆర్చర్ (30*; 48 బంతుల్లో, 4 ఫోర్లు) ఉన్నారు. ఇంగ్లాండ్ ఇప్పటికీ మరో 158 పరుగులు వెనకబడి ఉంది. ఆస్ట్రేలియా బౌలర్లలో పాట్ కమిన్స్ 3, నాథన్ లైయన్, స్కాట్ బోలాండ్ చెరో రెండు, కామెరూన్ గ్రీన్ ఓ వికెట్ తీసుకున్నారు.

# ప్రపంచకప్ విజేత భారత్!

రోల్ బాల్ వరల్డ్ కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. దుబాయ్ వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11–10 తేడాతో, మహిళల జట్టు 3–2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి. ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది.





ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ.. పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇది భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్ అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి. 2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో మన జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు.

**రోల్ బాల్ ఎలా ఆడుతారంటే..?**

రోలా బాల్ అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. సింపుల్‌గా చెప్పాలంటే.. బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ఈ క్రీడలో ఆటగాళ్ళు రోలర్ స్కేట్స్ ధరించి, బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ ఎదుటి జట్టు గోల్ పోస్ట్‌లోకి పంపాలి. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉంటాడు. ఆటగాళ్ళు స్కేటింగ్ చేస్తూ బంతిని చేత్తో పట్టుకుని బాస్కెట్ బాల్ తరహాలో డ్రిబ్లింగ్ చేయాలి. బంతిని ఒక చేత్తో లేదా రెండు చేతులతో పాస్ చేయవచ్చు. కానీ గోల్ వేసేటప్పుడు మాత్రం ఒక చేయి మాత్రమే ఉపయోగించాలి. నిర్ణీత సమయంలో ఏ జట్టు ఎక్కువ గోల్స్ చేస్తే ఆ జట్టు విజేతగా నిలుస్తుంది. భారత్‌లో పుట్టిన ఈ క్రీడను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో ఆడుతున్నారు.

## అర్జెంటీనా ఫ్యాన్ క్లబ్‌పై గంగూలీ ఫిర్యాదు


**కోల్‌కతా:** కోల్‌కతాకు చెందిన అర్జెంటీనా ఫుట్‌బాల్ ఫ్యాన్ క్లబ్‌పై భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఫిర్యాదు చేశారు. ఆ క్లబ్ ఓనర్ ఉత్తమ్ సాహా తనపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసినట్లు మాజీ క్రికెటర్ ఆరోపించారు. కోల్‌కతా పోలీసు శాఖకు చెందిన సైబర్ సెల్‌కు గంగూలీ తన ఫిర్యాదును ఈమెయిల్ చేశారు. ఫ్యాన్ క్లబ్ ఓనర్ ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు తన పేరు ప్రఖ్యాతను దెబ్బతీశాయని, తనకు మానసిక శాంతిని లేకుండా చేసినట్లు ఆరోపించారు. ఎటువంటి ఆధారాలు లేకుండానే గంగూలీపై ఫ్యాన్ క్లబ్ హెడ్ ఆరోపణలు చేసినట్లు పోలీసు ఆఫీసర్ పేర్కొన్నారు. పరువునష్టం కింద గంగూలీ 50 కోట్ల దావా దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఓ జర్నలిస్టుతో మాట్లాడుతున్న సమయంలో గంగూలీపై ఫ్యాన్ క్లబ్ ఓనర్ ఉత్తమ్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఎంతో కష్టపడి సంపాదించిన తన పేరుప్రఖ్యాతలను దెబ్బతీసే రీతిలో ఫ్యాన్ క్లబ్ అధినేత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు చెప్పారు. ఈవెంట్ ఆర్గనైజర్ సత్రూ దత్త గురించి చెబుతూ.. అతను గంగూలీకి చెంచాగిరి చేస్తాడని ఉత్తమ్ అన్నారు. సౌరవ్ గంగూలీ ఇలాగే అన్నారని, అతని చీటింగ్ గురించి అందరికీ తెలుసు అన్నారు. ఉదయం బిజెపితో, సాయంత్రం మమతా బెనర్జీతో ఉంటాడని, డబ్బులు ఎక్కడ ఉంటే గంగూలీ అక్కడికి పరుగెత్తుతాడని అన్నారు. బెంగాల్ క్రికెట్‌ను గంగూలీ నాశనం చేశాడని, ఇక భారత జట్టులో బెంగాలీ క్రికెటర్లు ఉండని, అతను అలా చేశాడని ఉత్తమ్ ఆరోపించారు. దీన్ని గంగూలీ ఖండించారు.

## ఫోకస్




# వైకల్యం.. ఒక సామాజిక సవాల్

శారీరక వైకల్యం అనగానే అది ఒక వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య సమస్యగా మాత్రమే మనం భావిస్తుంటాం. కానీ, వాస్తవానికి శారీరక వైకల్యం అనేది వ్యక్తిగత పరిమితులకంటే ఎక్కువగా సమాజ నిర్మాణంలో ఉన్న లోపాలను, మన ఆలోచనా విధానాలను, వ్యవస్థల నిర్లక్ష్యాన్ని ప్రతిబింబించే ఒక గంభీరమైన సామాజిక సమస్య. వైకల్యం ఉన్న వ్యక్తి ఎదుర్కొనే అసలు కష్టాలు అతని శరీరంలోకన్నా, అతన్ని చుట్టుముట్టిన సమాజంలోనే ఎక్కువగా ఉంటాయి. శారీరక వైకల్యం కలిగిన వ్యక్తులు విద్య, ఉపాధి, రవాణా, ఆరోగ్యం, వివాహం, సామాజిక పాల్గొనడం వంటి ప్రతి దశలో అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. ర్యాంపులు లేని భవనాలు, వీల్‌చైర్‌కు అనుకూలం కాని రహదారులు, ప్రత్యేక సదుపాయాలు లేని ప్రజా రవాణా వ్యవస్థ వంటివన్నీ వైకల్యాన్ని మరింత తీవ్రమైన సమస్యగా మారుస్తున్నాయి. అంటే, వైకల్యం అనేది సంబంధం ఉంది. ఉపాధి అవకాశాలు లభించకపోవడం, విద్యలో తగిన మద్దతు లేకపోవడం వల్ల చాలా మంది వికలాంగులు ఆర్థికంగా ఆధారపడే పరిస్థితిలోకి నెట్టబడుతున్నారు. ప్రభుత్వ చట్టాలు, సంక్షేమ పథకాలు ఉన్నప్పటికీ, అవగాహన లోపం, అమలు లోపాలు వాటి ప్రయోజనాన్ని తగ్గిస్తున్నాయి. చట్టాలు కాగితాలకే పరిమితమైతే, సామాజిక




శరీరానికి సంబంధించిన లోపం కంటే, సమాజం సృష్టించిన అడ్డంకుల ఫలితం అని చెప్పవచ్చు. ఇంకా బాధాకరమైన విషయం ఏమిటంటే, శారీరక వైకల్యం కలిగిన వ్యక్తుల పట్ల సమాజంలో ఉండే దృక్కోణం. సానుభూతి పేరుతో చూపించే దయ, లేదా సామర్థ్యంపై అనుమానం, లేదా పూర్తిగా నిర్లక్ష్యం.. ఇవి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాయి. వాళ్లు చేయలేరు అనే ముందస్తు అభిప్రాయం, వాళ్లపై పెట్టుబడి వృథా అనే భావన వారి అవకాశాలను మూసేస్తోంది. ఇది వ్యక్తిని కాదు, సమాజాన్నే వెనక్కి నెట్టే ఆలోచన. శారీరక వైకల్యం—పేదరికం మధ్య బలమైన మార్పు సాధ్యం కాదు. అయితే శారీరక వైకల్యం ఉన్నవారిలో అపారమైన ప్రతిభ, సంకల్పం, సృజనాత్మకత దాగి ఉంది. సరైన అవకాశాలు, సమాన వేదికలు అందిస్తే వారు సమాజ అభివృద్ధికి కీలకంగా దోహదపడగలరు. వైకల్యాన్ని లోపంగా కాకుండా, మానవ వైవిధ్యంలోని ఒక భాగంగా చూడగలిగినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది.కాబట్టి శారీరక వైకల్యం సమస్యను వ్యక్తి భుజాలపై మోపకుండా, సమాజం మొత్తం బాధ్యతగా స్వీకరించాలి. సమగ్ర విద్యా విధానాలు, అందరికీ అనుకూలమైన మౌలిక సదుపాయాలు, ఉపాధిలో సమాన అవకాశాలు, దృక్కోణ మార్పుకు అవగాహన కార్యక్రమాలు వంటివే పరిష్కార మార్గాలు. శారీరక వైకల్యం ఉన్న వ్యక్తి సమాజంపై ఆధారపడాల్సిన పరిస్థితి కాకుండా, సమాజమే అతనికి అనుకూలంగా మారినప్పుడే మనం నిజంగా నాగరిక సమాజంగా ఎదిగినట్టు అవుతుంది. శారీరక వైకల్యాన్ని వ్యక్తిగత దురదృష్టంగా కాకుండా, సామాజిక బాధ్యతగా చూడాలి.

వృద్ధాప్యానికి చేరుతున్న కొద్దీ కంటి చూపు తగ్గుతుంది. చాలా సందర్భాల్లో శస్త్రచికిత్స అనివార్యమవుతుంది.. ఈ విషయాన్ని గుర్తించుకొని, 35–40 ఏళ్ల నుంచీ దృష్టి పరీక్షలు చేయించుకుని అవసరమైతే కళ్ల అద్దాలు తీసుకోవటం మంచిది. ఒక వయసుకు రాగానే కంటిలోని కార్నియా పొర దళసరిగా తయారై, శుక్లాలు రావటం కూడా సహజం. దీనికి ఇప్పుడు శుక్లాన్ని తొలగించి కంటిలోనే లెన్సును అమర్చే సమర్థమైన సర్జరీ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా.. వయసుతో పాటు కంటిలో నీటికాసులు పెరగటం, దృష్టికి కీలకమైన

## వృద్ధాప్యంలో కళ్లు కనిపించవు..

మాక్యులా పొరక్షీణించటం, మధుమేహం ఉంటే దాని కారణంగా రెటీనా పొర మీద రక్తం కమ్మటం వంటి రకరకాల సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. సమస్యేమంటే ఈ సమస్యలు కొంత తీవ్రమైనవి, వీటివల్ల దృష్టి దెబ్బతినే అవకాశాలు చాలా ఎక్కువ. వీటికి ముందస్తు సంకేతాలు కూడా ఏమీ ఉండవు.



వీటిని ముందే గుర్తిస్తే కచ్చితంగా నియంత్రణలో ఉంచుకోవటం ద్వారా చూపు దెబ్బతినకుండా చూసుకోవచ్చు. కాబట్టి ఒక వయసు వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా తరచూ కంటి పరీక్ష, అదీ 'సంపూర్ణ నేత్ర పరీక్ష' చేయించుకుంటూ ఉండటం ఉత్తమం. ఈ పరీక్ష కోసం కంటిలో చుక్కల మందు వేసి, కనుపాప పెద్దదైన తర్వాత పరికరాలతో లోపలంతా క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఈ పరీక్షే ముఖ్యమని గుర్తించాలి.

## చెవులు వినిపించవు



ఒక వయసుకు వచ్చేసరికి వినికిడి కూడా తగ్గుతుంది. ముఖ్యంగా వృద్ధాప్యంలో అధిక పౌనఃపున్యం ఉండే ధ్వనులు సరిగా వినపడవు. చాలామంది వినికిడి తగ్గిందన్న విషయాన్ని అంగీకరించటానికే ఇష్టపడరు. ఒకవేళ దాన్ని అంగీకరించినా, వైద్యులకు చూపించుకోవటానికి ఇష్టపడరు. కానీ దీనివల్ల నలుగురిలో కలవలేకపోవటం, ఎవరేమంటారోనని చిన్నతనంగా భావిస్తుండటం, సమాజానికి దూరం కావటం, క్రమేపీ కుంగుబాటులోకి జారిపోవటం వంటి సమస్యలన్నీ బయల్దేరతాయి. కాబట్టి వినికిడి తగ్గుతోందనిపిస్తే తోసేసుకుని తిరగటం కాకుండా.. వైద్యులకు చూపించుకుని అవసరమైతే తేలికపాటి వినికిడి యంత్రాల వంటివి తీసుకోవటం ద్వారా చక్కటి సామాజిక జీవితాన్ని గడపొచ్చని గుర్తించాలి. యుక్తవయసు నుంచీ పెద్దపెద్ద ధ్వనులు వినకుండా ఉండటం, చెవుల్లో ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని అతిగా ధ్వని పెంచుకోకుండా ఉండటం చెవి ఆరోగ్యానికి ముఖ్యం.

## 'ఉపాధి' పథకాన్ని రద్దు చేసే కుట్ర

### వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, కర్ణకుమార్





**ప్రజాపక్షం/ఖమ్మం :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి పేరు మార్చడం వెనక ఈ పథకాన్ని రద్దు చేసే కుట్ర దాగి ఉందని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ ఆరోపించారు. గతంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇప్పుడు వీక్షిత్ భారత్ రోజ్‌ఘర్ అజీవికా గ్రామీణ్ బిల్లుగా మార్చి పార్లమెంటులో ప్రవేశపెట్టి బిజెపి సరికొత్త కుట్రకు తెర లేపిందని వారు ఆరోపించారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని సాధించుకోవడం జరిగిందని బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలుకు నానా కొర్రీలుపెడుతూ వచ్చిందని పని దినాలను తగ్గించడంతో పాటు రకరకాల యాప్‌లతో గ్రామీణ ప్రాంత పేదలను ఇబ్బందులు పెట్టిందని వారు తెలిపారు. ఇప్పుడు ఏకంగా పథకాన్ని రద్దు చేసే ఆలోచనతోనే పేరు మార్పు చేశారన్నారు. మారిన పరిస్థితుల్లో పని దినాలను పెంచడంతో పాటు దినసరి వేతనాన్ని గణనీయంగా పెంచాల్సిన సమయంలో గతేడాది కేవలం 50 నుంచి 60రోజులు మాత్రమే సగటు పని దినాలు నమోదయ్యాయని, రోజువారి వేతనం కూడా గణనీయంగా తగ్గిందని వారు తెలిపారు. ఈ చట్టంలో కేంద్ర ప్రభుత్వం తన వాటాను తగ్గించి రాష్ట్రాలపై రుద్దడం ద్వారా ఈ పథకానికి తిలోదకాలు ఇచ్చే ప్రయత్నంలో ఉందన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ పని దినాలను పెంచి గ్రామీణ ప్రాంత ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం వీక్షిత్ భారత్ రోజ్ ఘర్ అజీవిక గ్రామీణ్ పథకం పేరును రద్దు చేసి పాత పేరును కొనసాగించడంతో పాటు పనిదినాలను పెంచాలని, దినసరి కూలీ రూ. 600 గిట్టుబాటు అయ్యేవిధంగా చూడాలని, లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ హెచ్చరించారు.

## పంచాయతీ ఎన్నికల్లో ప్రలోభాలు బాధాకరం : వెంకట్రాములు



**ప్రజాపక్షం/వరంగల్ :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రలోభాలు అత్యంత బాధాకరమని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. శాసనసభ ఎన్నికలను మించి పంచాయతీ ఎన్నికలలో ధన ప్రవాహం పెరిగిందన్నారు. డబ్బులు ఇస్తేనే ఓటు వేస్తాం లేకుంటే లేదు అనే దుస్థితికి ఓటర్లు రావడానికి రాజకీయ పార్టీల నాయకుల విధానాలు, ఎన్నికల సంఘం, ప్రభుత్వాధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యావంతులైన వారు కూడా ప్రలోభాలకు గురికావడం అత్యంత బాధాకరమన్నారు. ఓడిన అభ్యర్థులైన, గెలిచిన అభ్యర్థులైన ఆస్తులు కోల్పోయి, అప్పుల పాలై కొందరు బాధపడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలతో కొన్ని కుటుంబాలు చిన్నాబిన్నం అవుతున్నాయన్నారు. ప్రజలలో ఓటు హక్కును అమ్ముకోకుండా, ప్రలోభాలకు గురి కాకుండా చైతన్యం కల్పించాల్సింది ఎన్నికల సంఘమే అన్నారు. ధనస్వామ్యానికి ఘోరీకట్టి ప్రజాస్వామ్యాన్ని పరిక్షించేందుకు ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలను చైతన్య పరిచేందుకు తగిన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

### ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి

# ఇంటింటికీ సిపిఐ పాదయాత్ర

### సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు గోదా శ్రీరాములు వెల్లడి




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** ప్రజా సమస్యలను తెలుసుకోవడానికి సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు గోదా శ్రీరాములు పేర్కొన్నారు. సిపిఐ ముఖ్య నాయకుల సమావేశం గురువారం కొత్త గుండ్లపల్లి గ్రామంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు గోదా శ్రీరాములు హాజరై మాట్లాడారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యలను తెలుసుకోవడం కోసం సిపిఐ ఆధ్వర్యంలో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పట్టణంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈనెల 26, 27, 28, 29 తేదీలలో ఇంటింటికీ సిపిఐ బృందం వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. డిసెంబర్ 26 పార్టీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మండల వ్యాప్తంగా ఘనంగా శతజయంతి ఉత్సవాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మండలంలో గెలుపొందిన మద్రిగూడెం, ధర్మారెడ్డిగూడెం సర్పంచులకు మరియు చిన్న కందుకూరు ఉపసర్పంచ్, వార్డు మెంబర్లకు ఈనెల 20న అభినందన సభ నిర్వహిస్తున్నట్లు గోదా శ్రీరాములు తెలిపారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరి రాజయ్య, పేరబోయిన మహేందర్, సిపిఐ మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మాజీ మున్సిపల్ కోఆప్షన్స్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గోరేటి రాములు, సహాయ కార్యదర్శి పేరబోయిన బంగారి, కార్యవర్గ సభ్యులు ఆరె పుష్ప, సుబ్బూర్ నరసింహ, మాటూరు మల్లయ్య, మూలకుంట్ల నరసమ్మ, కాటం శ్రీకాంత్, కోకల రవీందర్, బోధసు స్వామి, గుండు వెంకటేష్, మద్దూరి భాగ్యమ్మ, అనంతుల నరసింహ, పాకలపాటి రాజు పాల్గొన్నారు.

## పద్మావతి మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

### నివాళులర్పించిన నాయకులు

**ప్రజాపక్షం/కారేపల్లి :** కొప్పెర పద్మావతి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. అనారోగ్యంతో మృతిచెందిన కొప్పెర పద్మావతి మృతదేహంపై సిపిఐ నాయకులు అరుణ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. మండల పరిధిలోని మాధారం గ్రామానికి చెందిన తెలంగాణ సాయుధ పోరాట యోధుల కొప్పెర వేదాద్రి కుటుంబానికి చెందిన పద్మావతి కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. ఆమె మృతివార్త తెలిసిన వెంటనే సిపిఐ నాయకులు ఆమె నివాసానికి చేరుకుని భౌతికాయానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి సత్యనారాయణతో పాటు పలువురు మండల నాయకులు ఉన్నారు.



## ప్రజాఉద్యమాలతోనే గుర్తింపు

### సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రాచారి

### విజయంసాధించిన వార్డుమెంబర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ :** ప్రజాఉద్యమాలతోనే పార్టీకి, నాయకులకు గుర్తింపు లభిస్తుందని సిపిఐ రాష్ట్ర నాయకుడు ఆందోజు రవీంద్రాచారి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బుధవారం వెలువడిన ఫలితాల్లో అబ్దుల్లాపూర్ మెట్టు గ్రామంలోని జెఎన్ ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో 735 ఓట్లు కలిగి ఉన్న మేజర్ గ్రామపంచాయతీ అయిన 13వ వార్డులో సిపిఐ అభ్యర్థి కేతరాజు మంజుల నరసింహ 91 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గురువారం స్థానికంగా వారిని సిపిఐ తరపున సిపిఐ రాష్ట్ర నాయకులు ఆందోజు రవీంద్రచారి, ముత్యాల యాదిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుమెంబర్‌గా గెలిచిన మంజుల మంజుల నరసింహను అభినందించారు. ప్రజాసమస్యలు పరిష్కరిస్తూ పార్టీకి మరింత పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల్ కార్యదర్శి అజ్మీర హరి సింగ్ నాయక్, సిపిఐ పార్టీ నాయకులు దాసరి ప్రసాద్, వేషాల నరసింహ, మంగళపల్లి రవి,వడ్త్యా రమేష్ నాయక్, నాగేశ్వరరావు, లక్ష్మణ్, వాసిరెడ్డి లక్ష్మి, ప్రియా, అన్నపూర్ణ, తీరాల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# తిలక్‌నగర్ ఉపసర్పంచ్‌గా షేక్‌ఖాసీమ్



**ప్రజాపక్షం/ఇల్లందు:** భద్రాద్రి జిల్లా ఇల్లందు మండలంలోని తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో సిపిఐ బలపరిచిన ఐదో వార్డు సభ్యుడిగా ఎన్నికైన షేక్ ఖాసీమ్ ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. సిపిఐ అభ్యర్థులుగా ఎన్నికైన వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికైన వార్డు సభ్యులు అందరూ కలిసి గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్‌గా షేక్ ఖాసీమ్‌ను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కె,సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాసరావు, తాండ్ర లక్ష్మీ నారాయణ, మంచాల వెంకటేశ్వర్లు, గుగులోత్ కృష్ణ, ధనసరి రాజు, ఎట్టి హరికృష్ణ, పూనేం మధు, తదితరులు పాల్గొన్నారు. ఉపసర్పంచ్‌గా ఎన్నికైన షేక్ ఖాసీమ్‌ను వారు అభినందించారు.

## బోథ్ గ్రామ పంచాయతీలో వార్డు మెంబర్లుగా సిపిఐ అభ్యర్థులు...

**ఆదిలాబాద్ :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించడం హర్షణీయమని సిపిఐ నాయకులు అన్నారు. బోథ్ గ్రామ పంచాయతీ 6వ వార్డు సభ్యుడిగా కడిపే శ్రీనివాస్, 14వ వార్డు సభ్యుడిగా రాయల తిరుపతి, భీంపూర్ మండలం ధన్నోర గ్రామ పంచాయతీ 2వ వార్డు సభ్యురాలిగా మేకల అనిత 19 ఓట్ల మెజారిటీతో, 4వ వార్డు సభ్యురాలిగా కనాటే వందన 75 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. వారికి పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. గురువారం బోథ్ ఎఐటియుసి కార్యాలయంలో బోథ్ సిపిఐ కమిటీ ఆధ్వర్యంలో వార్డుసభ్యులను ఘనంగా సన్మానించారు. గెలుపొందిన వారికి గ్రామస్తులు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.









# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## సర్పంచ్‌ల ప్రమాణ స్వీకారాన్ని ఆపుతాం
### మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ మక్తల్ :** సర్పంచ్ ప్రమాణ స్వీకారోత్సవాన్ని లీగల్ గా అడ్డుకుంటామని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులను వార్డు మెంబర్లను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ బుధవారం మున్సాయిపల్లిలో జరిగిన పోలింగ్ లో రెండో వార్డు, నాలుగో వార్డుల్లో దొంగ ఓట్లు వేయడం వల్ల ఒక్క ఓటుతో సర్పంచ్ గా గెలుపొందారని. దీని పై తాము అభ్యంతరం చెప్పిన రీకౌంటింగ్ చేయలేదని అందువల్ల ఈ విషయాన్ని ఎన్నికల కమిషన్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రెండో వార్డు, నాలుగో వార్డు రెండింట చొప్పున నాలుగు ఓట్లు వేయడంతో మున్సాయిపల్లి సర్పంచ్ పదవి ని కాంగ్రెస్ కైవసం చేసుకుందని అక్రమ పద్ధతిలో గెలవడం కాంగ్రెస్ పార్టీకి సర్వ సాధారణమే అన్నారు. దీనిని నిరూపించడానికి అభ్యంతరం తెలిపిన కూడా రీకౌంటింగ్ చేయడానికి అవకాశం ఇవ్వలేదని అందువల్ల చట్ట ప్రకారం. న్యాయపరంగా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

## ఘనంగా దర్గా ఉత్సవాలు



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** గరీబ్ నవాజ్ సర్కార్ 815వ ఉర్స్ సందర్భంగా డాక్టర్ సి. లక్ష్మారెడ్డి నివాసం నుండి ఫిలాఫ్ ముబారక్ రవాణా హజ్రత్ సయ్యద్ ఖ్వాజా మొయినుద్దీన్ చిష్తీ అజ్మీర్ (గరీబ్ నవాజ్ సర్కార్) 815 వ ఉర్స్ షరీఫ్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఆరోగ్య మంత్రి, మాజీ ఎమ్మెల్యే, జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సి. లక్ష్మారెడ్డి నివాసం నుండి గురువారం భక్తి శ్రద్ధలతో ఫిలాఫ్ ముబారక్‌ను రవాణా చేశారు. ఫిలాఫ్ ముబారక్ రవాణాకు ముందు మహ్మద్ నబీ చిష్తీ మధ్యాహ్న ప్రత్యేక దువా, ఫాతెహా పఠనం నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు శాంతి, ఐక్యత, సుఖసమృద్ధులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ అలీ దానిష్ (మాజీ డిప్యూటీ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, బాదేపల్లి), పీ. మురళి (మాజీ డిప్యూటీ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ), తొలి ముడా డైరెక్టర్ లు శ్రీకాంత్, ఇంతియాజ్ అబ్దుల్ ముకీత్, ఖ్వాజా ఇమ్తియాజ్, అజీర్ ఉద్దీన్, అయూబ్ మహ్మూద్, తదితరులతో పాటు స్థానిర బీఆర్ఎస్ పార్టీ నాయకులు , గరీబ్ నవాజ్ సర్కార్ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చివరలో గరీబ్ నవాజ్ సర్కార్ బారగాహ్‌లో ఉర్స్ ఉత్సవాలు విజయవంతంగా జరగానికి ఆకాంక్షిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

## జాతీయస్థాయి ఖోఖో క్రీడలకు కర్ని విద్యార్థి శివాని

**ప్రజాపక్షం/ మక్తల్ :** గత నవంబర్ 23 నుండి 25 వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పంతంగి, యాదాద్రి భువనగిరి జిల్లా లో జరిగిన స్కూల్ గేమ్స్ 17 సంవత్సరాలలోపు ఖోఖో రాష్ట్రస్థాయి పోటీలలో, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బాలికల ఖోఖో జట్టు తరపున, నారాయణపేట జిల్లా మక్తల్ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ని విద్యార్థిని ఎస్. శివాని పాల్గొని, ఉత్తమ క్రీడా ప్రతిభ ను కనబరిచి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. వెంకటయ్య, కోచ్ ఫిజికల్ డైరెక్టర్ బి. రూప తెలిపారు. జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన యన్. శివాని ఈనెల 20 నుండి 24 వరకు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని అయోధ్యలో జరుగు 69వ, జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటుందని ఫిజికల్ డైరెక్టర్ బి. రూప తెలిపారు. జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన శివానికి, అందుకు కృషి చేసిన పిడి, బి. రూప ను రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాఘవ రెడ్డి, నేతి కృష్ణమూర్తి, అడ్వైజర్ బి. గోపాలం, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఓబెదుల్లా కొత్వాల్, అభినందించారు. ఈ కార్యక్రమంలో విలియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతాం

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతామని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తెలంగాణ చౌరస్తా నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించడానికి ప్రయత్నించగా కార్యాలయ సమీపంలో పోలీసులు భారీ కెడ్లు ఏర్పాటు చేశారు. భారీ కేడ్లు దాటి కాంగ్రెస్ నాయకులు వెళ్లడానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం మీడియాతో డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఆరోపించారు. ప్రతిపక్షాలను భయభ్రాంతులకు చేయడానికి ఈడీ, సీబీఐలను ఇష్టానుసారంగా వాదుకుంటున్నదని విమర్శించారు. ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహా రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్, మిథున్ రెడ్డి, సీజే బెనహర్, అజ్మత్ అలీ, బెక్కరి మధుసూదన్ రెడ్డి ఫయాజ్, ఆవేజ్, రాములు యాదవ్, నాగరాజు, ప్రవీణ్ కుమార్ తో పాటు జిల్లాలోని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నూతనంగా గెలుపొందిన పంచాయితీల సర్పంచులు పాల్గొన్నారు.

## ఉత్కంఠభరితంగా అడ్డాకుల ఎన్నిక

**ప్రజాపక్షం/అడ్డాకుల:** మూడో విడత గ్రామపంచాయితీ ఎన్నికలలో బుధవారం జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి దశరథరెడ్డి 48 ఓట్ల స్వల్ప మెజార్టీ ఓట్లతో గెలుపొందారు. అడ్డాకులలోని 12 వార్డులకు గాను ఆరు వార్డులు బిఆర్ఎస్,ఐదువార్డులు కాంగ్రెస్ మూడో వార్డులో స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. ఏ పార్టీకి పూర్తి మెజార్టీ రానందుకు స్వతంత్ర అభ్యర్థి సాయికుమార్‌సాగర్‌ను ఉపసర్పంచుగా ఎన్నుకున్నారు.

## ఇది గ్రామస్తుల తీర్పు



**ప్రజాపక్షం/అడ్డాకుల:** అడ్డాకుల మండలం, బలీదుపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచు అభ్యర్థి కర్ణాకర్ రెడ్డి, బుధవారం జరిగిన ఎన్నికల ఫలితాలలో 431 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ సందర్భంగా కర్ణాకర్ రెడ్డి మాట్లాడుతూ, నా విజయం వెనకాల వనపర్తి ఎమ్మెల్యే తూడి మేగా రెడ్డి వెన్నంటి ఉండి నా గెలుపు వరకు కృషి చేశారని, ఆయన సహాయ, సహకారాలు మరువలేను అని అన్నారు.అందరి సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని సంతోషం వ్యక్తం చేశారు. కొత్త రేషన్ కార్డులు, ఉచిత సన్నబియ్యం అందించడం జరిగింది. భవిష్యత్తులో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అందించే విధంగా నా వంతు కృషి చేస్తానని తెలిపారు. మీ అందరి సలహాలు, సూచనలతో మన గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్దాం అని మండలంలోని ఆదర్శ గ్రామంగా పేరు వచ్చేటట్లు కృషి చేద్దామని నా విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదములు తెలుపుతున్నానని నూతన సర్పంచు కర్ణాకర్ రెడ్డి అన్నారు.

## వీపనగండ్లలో సత్తా చాటిన కాంగ్రెస్

**ప్రజాపక్షం/వీపనగండ్ల:** మండలంలో నిర్వహించిన గ్రామపంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు అధిక స్థానాల్లో ఘన విజయం సాధించి తమ రాజకీయ సత్తాను మరోసారి చాటుకున్నారు. మండల పరిధిలోని మొత్తం 14 గ్రామపంచాయితీలకు గాను 8 గ్రామపంచాయితీల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచు అభ్యర్థులు విజయం సాధించడమే కాకుండా ఆయా గ్రామాల్లోని మెజార్టీ వార్డు సభ్యుల స్థానాలను కూడా కైవసం చేసుకున్నారు. ఈ ఫలితాలతో మండల రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ పట్టు మరింత బలపడినట్లు స్పష్టమైంది.

# పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ
### కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** దేవరకద్ర మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పి.హెచ్.సి ) జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పి.హెచ్.సి ఆవరణ పరిశుభ్రత, రోగులకు అందుతున్న సౌకర్యాలు, గర్భిణీ మహిళల ఆరోగ్య సంరక్షణ పై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రతను మరింత మెరుగుపర్చాలని ఆమె ఆదేశించారు. దేవరకద్ర పి.హెచ్. సి నీ ఒక ఆదర్శ ఆరోగ్య కేంద్రం (మోడల్ పి.హెచ్.సి) గా తీర్చిదిద్దాలని, ఆదేశించారు. గర్భిణీ మహిళలతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు,హిమోగ్లోబిన్ శాతం, నెలనెలా జరుగుతున్న వైద్య పరీక్షల వివరాలు అడిగి తెలుసుకున్నారు. హిమోగ్లోబిన్ తగ్గితే వచ్చే సమస్యలను వివరించి, పోషకాహారం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందుతున్న గుడ్లు, పోషకాహార సక్రమంగా వినియోగించుకోవాలని, ప్రతి నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలని గర్భిణీ మహిళలకు సూచించారు. అక్కడున్న వైద్య అధికారి (మెడికల్ ఆఫీసర్)తో మాట్లాడి ప్రతి నెల పి.హెచ్.సి లో జరుగుతున్న డెలివరీల సంఖ్య, ప్రతిరోజు ఎంత మంది అవుట్ పేషెంట్లు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్నారు, మందుల కొరత ఏమైనా ఉందా, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరం లేబర్ రూమ్ ను పరిశీలించి అక్కడ అందుతున్న సౌకర్యాల పై సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ తో పాటు పి.హెచ్.సి. వైద్య అధికారి డా॥ శరత్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే ఎన్నికలు విజయవంతం
### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/నారాయణపేట:** నారాయణపేట జిల్లాలో నిర్వహించిన గ్రామపంచాయితీ ఎన్నికలు మూడు విడతలుగా పూర్తిగా శాంతియుత వాతావరణంలో ప్రజల అధికారుల సహకారంతో విజయవంతంగా చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ డా.వినీత్ తెలిపారు. ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, పోలీసు విభాగం కర్తవ్యనిష్ఠతో పనిచేయడం ఈ ఎన్నికల విజయానికి ప్రధాన కారణమని తెలిపారు. ఎన్నికల భద్రత కోసం అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, నారాయణపేట జిల్లా సిబ్బందితో పాటు ఇతర జిల్లాల నుండి వచ్చిన సిబ్బందితో సహా అందరి సమన్వయ సహకారంతో విడతల వారీగా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజు నుంచే జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 06 చెక్‌పోస్టుల్లో వాహనాలను క్షుణ్ణమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లో పరిచయం లేని ప్రత్యేక పోలీసు టీములతో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.4, 62,500 నగదు, 730 లీటర్ల విలువైన మద్యం దానం విలువ 4,11,685 రూపాయలు ఉంటుందని, ఇతర విలువైన వస్తువులు చీరలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పిడిఎస్ రైస్ మొత్తం 10,54,000 రూపాయల విలువ గల వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గుట్కాలు 86,039 వివిధ,చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించి ఎలక్షన్, మద్యంకి సంబంధించి 88 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అదనంగా గత ఎన్నికల్లో ఘర్షణలకు కారణమైన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పదవ్యక్తులపైముందస్తు చర్యలుగా 1162 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు.

# మూడు విడతల పంచాయతీ ఎన్నికలు ప్రశాంతం

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా మహబూబ్ నగర్ జిల్లాలో మూడు విడతలుగా నిర్వహించిన గ్రామపంచాయితీ సర్పంచ్ ఎన్నికలు ఎలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలు లేకుండా పూర్తిగా ప్రశాంతంగా, సజావుగా నిర్వహించబడినట్లు జిల్లా ఎస్పీ డి. జానకి తెలిపారు. ఎన్నికల విధుల నిర్వహణకు మొత్తం 1249 మంది పోలీస్ అధికారులు, సిబ్బందిని నియమించి సమర్థవంతమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రతి అధికారి, సిబ్బంది కర్తవ్యనిష్ఠతో విధులు నిర్వర్తించినందుకు జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. అలాగే పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించి ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా తోడ్పడిన జిల్లా వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లవేళలా ఇలాగే సహకరించాలని సూచించారు.

### నగదు, మద్యం స్వాధీనం

ఎన్నికల కోడ్ అమలులో భాగంగా చేపట్టిన తనిఖీలు, నిఘా చర్యలలో రూ. 11,08,250నగదును సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా రూ. 6,93,858 విలువగల మద్యం కేసులకు సంబంధించి 81 ఎక్సైజ్ కేసులు నమోదు చేసి 1050.23 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే రూ. 7,200 విలువగల ఉచితాల పంపిణీకి సంబంధించిన 1 కేసు, 3 ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసులు, 4 మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. భద్రతా చర్యల్లో భాగంగా 70 నాఖాబందీ ఆపరేషన్లు, 37 ఆయుధాల డిపాజిట్, 640 మందిని బైండ్ ఓవర్ చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 3 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన పర్యవేక్షణ కొనసాగించినట్లు జిల్లా ఎస్పీ డి. జానకి తెలిపారు.

## అందరి సమన్వయంతోనే ఎన్నికలు
### కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్‌కర్నూల్ జిల్లాలో అన్నిశాఖల సమన్వయంతోనే మూడువిడతలుగా నిర్వహించిన గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా సమర్థవంతంగా నిర్వహించగలిగామని కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్‌ఛాంబర్‌లో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షణకు కేటాయించిన ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పికి కృతజ్ఞతలు తెలియజేస్తూ అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు శాలువాలతో సన్మానించారు. కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇటీవలే నిర్వహించిన 20 మండలాల్లోని 453 పంచాయతీ ఎన్నికలు అన్నిశాఖల సమన్వయంతో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయఘటనలు లేకుండా విజయవంతంగాముగిశాయని తెలిపారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన అధికారుల కృషి అభినందనీయమని అన్నారు.

# విజయం సాధించిన బిసిలకు కృతజ్ఞతలు




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధించిన బీసీ సర్పంచులకు, ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి , ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో బీసీ సమాజ్ బాధ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా బీసీ భావజాలం గ్రామ గ్రామాన, వాడ వాడలా విస్తరించేలా బీసీ కుల సంఘాలు, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల పోరాటాల ఫలితంగా మూడు విడతల్లో జరిగిన పల్లెపోరులో ఘన విజయం సాధించడంతో పాటు జనరల్ స్థానాలలో 50 శాతానికి పై బడి విజయం సాధించిన బీసీ సర్పంచులకు, వార్డు మెంబర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రభుత్వం బీసీలను మోసం చేస్తూ 42 శాతం ఇస్తామని ప్రకటించి 17 శాతం ఇచ్చిన గురువారం 50 శాతానికి పై బడి గెలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తెనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్దామని ప్రకటించి 17 శాతం తోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించిన ప్రభుత్వానికి ఒక ఆత్మగౌరవ ఉద్యమంగా, తెలంగాణ ముఖచిత్రాన్ని నిర్ణయించే ఎన్నికలుగా భావించిన బీసీలు అత్యధిక స్థానాలు గెలిచి గుణపాఠం చెప్పారన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో బీసీల గెలుపులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో జరగబోవు ఎంపీటీసీ , జడ్పిటిసి ఎన్నికల్లో అన్ని పార్టీలు ఎక్కువ సీట్లు ఇవ్వాలని లేని పక్షంలో సర్పంచ్ ఎన్నికల తరహాలోనే ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో కూడా బీసీలు తమ ప్రతాపాన్ని చూపెట్టి అత్యధిక స్థానాలు గెలుపే ధ్యేయంగా ముందుకు వెళ్లి తమ బలాన్ని అన్ని పార్టీలకు చూపెట్టి బీసీల రాజ్యాధికార దిశగా ముందుకు వెళ్తామని శ్రీనివాస్ సాగర్ అన్నారు. బీసీ సమాజ్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలమూరు వెంకటేష్ గౌడ్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజవర్గ కన్వీనర్ బి. శేఖర్, బీసీ సమాజ్ మహబూబ్ నగర్ నియోజవకర్గ కన్వీనర్ చిట్లపల్లి దుర్గేష్ పాల్గొన్నారు.

# జడ్చర్లలో 108 స్థానాలు గెలిచాం
### ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టీకరణ

**ప్రజాపక్షం/జడ్చర్ల:** సర్పంచ్ ఏ పార్టీకి చెందిన వ్యక్తి అయినా మంచి వాడైతే అయినా మంచి వాడైతే తాము దగ్గరకు తీస్తామని కబ్జాలు చేసి ప్రజల్ని భయపెట్టాలని చూస్తే సహించబోమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికల్లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థులను గ్రామ ఇంచార్జీలుగా చేస్తామని, ఎమ్మెల్యే నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో వారికే ప్రాధాన్యత ఇస్తానని ప్రకటించారు.
పంచాయతీ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో గురువారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించి మీడియా సమావేశంలో అనిరుధ్ రెడ్డి మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా 108 పంచాయతీల్లో కాంగ్రెస్ సర్పంచులు గెలిచారని, వారు కాకుండా గెలిచిన ఇతర సర్పంచుల్లో మరో 35 మంది దాకా కాంగ్రెస్ పార్టీలోకి చేరుతామంటూ తమకు టచ్ లోకి వచ్చారని వెల్లడించారు. 22న సర్పంచులు ప్రమాణ స్వీకారం అనంతరం గెలిచిన సర్పంచులకు సన్మానం చేస్తామని ఆ తర్వాత ఈ విషయాలపై స్పష్టత వస్తుందని చెప్పారు. అయితే చేస్తామని బెదిరించి స్కూలుకు వెళ్లి పసి పిల్లలతో కాళ్లు మొక్కించి ఎమోషనల్ బ్లాక్ మెయిల్ చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ 10శాతం సర్పంచ్ స్థానాలను కూడా నేరుగాగెలుచుకోలేకపోయిందని ఎద్దేవా చేసారు. సర్పంచులు ఏ పార్టీకి చెందిన వారైనా వాళ్లు మంచి వాళ్లయితే వారిని దగ్గరకు తీస్తామని అనిరుధ్ హామీ ఇచ్చారు. అయితే సర్పంచ్ పదవులను అడ్డుపెట్టుకొని భూకబ్జాలు చేయాలని, ప్రజలను భయభ్రాంతులను చేయాలని చూస్తే మాత్రం తాను సహించేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేసారు. ఇప్పటికే కొందరు అలాంటి ప్రయత్నాల్లో ఉన్నారని గత రెండేళ్లుగా ఎలాంటి భూకబ్జాలు జరగకుండా నియోజకవర్గం ప్రశాంతంగా ఉందని, ఈ ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేయాలని ఎవరు చూసినా సహించబోనని పేర్కొన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ఆయా గ్రామాల్లో ఉండే ఇందిరమ్మ కమిటీ సిఫార్సుతోనే మంజూరు అవుతాయని, ఇందులో సర్పంచుల ప్రమేయంఉండదనిఅనిరుధ్‌రెడ్డి చెప్పారు. అయితే ఇప్పటివరకూ తాము నియోజకవర్గంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లలో 40% బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారికే వచ్చాయని, అర్హత ఉన్న వారి విషయంలో తాము రాజకీయ వివక్ష చూపలేదని పేర్కొన్నారు. సర్పంచులు మంచివారైతే వారి సలహాలు కూడా కమిటీ పరిగణలోకి తీసుకుంటాయని తెలిపారు. కాగా పంచాయతీ ఎన్నికలలో ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ నేతలకు ఆయా గ్రామాలకు ఇంచార్జులుగా పెడతామని ఎమ్మెల్యే నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి పనుల మంజూరులో గ్రామ ఇంచార్జులకు ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ వారికి ప్రాముఖ్యత ఇస్తామని చెప్పారు. ప్రస్తుతం ఎస్టీఎఫ్ నిధులు వచ్చాయని, కొత్తగా గెలిచిన సర్పంచులు తమ ప్రమాణ స్వీకారం తర్వాత వచ్చి తమ గ్రామాల్లో తాము ఇచ్చిన హామీల మేరకు ఆయా గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనలు ఇస్తే వాటిని మంజూరు చేయిస్తామని అనిరుధ్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఇచ్చిన హామీలన్నీ తాను ఇచ్చిన హామీలుగానే భావిస్తానని చెప్పారు. పంచాయతీ ఎన్నికలలో వివిధహామీలనుఇచ్చినవారు వాటినికృషి చేశారు.


## ఉపసర్పంచ్‌ల ఎంపిక పూర్తి



**ప్రజాపక్షం/వంగూర్ :** మండలంలో 27 గ్రామ పంచాయతీలకుగాను కొండారెడ్డిపల్లి ఏకగ్రీవం కాగా, 26 గ్రామపంచాయతీలకు ఈనెల 11న ఎన్నికలు జరగడంతో అదే రోజు 18 గ్రామపంచాయతీలఉపసర్పంచులను ఎన్నుకోవడం జరిగింది. మరో ఎనిమిది గ్రామాలలో పెండింగ్‌లో ఉన్నందున గురువారం ఉపసర్పంచ్ ఎంపికను ఆయా గ్రామాలలో ఎన్నికల అధికారుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వంగూరుఉపసర్పంచ్‌గా భాస్కర్ 12వవార్డు, వెంకటాపూర్ కె.వసంత, మూడోవార్డు, అన్నారం దండగుల నారాయణ ఏడోవార్డు, కోనేటిపూర్ దేరంగుల తిరుపతమ్మ రెండోవార్డు, ఉల్లంపల్లి శైలజ రెండోవార్డు, తుమ్మలపల్లి గొడుగు రంజిత్ 8వవార్డు, కోనాపూర్ నూకం సంతోష్ 8వవార్డు సభ్యులను ఉపసర్పంచ్‌లుగా ఎన్నుకోవడం జరిగిందని ఎంపిడిఓ బ్రహ్మచారి పేర్కొన్నారు.

## కల్వకుర్తి మండలంలో..

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలంలోని రఘుపతిపేట, తుర్కలపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్‌ల ఎన్నిక గురువారం పూర్తైంది. రఘుపతిపేట ఉపసర్పంచ్‌గా వడ్డేమాన్ ముత్యాలమ్మ, తుర్కలపల్లి గ్రామ ఉపసర్పంచ్‌గా వి.రామచంద్రమ్మలను ఎన్నుకున్నట్లు మండలపరిషత్ సూపరిండెంట్ యాదయ్య తెలిపారు. మండలంలో 24 గ్రామపంచాయతీలలో 22గ్రామాల ఉపసర్పంచ్‌లను ఇప్పటికే ఎన్నుకున్నారు. మిగిలిపోయిన రెండు గ్రామాల ఉపసర్పంచ్ ఎన్నికలను నిర్వహించి ఉపసర్పంచ్‌లను ప్రకటించడం జరిగిందని తెలిపారు.



## రాజీ మార్గమే - రాజ మార్గం

**ప్రజాపక్షం/వనపర్తి:** కొట్టుకుంటే ఒకరే గెలుస్తారు, రాజీ పడితే ఇద్దరూ గెలుస్తారు.. ఈ నెల 21వ తేదీన జరుగు జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోండి. వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి. ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే అప్పుడే సమసిపోతాయని జిల్లా ఎస్పీ సునితారెడ్డి, ఐపీఎస్ అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 21వ తేదీ వరకు వనపర్తి జిల్లా కోర్టులలో జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులకు పోలీసులు అందుబాటులో ఉంటారని జాతీయ మెగా లోక్ అదాలత్ ఉన్నందున రాజీ పడదగిన కేసులలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు,కుటుంబపరమైననిర్వాహణకేసులు, రోడ్డు ప్రమాదాల కేసులు, చిన్న చిన్న దొంగతనాల కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ కేసులు, బ్యాంకు రికవరీ, టెలిఫోన్ రికవరీలో కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులో మరియు ఇతర రాజీ పడ్డదగిన కేసుల్లో రాజీ పడాలని సూచించారు. రాజీమార్గం రాజమార్గమని కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగొద్దని తెలిపారు.

# గెలిచినా.. ఓడినా అప్పులే మిగిలాయ్

## పెట్టుబడి రాజకీయాల బారిన పడ్డ గ్రామాభివృద్ధి

**జి.మధుగౌడ్/ వనపర్తి ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రంలో సర్పంచ్ ఎన్నికలు ముగిశాయి. గ్రామాల్లో నినాదాలు ఆగిపోయాయి. విజయసంబరాలు కూడా చేశారు. కానీ ఎన్నికల తర్వా త గ్రామాల్లో నెలకొన్న నిశ్శబ్దం ఆనందాన్ని కాదు, ఆం దోళనను ప్రతిబింబిస్తోంది. ఆ నిశ్శబ్దంలో వినిపిస్తుంది. అభివృద్ధి చర్చ కాదు..అప్పులలెక్కలమాట. ఎవరి దగ్గర ఎన్ని డబ్బులు తెచ్చినాము. ఎంత బంగారం తాకట్టు పెట్టినాము, అనే ఆలోచన వెంటాడుతుంది. ఈ ఎన్నికల్లో పో టీ చేసి గెలిచినా ఓడినా అభ్యర్థులందరూ ఇప్పుడు ఒకే మానసిక వేదన ఎదుర్కొంటున్నారు. గెలిచినా ఓడినా ఎన్నికల్లో పెట్టిన పెట్టుబడి భారమే కళ్లకు కనిపిస్తుంది. గ్రామానికి సేవ చేయాలనే ఆశయం వెనక్కి నెగ్గి, పెట్టుబడి ఎలా భరించాలి? అనే మానసిక ప్రశ్నే రాజకీయ చర్చల కేంద్రంగా మారింది. గెలిచిన సర్పంచ్‌లకు పదవి లభించినా, ఆ పదవితో పాటు వచ్చినది ఊరట కాదు. ఎన్నికల్లో పెట్టిన ఖర్చును తిరిగి చెల్లించాలనే ఒత్తిడి గ్రామ పాలనపై మొదటి నీడగా పడుతోంది. అభివృద్ధి ప్రణాళికలు ఆలోచించేలోపే, అప్పులు చేసిన లెక్కలే ముందుకు వస్తున్నాయి. ఫలితంగా గ్రామ అవసరాల కంటే ఆర్థిక ఒత్తిడే నిర్ణయాలను ప్రభావితం చేసే పరిస్థితి ఏర్పడుతోంది. ఓడిపోయిన అభ్యర్థుల పరిస్థితి మరింత బాధాకరం. ఎన్నికల్లో పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడం, అప్పుల ఒత్తిడి, గ్రామంలో తల ఎత్తుకోలేని పరిస్థితి ఇవన్నీ వారిని లోపల నుంచి నలిపేస్తున్నాయి. పోలింగ్‌కంటేముందురోజులు,పోలింగ్ జరిగిన తర్వాత కూడా అభ్యర్థుల దగ్గరకి వెళ్లి డబ్బులు అడిగి తీసుకెళ్లిన సంఘటనలు ప్రతి గ్రామంలో ఉన్నాయి. ఇది రాజకీయ ఓటమి కాదు సామాజిక సంక్షోభం. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుండి ఖమ్మం జిల్లా సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఎన్నికల తర్వాత ఇదే దృశ్యం కనిపిస్తోంది.గ్రామాల్లోఅభివృద్ధి ప్రణాళికల చర్చలు క్రమంగా కనుమరుగవుతున్నాయి. వాటి స్థానంలో అప్పుల చర్చలు, ఖర్చుల లెక్కలే వినిపిస్తున్నాయి. ప్రజలు కూడా గెలిచిన నాయకుడి వద్ద అభివృద్ధిని ప్రశ్నించడానికి సంకోచిస్తారు. ఈ పరిస్థితి వ్యక్తుల వైఫల్యం కాదు. ఇది పెట్టుబడి రాజకీయాల ప్రత్యక్ష ఫలితంగా భావించాలి. ఎన్నికల్లో పెట్టుబడి పెట్టినప్పుడు, ఆ పెట్టుబడికి లాభం రావాలనే ఆలోచన సహజంగా ప్రతి మనిషికి వస్తుంది. ఆ లాభం అభివృద్ధి ద్వారా కాదు లావాదేవీల ద్వారా వచ్చే ప్రమాదమే ఎక్కువ. సర్పంచ్ ఎన్నికలు ముగిసిన తర్వాత గెలిచినవారు, ఓడిన వారు ఇద్దరూ బాధితులైతే, ఈ ఎన్నికల్లో నిజంగా ఓడిపోతున్నది గ్రామాభివృద్దే అనేది నిజం. గ్రామ రాజ్యం అప్పుల భారంతో క్రమంగా క్షీణిస్తోంది. సర్పంచు ఎన్నికలు సేవకు వేదికగా తిరిగి మారాలంటే, ఖర్చుల రాజకీయాలకు ముగింపు పలకాల్సిందే. లేకపోతే ప్రతి ఎన్నిక తర్వాత ఇదే దీనగాథ గెలుపు లేని ఓటమి గ్రామాల మీద, ఆ గ్రామాల అభివృద్ధి మీద ఉంటుంది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని ఒక గ్రామంలో మొత్తం ఓట్లు సుమారు 544 ఉండగా పోలైనవి 499 ఓట్లు. ఈ గ్రామంలో నిలబడిన అభ్యర్థుల ఖర్చు సుమారు 40 లక్షల రూపాయలు అయింది. గ్రామ పంచాయితీ ఎన్నికల వేళ ఎన్నో చిత్ర విచిత్రాలు జరుగుతున్నాయి. వీటన్నింటికి కారణం మితిమీరిన ఎన్నికల వ్యయం. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో ఒక సర్పంచ్ అభ్యర్థి తన ప్రత్యర్థి విపరీతంగా డబ్బులు పంచుతున్నాడని తనకు ఓటమి తప్పదని భావించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ప్రజాస్వామ్యంలో ఎన్నికల పరిస్థితిని కళ్లకు కట్టేలా ఉంది. గ్రామ ప్రజాస్వామ్యం నేడు అప్పుల భారంతో కుంగిపోతుంది. సర్పంచు ఎన్నికల్లో పెరుగుతున్నపెట్టుబడిరాజకీయాలుఅభివృద్ధి ఆలోచనను మూలకు నెట్టేస్తున్నాయి. రాజకీయ నాయకులు, పాలకులు ఈ వాస్తవాన్ని నిర్లక్ష్యం చేస్తే దాని మూల్యం గ్రామాలే చెల్లించాలి.ఎన్నికలఖర్చులపై కఠిన నియంత్రణలు అమలు చేయడం, అక్రమాలకు రాజకీయ రక్షణను పూర్తిగా తొలగించడం,ఖర్చులపై పారదర్శకత తీసుకురావడం తప్పనిసరి కావాలి. రాబోయే ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికలలో మార్పు తెచ్చే దిశగా అధికారులు, పాలకులు చొరవ తీసుకోవాల్సిన తరుణ ఆసన్నమైంది. ఎన్నికలు ముగిశాక గెలిచినవారు, ఓడినవారు ఇద్దరూ బాధితులుగా మారితే, అది ప్రజాస్వామ్యానికి పరాజయం. ఈ పరిస్థితి మారాల్సిందే. మార్పు మాటల్లో కాదు నిర్ణయాల్లో కనిపించాలి. గ్రామ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే, ఈ హెచ్చరికను ఇప్పుడే గంభీరంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## తొగర్రాయి ఉపసర్పంచ్‌గా అమెరబోయిన ఉమామహేశ్వరి శ్రీనివాస్ యాదవ్



**ప్రజాపక్షం/కోదాడ రూరల్:** మండలంలోని తొగర్రాయి గ్రామంలో మొత్తం 12 వార్డులకు 7 వార్డులు బిఆర్ఎస్ సొంతం చేసుకోగా 5వ వార్డు సభ్యురాలుగా విజయం సాధించిన అమెరబోయిన ఉమామహేశ్వరి శ్రీనివాస్ యాదవ్ గ్రామ ఉపసర్పంచ్‌గా ఎన్నికైంది. ఈ సందర్భంగా పలువురు ఆమెను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఉపసర్పంచ్‌గా ఎన్నుకునేందుకు సహకరించిన గ్రామస్తులందరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొంగల లక్ష్మి నారాయణ, బాలెబోయిన వేలాద్రి, గాయం శ్రీనివాస్ రెడ్డి, పూసపాటి రామారావు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## ప్రజాకర్షక సంక్షేమ పథకాలతో కాంగ్రెస్‌పై విశ్వాసం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రజాకర్షణ సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్ల విశ్వాసం పెరిగిందని స్థానిక సంస్థల ఎన్నికలలో అత్యధిక సర్పంచ్ స్థానాలు తమ పార్టీ గెలుచుకుందని చిత్తశుద్ధితో గ్రామాభివృద్ధి కోసం పనిచేయాలని గెలిచిన సర్పంచులకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సూచించారు. ఇటీవల జరిగిన రెండవ దశ స్థానిక సంస్థల ఎన్నికలలో పోచంపల్లి మండలం జగత్‌పల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డ్ నెంబర్లతో కలిసి గురువారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఉప సర్పంచ్ బొబ్బలి జితేందర్ రెడ్డి, వార్డు సభ్యులు కొంత సరళ కిరణ్ గౌడ్, విడుదల భవాని కోటేశ్వర్ గౌడ్ విడుదల భాస్కర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించి కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పాక మల్లేష్ యాదవ్, పోచంపల్లి టౌన్ అధ్యక్షులు భారత లవ కుమార్, మాజీ ఎంపీటీసీ కొట్టం కరుణాకర్ రెడ్డి, బొబ్బల జితేందర్ రెడ్డి, ఇట్టమోని కుమార్ యాదవ్, జగత్ పల్లి సర్పంచ్ ఇట్ట మోని గీతా మహేష్ యాదవ్ ఉన్నారు.

## పరిసరాలు పరిశుభ్రతతోనే ఆరోగ్యం




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రజలు తమ ఇంటి పరిసరాలు, పనిచేసే ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యకరమైన జీవితం పొందగలుగుతారని మున్సిపల్ కమీషనర్ హనుమంతరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమంలో ఆయన విద్యార్థినిలతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత కేవలం మున్సిపాలిటి బాధ్యత మాత్రమే కాదని ప్రతి పౌరుడు, ప్రతి విద్యార్థి తనవంతు బాధ్యతగా భావించి స్వచ్ఛతను పాటించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక బాధ్యతను కూడా అలవర్చుకోవాలని, కళాశాలలు స్వచ్ఛతకు ఆదర్శంగా నిలువాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, మున్సిపల్ సిబ్బందితో కలిసి కళాశాల ప్రాంగణంలో శ్రమదానం చేసి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, శానటరి ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, యేనేపల్లి యాదగిరి, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని స్వచ్ఛత కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పరిశుభ్రత ద్వారా ఆరో గ్యం, క్రమశిక్షణ, బాధ్యతా భావం పెరుగుతాయని అధికారులు పేర్కొన్నారు.

## ఉపాధ్యాయుల జిపిఎఫ్ అకౌంట్లను అప్‌డేట్ చేయాలని వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లా పరిషత్ పరిధిలోని ఉద్యోగుల, ఉపాధ్యాయుల అకౌంట్లను వెంటనే అప్డేట్ చేయాలని ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వివి నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల అకౌంట్లను అప్డేట్ చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వివి అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022/23 ఆర్థిక సంవత్సరం వరకు మాత్రమే అకౌంట్లను అప్డేట్ చేయడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు తమ కుటుంబాల అవసరాల కోసం, పిల్లల చదువులు, వివాహాల తదితర అవసరాల కోసం లోన్లు పెట్టుకుంటే అకౌంట్లు అప్డేట్ కాని కారణంగా తక్కువ మొత్తంలో రుణాలు వస్తున్నాయని తెలిపారు. 202425 ఆర్థిక సంవత్సరం వరకు అకౌంట్‌లను వెంటనే అప్డేట్ చేసి, ఉద్యోగులు తమ జిపిఎఫ్ బ్యాలెన్స్ చూసుకునే విధంగా అవకాశం కల్పించాలని కోరారు. ఈ అంశాలపై జడ్‌పి సిఇఓ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు తొగరు రామయ్య, కస్తూరి కిషన్ ప్రసాద్, నరసింహస్వామి, రామ్మూర్తి పాల్గొన్నారు.

## భవిష్యత్తు గెలుపుకు భువనగిరి నుంచే పునాది!

యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో బిఆర్ఎస్‌కు పూర్వవైభవం ఖాయం : కెటిఆర్

**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గట్టి పునాది వేసిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. అధికారం పోగొట్టుకున్న చోటనే వెతుక్కోవాలి 'ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలి' అన్న పెద్దల మాటను కేటీఆర్ గుర్తు చేస్తూ, సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని, ఈ విజయం పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని కొనియాడారు. అధికారుల అండతో 150కి పైగా గ్రామాల్లో గెలిచిన మన అభ్యర్థులను ఓడించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై కోర్టుల్లో న్యాయ పోరాటం చేస్తాం. అభివృద్ధి ముసుగులో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై విమర్శలు చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజలు మోసపోయామని గ్రహిస్తున్నారని కేటీఆర్ అన్నారు. తులం బంగారం, పెరిగిన పింఛన్లు వంటి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను 'పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్లుంది' అని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, గొంగిడి సునీత, గాదరి కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



# కావాలనే గాంధీ పేరు తొలగింపు

గాంధీ పేరు తొలగింపుపై ఎంపి చామల కిరణ్ రెడ్డి ధ్వజం

పార్లమెంట్‌లో కాంగ్రెస్ నిరసన





**ప్రజాపక్షం/యాదాద్రి భువనగిరి :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం నుండి జాతిపిత మహాత్మా గాంధీ పేరును తొలగించడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన పార్లమెంట్ ఆవరణలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ప్రతి పేదవానికి 100 రోజుల పని గ్యారెంటీ ఉండాలని మహాత్మా గాంధీ పేరుతో ఈ పథకాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. అయితే ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న మోదీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే గాంధీ పేరును తొలగించిందని, ఇది అత్యంత ఖండించదగ్గ విషయమని మండిపడ్డారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 100 శాతం నిధులు ఇచ్చేదని, కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటాను 60:40 శాతానికి మార్చి నిధుల కోత విధించిందని విమర్శించారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఉపయోగపడే విధంగా ఈ చట్టాన్ని తెస్తే, నేటి ప్రభుత్వం దానిని నీరుగార్చేలా వ్యవహరిస్తోందని చామల కిరణ్ రెడ్డి ధ్వజమెత్తారు.

### పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు రూ.14 కోట్లు విడుదల చేయాలి

అంతర్జాతీయ గుర్తింపు పొందిన పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణకు తక్షణమే రూ.14 కోట్ల నిధులను విడుదల చేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్తో పాటు హ్యాండ్లూమ్స్ కమిషనర్ డాక్టర్ బీనా మహాదేవన్‌ను ఎంపీ కలిసి వినతిపత్రం అందజేశారు. పోచంపల్లి ఇక్కత్ హ్యాండ్లూమ్ అభివృద్ధి పథకం కింద ఈ నిధుల అవశ్యకతను ఆయన మంత్రికి వివరించారు. గతంలో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల బకాయిల కారణంగా హ్యాండ్లూమ్ పార్క్ నిర్వీర్యమై వేలానికి వెళ్లిన విషయాన్ని ఎంపీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. అయితే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని నేత కార్మికుల జీవనోపాధిని కాపాడేందుకు పార్కును కొనుగోలు చేసిందని, హ్యాండ్లూమ్ కార్యకలాపాలను పునరుజ్జీవింపజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధుల విడుదల కోసం ఇప్పటికే రాష్ట్ర అధికారులు లేఖ రాసినట్లు ఆయన గుర్తు చేశారు. చారిత్రక వారసత్వం కలిగిన పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ పునరుద్ధరణ ద్వారా స్థానిక నేత కార్మికులకు పెద్ద ఎత్తున ఉపాధి లభిస్తుందని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఎంపీ పేర్కొన్నారు. నేతన్నల హితాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, నిధుల విడుదలపై వేగవంతమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పర్యావరణాన్ని కాపాడుకుందాం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** ఒకసారి వాడి పడవేసే ప్లాస్టిక్‌ను నిషేధించి పర్యావరణాన్ని కాపాడుకుందామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాజెక్టు ఆఫీసర్ కొండూరి సత్తయ్య అన్నారు. గురువారం మండలంలోని ఇస్కిళ్ల ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో పర్యావరణ పరిరక్షణను బాధ్యతతో పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాస్టిక్‌ను వాడకుండా జూట్, కాటన్ బ్యాగ్స్‌ను వాడాలని అన్నారు. చెత్తను కాల్చడం వల్ల వాతావరణం కాలుష్యమవుతుందని, చెత్త వ్యర్థాలు, అమ్మోనియం, కార్బన్ మోనాక్సైడ్, క్లోరోఫ్లోరో కార్బన్స్ వంటి విష వాయువులు వాయు కాలుష్యానికి కారణమవుతున్నాయని అన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సిలివేరు అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పి.నరేందర్, ఎస్.కృష్ణయ్య, ఉపాధ్యాయులు ప్రశాంతి, సుల్తానా, మహేశ్వరి, రామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో జాప్యం చేయొద్దు

రైతులకు మేలు కలిగేలా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/హాలియా(పెద్దవూర) :** నాణ్యత ప్రమాణాలతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె పెద్దవూర మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం కొనుగోలును పరిశీలించారు.17 శాతం తేమతో, తాలు, తరుగు లేకుండా,నాణ్యత ప్రమాణలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, జాప్యం చేయొద్దని, ధాన్యాన్ని తూర్పారబట్టాలని, మంచు కురుస్తున్నందున ధాన్యం మీద పట్టాలు కప్పి ఉంచాలని,ఎప్పటికప్పుడు తేమ శాతం పరిశీలిస్తూ రైతులకు మేలు కలిగేలా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు 107 ధాన్యం లారీలు కొనుగోలు చేశామని, 23,400 కింటాలు సన్నధాన్యం కొన్నామని చెప్పారు. మంచు ఉన్నందున తేమ వచ్చేవరకు ఆరబోసి తేమ వచ్చిన తర్వాత పూర్తి చేస్తామన్నారు. రైతులతో మాట్లాడుతూ ఏమైనా ఇబ్బందులు ఉన్నాయ అని అడిగారు. ధాన్యం కొనుగోలు విషయంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్, పిఎసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి,తహసిల్దార్ శ్రీదేవి,ఎంపీడీవో ఉషాదేవి, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## గొర్ల మందపై దూసుకెళ్లిన బొలెరో వాహనం

11 గొర్రెలు మృత్యువాత

మరో 20 గొర్రెలకు తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/హాలియా:** గొర్రెల మందపై బొలెరో వాహనం దూసుకెల్లడంతో 11 గొర్రెలు మృత్యువాత పడటంతో పాటు మరో20 గొర్రెలకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం తెల్లవారుజామున ఈశ్వర్ నగర్ వద్ద చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాచర్ల ప్రాంతానికి చెందిన సీతాలచ్చయ్య, బొమ్మ కొండలు మరికొంతమంది గొర్రెల కాపరులు గొర్రెలను మేపుకునేందుకు మండల పరిధిలోని ఈశ్వర్ నగర్ వద్దకు చేరుకున్నారు. కాగా గొర్రెల మంద కోదాడ జడ్చర్ల 167వ జాతీయ ప్రధాన రహదారిపై వెళ్తుండగా బొలెరో వాహనం గొర్రెల మందపై దూసుకెల్లడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మరో20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. జీవనోపాధి కోసం వలస వచ్చి గొర్రెలను కోల్పోవడంతో గొర్రెల కాపరులు తీవ్ర ఆవేదన గురవుతున్నారు. గొర్రెలు మృత్యువాత పడటంతో సుమారు రూ.2 లక్షల రూపాయలకు పైగా నష్టం పోయినట్లు రైతులు తెలిపారు. విషయం తెలుసుకున్న గొర్రెల కాపరుల సంఘం అధ్యక్షుడు గొని రాజా రమేష్ యాదవ్ తమ సంఘం సభ్యులతో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.నిర్లక్ష్యంగా నడిపిన బొలెరో వాహనం డ్రైవర్ పై చర్యలు తీసుకుని విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఆయన వెంట సంఘం నాయకులు ఉన్నారు.ఇదే విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

## రాజీ మార్గమే రాజ మార్గం

**ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్లచెరువు) :** డిసెంబర్ 21న జరగనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మేళ్లచెరువు ఎస్ఐ పరమేష్ ఒక ప్రకటనలో కోరారు. రాజీపడడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీపడవచ్చన్నారు. క్షణికావేశంలో చేసిన తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్‌అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అన్నారు. రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులలో కక్షిదారులు రాజీపడవచ్చన్నారు. అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని, రాజీ కుదుర్చుకోవడం ద్వారా ఇరు వర్గాలు గెలుపొందినట్లు అవుతుందన్నారు. ఈనెల 21న ఆదివారం జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కక్షిదారులకు సూచించడం జరిగింది. మండల వ్యాప్తంగా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబరమైన కేసు లు, వైవాహిక జీవితం సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్‌బౌన్స్ వంటి రాజీ కుదుర్చుకోవడానికి సదవకాశం వచ్చిందన్నారు.

# కేంద్ర ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం





**ప్రజాపక్షం/నల్లగొండ:** నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా అక్రమ కేసులతో సోనియా గాంధీ,రాహుల్ గాంధీలను వేధించిన బిజెపి కేంద్ర ప్రభుత్వం కోర్టు తప్పు పట్టడంతో బిజెపి కేంద్రంలో బిజెపి ప్రభుత్వ చేస్తున్నఅరాచకాలకు వ్యతిరేకంగా గురువారం నల్లగొండ జిల్లా బిజెపి కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి డిసిసి అధ్యక్షులు పున్నా కైలాష్ నేత ముట్టడికి వస్తుండగా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి టూ టోన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పున్నా కైలాష్ నేత మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గాంధీ కుటుంబ గౌరవం తగ్గించడం కోసం గాంధీ కుటుంబం పై నేషనల్ హెరాల్డ్ పేరుతో అక్రమ కేసులు పెట్టి గత పది సంవత్సరాలుగా వేదించె ప్రయత్నం చేసింది. మోడీ ప్రభుత్వం పరిపాలించడం చేత కాక ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే ధైర్యం లేక ఇడి సిబిఐ వంటి సంస్థలని ఉపయోగించి ప్రతిపక్షాలని అణచి వేయాలని చూస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌సిసెల్ చైర్మన్ బోడ స్వామి,మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్,మాజీ జెడ్‌పిటిసి మరల చంద్రారెడ్డి,కాశిరెడ్డి నరేష్, ఐఎన్‌టియూసి జిల్లా అధ్యక్షుడు అంబటి సోమన్న,చిరుమర్రి కృష్ణయ్య,కన్నారావు,పోకల దేవదాసు, శ్రీనివాస్,చిలుకూరి బాలు, ముంతాజ్ అలీ,ఎండి ఆరిఫ్ మల్లేష్ గౌడ్ పాల్గొనారు.


**భారత రాజ్యాంగాన్ని మార్చడానికి బిజెపి ప్రయత్నం : నర్సయ్య**

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మార్చడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అన్నారు. నేషనల్ హెరాల్డ్ పత్రిక విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇడి ద్వారా తప్పుడు కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ గురువారం సూర్యాపేట జిల్లా బిజెపి కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వర్‌రావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ వీరన్న నాయక్, నాయకులు అబ్దుల్ రహీం, తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, నాగుల వాసు, బైరు శైలేందర్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో జోష్...

పంచాయతీ ఎన్నికల్లో 339 సర్పంచ్ స్థానాలు కైవసం

122 సర్పంచ్ స్థానాలకే పరిమితమైన బిఆర్ఎస్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో మొత్తం 486 గ్రామ పంచాయితీలు ఉండగా జరిగిన ఎన్నికల్లో 339 కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు సర్పంచ్‌లుగా విజయం సాధించారు. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ అభ్యర్థులు 122 స్థానాల్లో గెలుపొందారు. బిజెపి 05, సిపిఐ 07, సిపిఎం 07, న్యూడెమోక్రసీ 01, స్వతంత్రులు 05 స్థానాల్లో విజయం సాధించారు. ఈ ఫలితాలను పరిశీలిస్తే కాంగ్రెస్ 69.75 శాతం ఉండగా, బిఆర్ఎస్ 25.10 శాతానికి పరిమితమైంది. నియోజక వర్గాల వారీగా చూస్తే సూర్యాపేట నియోజక వర్గంలో 116 గ్రామ పంచాయితీలు ఉండగా 73 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించగా, బిఆర్ఎస్ అభ్యర్థులు 39, బిజెపి 04 స్థానాల్లో గెలుపొందారు. తుంగతుర్తి నియోజక వర్గంలోని ఆరు మండలాల పరిధిలో 104 గ్రామ పంచాయితీలు ఉండగా 61 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు, 34 స్థానాల్లో బిఆర్ఎస్, బిజెపి 01, న్యూడెమోక్రసి 01, సిపిఎం 01, స్వతంత్రులు 05 స్థానాల్లో విజయం సాధించారు. కోదాడ నియోజకవర్గంలో 120 గ్రామ పంచాయితీలు ఉండగా 89 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు, బిఆర్ఎస్ 21, సిపిఐ 05, సిపిఎం 05 స్థానాల్లో గెలుపొందారు. హుజూర్‌నగర్ నియోజక వర్గంలో 146 గ్రామ పంచాయితీలు ఉండగా 116 స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు, 28 బిఆర్ఎస్, 2 సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు.

**కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల్లో ఉనికి కోల్పోయిన బిఆర్ఎస్...**

కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాల్లో బిఆర్ఎస్ తన ఉనికిని కోల్పోయింది. 2023 ఎన్నికలకు ముందు ఆ నియోజక వర్గాలలో బిఆర్ఎస్‌కు మంచి పట్టు ఉండేది. కాని నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత రెండవ సారి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ ఆ నియోజక వర్గాల్లో మరింత పట్టు సాధించింది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ తిరిగి అధికారం చేపట్టిన తరువాత ఆ పరిస్థితి పూర్తిగా మారింది. పంచాయితీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గంలో 75శాతం స్థానాలకు, హుజూర్‌నగర్ నియోజక వర్గంలో 80 శాతం కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. కోదాడ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థులు 17.50 శాతం స్థానాలు, హుజూర్‌నగర్ నియోజక వర్గంలో 19.18 శాతం స్థానాలకు మాత్రానికే పరిమితం కావడం గమనార్హం.

**సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాల్లో కూడా అంతంత మాత్రమే...**

సూర్యాపేట, తుంగతుర్తి నియోజక వర్గాల్లో కూడా బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు అంతంత మాత్రంగానే ఉంది. ఈ రెండు నియోజక వర్గాల్లో అధికార కాంగ్రెస్‌లో వర్గపోరు ఉండడంతో కాస్తో కూస్తో ఆ పార్టీ బలపర్చిన అభ్యర్థులు విజయం సాధించారు. సూర్యాపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు 62.93 శాతం స్థానాలు కాగా బిఆర్ఎస్ 33.62 శాతం స్థానాలు మాత్రమే. తుంగతుర్తి నియోజక వర్గంలో కాం గ్రెస్ బలపర్చిన అభ్యర్థులు 58.65 శాతం స్థానాలు ఉం డగా బిఆర్ఎస్ 32.69 శాతానికే పరిమితం. పంచాయి తీ ఎన్నికల ఫలితాలను చూస్తే రానున్న జడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో కూడా ఇదే వరవడి కొనసాగించే అవకాశాలు లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



# రీల్

## పురుష ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల




కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల సరస్వతి సమర్పణలో బత్తుల కోటేశ్వరరావు 'పురుష' సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ సినిమాకు వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా హీరోయిన్ వైష్ణవి కొక్కుర పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను గమనిస్తే ఆమె పాత్ర ఎలా ఉండబోతోందో అర్థం అవుతోంది. భార్యాభర్తల మధ్య గొడవ, ఒకే ఒరలో రెండు కత్తులు ఉండలేవు అనేట్టు సింబాలిక్‌గా చూపించినట్టు అనిపిస్తోంది. ఇక పోస్టర్లో 'కంటి చూపుతో కాదు కన్నీళ్లతో చంపేస్తా' అనే డైలాగ్ చూస్తుంటే ఈ పాత్ర ఎలా ఉంటుందో అందరికీ అర్థమై ఉంటుంది. మొత్తానికి ఒకరినొకరు అలా సీరియస్‌గా చూసుకుం టూ ఉండటాన్ని గమనిస్తే ఈ చిత్రంలో భార్యాభర్తల పోరు ఏ రేంజ్‌లో చూపిస్తారో అర్థం చేసుకోవచ్చు. ఈ చిత్రంలో వైష్ణవి కొక్కుర, విషిక, హాసిని సుధీర్ కథా నాయికలుగా నటిస్తున్నారు. వెన్నెల కిషోర్, వి.టి.వి.గణేష్, అనంత శ్రీరా మ్, పమ్మి సాయి, మిర్చి కిరణ్ వంటి కమెడియన్స్ అందరినీ కడుపుబ్బా నవ్విస్తారని నిర్మాత బత్తుల కోటేశ్వర్ రావు తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్ను ప్రకటించనున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫర్గా సతీష్ ముత్యాల, సంగీత దర్శకుడుగా శ్రవణ్ భరద్వాజ్, ఎడిటర్గా కోటి, ఆర్ట్ డైరెక్టర్ గా రవిబాబు దొండపాటి పని చేస్తున్నారు.



## మీ అభిమానం ఉన్నంత వరకు నన్ను ఎవరూ ఏమీ చేయలేరు

మంచు మనోజ్ నటిస్తున్న కొత్త సినిమా 'డేవిడ్ రెడి'. ఈ సినిమాను వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్, ట్రూ రాడిక్స్ బ్యానర్స్‌పై వెంకట్ రెడ్డి, భరత్ మోటుకూరి నిర్మిస్తున్నారు. డైరెక్టర్ హనుమ రెడ్డి యక్కంటి రూపొందిస్తున్నారు. బ్రిటీష్ కాలం నాటి బ్యాక్ డ్రాప్‌తో ఇంటెన్స్ యాక్షన్ డ్రామా కథతో భారీ పాన్ ఇండియా చిత్రంగా 'డేవిడ్ రెడ్డి' సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో మారియా ర్యబోషప్క హీరోయిన్‌గా నటిస్తోంది. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడలో ఈ సినిమా రూపొందుతోంది. 'డేవి డ్ రెడ్డి' సినిమా గ్లింప్స్ లాంఛ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాకింగ్ స్టార్ మంచు మనోజ్ మాట్లాడుతూ మీ అభిమానం ఉన్నంత వరకు నన్ను ఎవరూ ఏమీ చేయలేరు. మీరు నాకు ఇన్నేళ్లుగా ఇస్తున్న ప్రేమ, అభిమానానికి పాదాభివందనం. హీరోగా సినిమాలు చేయి అని నన్ను నిత్యం ప్రోత్సహిస్తుంటారు మీరంతా. నేను ఎలాంటి సినిమాతో మళ్లీ హీరోగా రావాలని అనుకుంటున్న టైమ్‌లో నా మిత్రుడు రామ్ ఫోన్ చేసి మంచి కథ ఉంది వినమని అన్నాడు. అదే డేవిడ్ రెడ్డి మూవీ. కథ విన్న వెంటనే నాకు బాగా నచ్చింది. నన్ను ఎలాంటి మూవీలో చూపిస్తే బాగుంటుందో, మీరు నన్ను ఎలాంటి మూవీలో చూడాలని అనుకుంటున్నారో అలాంటి స్టోరీని దర్శకుడు హనుమ రెడీ చేశా రు. 1897 నుంచి 1922 మధ్య కాలంలో జరిగే పీరియాడిక్ యాక్షన్ మూవీ ఇది అని అన్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్ సుప్రీమ్ సుందర్ మాట్లాడుతూ మనోజ్ సినిమాల్లో యాక్షన్‌కు స్పెషల్ ఫ్యాన్స్ ఉంటారు. 'డేవిడ్ రెడ్డి' మంచు మనోజ్‌కు గొప్ప యాక్షన్ మూవీగా పేరు తెస్తుంది అన్నారు. ప్రొడ్యూసర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ మనోజ్‌ని మీరు ఎప్పుడూ చూడని విధంగా ఈ సినిమాలో చూస్తారు. ఇప్పుడు గ్లింప్స్‌లో చూసింది ఒక పర్సెంట్ కూడా కాదు. సినిమా అంత బాగుంటుంది. మా కొత్త టీమ్‌ను నమ్మి సినిమా చేసే అవకాశం ఇచ్చిన మనోజ్‌కి థ్యాంక్స్. డైరెక్టర్ హనుమ నా ఫ్రెండ్. ఒక కసితో ఈ సినిమాను రూపొందించాడు అన్నారు. ప్రొడ్యూసర్ భరత్ మోటుకూరి మాట్లాడుతూ 'డేవిడ్ రెడ్డి' సినిమాను కేవలం మనోజ్ మాత్రమే చేయగలరు. అనేక ఇబ్బందులు పెట్టిన తర్వాత ఒకరి నుంచి పుట్టుకొచ్చే ఆవేశమే ఈ సినిమా. ఆ ఆవేశమే బ్రిటీష్ వారి మీద తిరగబడేలా చేసింది అన్నారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు రవి బస్రూర్, దర్శకుడు హనుమరెడ్డి యక్కంటి పాల్గొన్నారు.




## రాజా సాబ్ నుంచి 'సహన సహన' పాట రిలీజ్

రెబల్ స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ మారుతి, ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కాంబినేషన్‌లో రూపొందుతున్న క్రేజీ మూవీ రాజా సాబ్. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్ గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా రాజా సాబ్‌ను తెరకెక్కిస్తున్నారు దర్శకుడు మారుతి. ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో అన్ కాంప్రమైజ్డ్‌గా నిర్మిస్తున్నారు. నిర్మాత లు టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. సంక్రాంతి సందడిని రెట్టింపు చేసేందుకు జనవరి 9న రాజా సాబ్ సినిమా వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. రాజా సాబ్ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సహన సహన..' రిలీజ్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ మాల్‌లో ఈ సాంగ్ లాంఛ్ ఈవెంట్ రెబల్ ఫ్యాన్స్, ప్రేక్షకుల సందడి మధ్య గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్ మాట్లాడుతూ రాజా సాబ్ మూవీలో సాంగ్స్ సూపర్బ్‌గా వచ్చాయి. ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్‌కు హ్యూజ్ రెస్పాన్స్ ఇచ్చారు. ఇప్పుడు బ్యూటిఫుల్ మెలోడీ సాంగ్ సహన సహన మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఇంకా రెం డు సాంగ్స్ కూడా అదిరిపోతాయి. ముగ్గురు హీరోయిన్స్ కాంబినేషన్‌లో ప్రభాస్ చేసిన సాంగ్, ఆ పాటలో ఆయన చేసిన డ్యాన్సులు అదిరిపోతాయి. జనవరి 8న రాజా సాబ్ ప్రీమియర్స్‌లో మనమంతా కలుద్దాం. మా మూవీకి మీ సపోర్ట్ ఇలాగే అందిస్తూ ఉండండి. అన్నారు. హీరోయిన్ నిధి అగర్వాల్ మాట్లాడుతూ ఇండియాస్ బిగ్గెస్ట్ స్టార్ ప్రభాస్ అభిమానులైన మీ అందరికీ ఈ సినిమా పండుగా లాంటిదని అన్నారు.

## మోహన్‌లాల్‌తో నటించడం జీవితంలో మరచిపోలేను



స్పోర్ట్స్ బ్యాక్డ్రాప్‌లో నిర్మించిన చిత్రం 'ఛాంపియన్'. ఈ చిత్రం డిసెంబర్ 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనస్వర రాజన్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ లాంటి గొప్ప సంస్థ చేస్తున్న సినిమాతో తెలుగుకి రావడం అదృష్టంగా భావిస్తున్నాను. నాకు తెలుగు స్పష్టంగా రాదు. అయినప్పటికీ నన్ను ఎంతో సపోర్ట్ చేశారు. నా పట్ల ఎంతో కేర్ తీసుకున్నారు. వారి నిర్మాణంలో నా తొలి తెలుగు సినిమా రావడం ఎంతో ఆనందంగా వుంది. నిజానికి తెలుగు భాష మీద నాకు పెద్ద అవగాహన లేదు. అయితే చాంపియన్ డైరెక్టర్ ప్రదీప్ అలాగే యూనిట్‌లో అందరూ కూడా నాకు భాష విషయంలో ఎంతగానో సపోర్ట్ చేశారు. వాళ్ల సపోర్ట్ తోనే నేను తెలుగు లో డైలాగ్స్ అంత చక్కగా పలకగలిగాను. ఇక్కడ ఫిలిం మేకర్స్, ప్రొడ్యూసర్స్ చాలా సపోర్ట్‌గా ఉంటారు. ఒక్కసారి ఇక్కడ పనిచేస్తే మళ్లీమళ్లీ తెలుగు సినిమాలే చేయాలనిపిస్తుంది. ఈ సినిమాలోని గిరగిరా సాంగ్‌కి వచ్చిన రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. రోషన్ అద్భుతమైన డాన్సర్. తన నుంచి కొన్ని డాన్సింగ్ మెలకువలు కూడా నేర్చుకున్నాను.ఈ కథ విన్నప్పుడు నాకు చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఇలాంటి కథ ప్రేక్షకుల మనసులో ఎప్పటికీ నిలిచిపోతుంది. ఒక మంచి సినిమాకి ఉండాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఈ సినిమాలో ఉన్నాయి. ఇందులో చంద్రకళ పాత్ర ప్రేక్షకుల మనసులో నిలిచిపోతుంది.నేను మోహన్‌లాల్ కి పెద్ద ఫ్యాన్. ఆయనతో కలిసి నటించే అవకాశం రావడం నిజంగా చాలా గొప్ప అదృష్టం. ఆయనతో నటించడం అనేది ఒక లైఫ్ టైం మెమరీ.అలాగే రేఖా చిత్రం సినిమా చేయడం కూడా వెరీ మెమొరబుల్. ఎప్పటికీ గుర్తుండిపోయే క్యారెక్టర్ అది. ఆ సినిమా సమయంలో మమ్ముటీతో ఆటోగ్రాఫ్ తీసుకోవడం కూడా ఫ్యాన్ గర్ల్ మూమెంట్. నిజానికి నాకు వింటేజ్ పీరియడ్ సినిమాలు చేయడం అంటే చాలా ఇష్టం. చంద్రకళ క్యారెక్టర్ కోసం రెడీ అవ్వడం నాకు ఎంతగానో నచ్చింది.హైదరాబాద్ ఫుడ్ చాలా నచ్చింది. ఇట్లు మీ అర్జున చేస్తున్నాను. నిజానికి ఛాంపియన్ కంటే ముందే సైన్ చేసిన సినిమా అది. కాకపోతే ఛాంపియన్ ముందుగా రిలీజ్ అవుతుంది.

## అడివిశేష తాజా చిత్రం 'డెకాయిట్'



అడివి శేష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్'. షానియల్ డియో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. మృణాల్ ఠాకూర్ హీరోయిన్. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. గురువారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ప్రేమ, దోపిడీ ఈ రెండు ప్రధాన అంశాల చుట్టూ కథనంతో సాగే సినిమా ఇది. టీజర్‌లో సినిమాటోగ్రాఫర్ దనుష్ భాస్కర్ విజువల్స్ అద్భుతంగా వున్నాయి. యాక్షన్ సన్నివేశాలు చాలా గ్రాండ్‌గా ప్రజెంట్ చేశారు. జ్ఞానీ ఇంటెన్స్ స్కోర్ టీజర్‌లో ఉత్సాహాన్ని నింపుతుంది. బిజిఎంలో ఐకానిక్ సాంగ్ 'కన్నె పిట్టరో కన్ను కొట్టరో' పాటను రీమిక్స్ చేసి పెట్టారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో ఈ చిత్రాన్ని సుప్రియా యార్లగడ్డ నిర్మించగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 19, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. టీజర్ లాంచ్ ఈవెంట్ లో హీరో అడివి శేష్ మాట్లాడుతూ ఇది చాలా బిగ్ ఫిలిం. రెండు భాషల్లో తీశాం .ఇది ప్రాపర్ తెలుగు, హిందీ సినిమా. ఒక తెలుగోడు ఒక హిందీవోడు కలిసి చేసిన సినిమా. నేను షానియల్ కలిసి రాశాము. తను నా బెస్ట్ ఫ్రెండ్. మేమిద్దరం యుఎస్‌లో పెరిగాం. తను మన కల్చర్ అర్థం చేసుకొని నేను తన కల్చర్ అర్థం చేసుకుని ఒక హైబ్రిడ్ సినిమా చేశాం. తను టెక్నికల్ ఒక అమెరికన్ స్టైల్ లో తీశాడు. అనురాగ్ లాంటి వరల్డ్ క్లాసు ఫిలిం మేకర్‌తో ప నిచేయడం చాలా మంచి ఎక్స్‌పీరియన్స్. ఆయన మాకు ఎం తో మంచి గైడెన్స్ ఇచ్చారు. నిజంగా అది మా అదృష్టం. మృణాల్ అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. ఇదంతా జరగడానికి మోస్ట్ ఇంపార్టెంట్ రీజన్ సుప్రియ. ఈ సినిమా ఇంటర్నేషనల్ స్టాండరడ్స్‌లో వచ్చిందంటే కారణం సుప్రియ అని చెప్పారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ కశ్యప్, హీరోయిన్ మృణాల్ ఠాకూర్, డైరెక్టర్ షానియల్ డియో , ఎడిటర్ పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు

## దిల్ రాజు 59 సినిమా ప్రోమో రిలీజ్



స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ లో నటిస్తున్న క్రేజీ మూవీ 59. సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్స్ దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి కిరణ్ కోలా ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ యాక్షన్ డ్రామా నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ ఈ నెల 22న సాయంత్రం 7.29 నిమిషాలకు రిలీజ్ చేయబోతున్నారు. 'ఒక మనిషి గురించి ఎప్పటినుంచో ఈ కథ చెప్పాలనుకుంటున్నా, నా జ్ఞాపకాల్లో అతను ఉన్నాడు, చిన్నప్పటి నుంచి అతన్ని చూస్తూ పెరిగా, అతన్ని ఎంత ప్రేమించానో అంతే ద్వేషించాను. అతనిది అందరికీ చెప్పాల్సిన కథ. మీకు కూడా అతన్ని పరిచయం చేస్తాను..' అంటూ రిలీజ్ చేసిన డైరెక్టర్స్ నోట్ ప్రోమో ఆకట్టుకుంటోంది. రక్తం కారుతున్న హీరో విజయ్ దేవరకొండ హ్యాండ్ చూపిస్తూ ఈ ప్రోమోను ముగించడం ఆసక్తి కలిగిస్తోంది.

## అంబేద్కర్ విగ్రహం వద్ద లైవ్ బ్యాండ్ ప్రదర్శన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆల్ ఇండియా పోలీస్ బ్యాండ్ పోటీలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) ఆధ్వర్యంలో మౌలా–అలీ, హైదరాబాద్‌లోని ఆర్‌పిఎఫ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 16 నుంచి 20 వరకు ఈ పోటీలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం హైదరాబాద్ నగరంలోని ప్రసాద్ ఐమ్యాక్స్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అస్సాం రైఫిల్స్, మహారాష్ట్ర పోలీస్ బ్యాండ్ బృందాలు ప్రత్యేకంగా లైవ్ బ్యాండ డిస్ప్లే నిర్వహించాయి. తమ సంప్రదాయాలు, సంగీత నైపుణ్యాలను ప్రతిబింబించేలా ఈ బృందాలు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, సంప్రదాయ సంగీత కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి కర్ణాటకకు చెందిన పద్మావతి విద్యార్థక్ సంస్థకు చెందిన సుమారు 200 మంది పాఠశాల విద్యార్థులు, తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని సెయింట్ స్టీఫెన్స్ హైస్కూల్ విద్యార్థులు హాజరై, బ్యాండ్ సంగీతాన్ని ఆస్వాదించారు. మొత్తం మీద 400 నుంచి 500 మందివరకు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఉత్సాహంగా వీక్షించారు. ఈ సందర్భంగా పలు ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరై బ్యాండ ప్రదర్శనను తిలకించారు. వారిలో మిస్ ఆరోమా సింగ్ ఠాకూర్, ఐజీ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్, అదనపు పోలీస్ కమిషనర్ స్థాయి డిఐజితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నా రు. ఈ లైవ్ బ్యాండ్ ప్రదర్శన నగరవాసులకు వినోదాన్ని అందించడమే కా కుండా, దేశభక్తి భావాలను మరింత బలపరిచిందని పలువురు అభిప్రాయపడ్డారు.

## '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ'తో రాష్ట్రంలోని పర్యాటక రహస్యాలు వెలుగులోకి

### టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండి వల్లూరి క్రాంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలోని తెలియని పర్యాటక ప్రాంతాలను దేశం మొత్తానికి పరిచయం చేయడమే లక్ష్యంగా '100 వీకెండ వండర్స్ ఆఫ్ తెలంగాణ' అనే ప్రత్యేక కాంటెస్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిటిడిసి) ఎండి వల్లూరి క్రాంతి తెలిపారు. హైదరాబాద్ ప్లాజా హోటల్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కాంటెస్ట్‌కు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. తెలంగాణలో అద్భుతమైన ప్రకృతి సౌందర్యం, చారిత్రక కట్టడాలు, అడవి ప్రాంతాలు, జలపాతాలు, గిరిజన సంస్కృతి, గ్రామీణ పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, అయితే వాటిలో చాలా ఇప్పటికీ విస్తృతంగా ప్రచారం పొందలేదని అన్నారు. ఈ లోటును భర్తీ చేయడానికే '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' కాంటెస్ట్‌ను రూపకల్పన చేసినట్లు వెల్లడించారు. ఈ పోటీలో రాష్ట్ర ప్రజలు, ఫోటోగ్రాఫర్లు, ట్రావెల్ బ్లాగర్లు, యువత తమ వీకెండ్ ప్రయాణాల్లో చూసిన ప్రత్యేక ప్రాంతాల ఫోటోలు, వీడియోలు, కథనాలను పంపవచ్చని తెలిపారు. ఎంపికైన 100 ప్రాంతాలను రాష్ట్ర టూరిజం అధికారిక ప్రచారంలో భాగం చేస్తామని చెప్పారు. పాల్గొనేవారికి స్పష్టమైన మార్గదర్శకాలు, టైమ్‌లైన్లు, ఆకర్షణీయమైన బహుమతులు ఉంటాయని, విజేతలకు నగదు బహుమతులతో పాటు రాష్ట్ర టూరిజం ప్రచార వేదికలపై గుర్తింపు కల్పిస్తామని వల్లూరి క్రాంతి తెలిపారు. మీడియా ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ అందాలను ప్రపంచానికి చా టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్‌తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## బిసిసిఐ, బాంబే కోర్టు ఆదేశాలు హెచ్‌సిఎ బేఖాతరు

### టి-20 టోర్నమెంట్లు నిర్వహించే హక్కు లేదు : టిసిఎ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ప్రతిపాదించిన జి. వెంకట స్వామి మెమోరియల్ అంతర్‌జిల్లా టి20 లీగ్‌పై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. బిసిసిఐ ఆదేశాలకు ఇది విరుద్ధమని, నిబంధనలకు వ్యతిరేకంగా ఈ లీగ్‌ను నిర్వహిస్తున్నారని టిసిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారెడ్డి , బిసిసిఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఏకసభ్య కమిటి న్యాయమూర్తి నవీన్‌రావు, బిసిసిఐ ఒంబుడ్స్‌మన్ న్యాయమూర్తి అరుణ్‌మిశ్రలకు గురువారం ఫిర్యాదు చేశారు. బిసిసిఐ నియమావళిలోని 38 నిబంధనలను హెచ్‌సిఎ ఉల్లంఘించిందని అందులో పేర్కొన్నారు.హెచ్‌సిఎ ఇదే పేరుతో టోర్నమెంట్‌ను 2018లో నిర్వహించేందుకు ప్రయత్నించగా బిసిసిఐ అడ్డుకుందని తన ఫిర్యాదులో ఆయన గుర్తు చేశారు.జూలై 11, 20 21 నాడు బిసిసిఐ జారీ చేసిన ఆదేశాలు, 21 మార్చి , 2025 బాంబే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను హెచ్‌సిఎ ఉల్లంఘించిందని టిసిఎ ఇచ్చిన ఫిర్యాదులో గురువారెడ్డి పేర్కొన్నారు. ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం లేకుండా, బిసిసిఐ అనుమతిలేకుండా హెచ్‌సిఎ ఈ పోటీలు నిర్వహించడం తగదన్ని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## సేవకుడిగా ఉండండి

(మూడవ పేజీ తరువాయి)

ముందుకు సాగండి అని శిక్షణ పూర్తి చేసిన సివిల్ సర్వీస్ అధికారులకు ఆయన దిశానిర్దేశనం చేశారు. గురువారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఆల్ ఇండియా సర్వీ సెస్, సెంట్రల్ సర్వీ సెస్ అధికారులు 10 వారాల శిక్షణ కోర్సును విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎంసిఆర్‌హెచ్ ఆర్‌డి వైస్ చైర్ పర్సన్ శాంతకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, ప్రతిరోజు కార్యాలయాన్ని వదిలి వెళ్లే ముందు ఆరోజు మీ పని ద్వారా ఎవరి జీవితంలోనైన ఒక మంచి మార్పు, గౌరవాన్ని తీసుకువచ్చిందా ప్రశ్నించుకోండి? అవును అని సమాధానం వస్తే ఆరోజు మీరు ఎంత కఠినపరిస్థితుల్లో విధి నిర్వహణ చేసినా మీరు విజయం సాధించినట్టేనని డిప్యూటీ సిఎం ఉద్బోధించారు. ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా రూపాంతరం చెందాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. ఈ మారుతున్న ప్రపంచంలో మూడు అంశాలు మాత్రం ఎప్పటికీ మారకూడదని అవి చరిత్ర , నమ్మకత్వం, కరుణ , ఇవి మృదువైన విలువలు కావాని ఒక అధికారి సంపాదించగలిగే అత్యంత కఠినమైన ఆస్తులు అని అన్నారు. ఉద్యోగం ప్రారంభ దశలో అధికారం అంటే ప్రాముఖ్యత అని పొరపాటు పడటం సులభం,దయచేసి ఇది గుర్తుంచుకోండన్నారు. ఈ సందర్భంగా వారందరికీ ఉప ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.

### పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్‌గవర్నెన్స్' : మంత్రి శ్రీధర్ బాబు

పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే 'గుడ్‌గవర్నెన్స్' అవుతుందని ఆ దిశగా కృషి చేయాలని అని యువ సివిల్ సర్వెంట్లకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు.ఈ దేశం మీ నుంచి కేవలం పర్ఫెక్షన్ మాత్రమే ఆశించడం లేదు... అంతకంటే ఎక్కువగా మీరు చేసే పనిలో సిన్సియారిటీని కూడా కోరుకుంటోందన్నారు. గవర్నెన్స్ అంటే కేవలం ఫైళ్లు, నిబంధనలు కాదని, అది ప్రజలతో మమేకమయ్యే ఒక మానవీయ బంధమని అన్నారు. అధికారం, హోదా, ప్రోటోకాల్స్ అన్నీ తాత్కాలికమని.. ప్రజల జీవితాల్లో మీరు తీసుకొచ్చే సానుకూల మార్పు మాత్రమే శాశ్వతమని తెలిపారు . నిర్ణయాలు తీసుకునే సమయంలో సమాజంలోని చిట్టచివరి వ్యక్తిని, నిరుపేదల ప్రయోజనాలనూ పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. అప్పుడే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయన్నారు. కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా నిత్యం ప్రజలతో మమేకం కావాలని ఉద్బోధించారు.

## రాష్ట్రానికే హక్కు

(మూడవ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరినే సమర్థిస్తూ, గతంలో ఇచ్చిన ప్రతికూల ఉత్తర్వులను కోర్టు రద్దు చేసిందని రంగారెడ్డి జిల్లా డిఎఫ్ఒ రోహిత్ గోపిడి ఒక ప్రకటనలో తెలిపారు.మూడు రోజుల పాటు సాగిన విచారణ అనంతరం, సర్వే నెం.201/1లో ఉన్న సుమారు 102 ఎకరాల భూమి గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో భాగమేనని, అది రాష్ట్రప్రభుత్వ అటవీ భూమేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. నోటిఫై చేసిన అటవీ భూములపై చాలా ఆలస్యంగా ప్రైవేటు హక్కుల పేరిట దాఖలు చేసే దావాలు చట్టబద్ధంగా లేవని కూడా కోర్టు తేల్చిచెప్పింది.అటవీ భూములు జాతీయ సంపదని ఈ సందర్భంగా కోర్టు మరోసారి గుర్తు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 48ఏ, 51ఏ(జి) ప్రకారం అటవీ భూములను పరిరక్షించడం రాష్ట్ర ప్రభుత్వం యొక్క బాధ్యతని పేర్కొంది. అటవీ శాఖ తీసుకున్న చర్యలు అటవీ చట్టానికి, పర్యావరణ పరిరక్షణ సూత్రాలకు అనుగుణంగానే ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో రిజర్వ్ ఫారెస్ట్ భూములను అక్రమ ఆక్రమణలు, చట్టవిరుద్ధ హక్కుల నుంచి కాపాడే విషయంలో అటవీ శాఖకు మరింత బలం చేకూరింది. అటవీ సంరక్షణ, పర్యావరణ సమతుల్యత, సుస్థిర అభివృద్ధి పట్ల తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధతకు ఇది బలమైన మద్దతుగా నిలిచింది. ఈ కేసులో రాష్ట్ర తరఫున సమర్థంగా వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సి.ఎస్. వైద్యనాథన్, జస్టిస్ (రిటైర్డ్ చల్ల కొడండరామ్, అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, అడ్వకేట్ ఆన్ రికార్డ్ కర్ణం శ్రావణ్ కుమార్‌లకు అటవీ శాఖ కృతజ్ఞతలు తెలిపింది. అలాగే జిల్లా అటవీ అధికారులు, డివిజనల్ అటవీ అధికారులు, రేంజ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది అనేక సంవత్సరాలుగా చేసిన నిరంతర కృషి వల్లే ఈ కీలక తీర్పు సాధ్యమైందని పేర్కొంది.

## పండుగొచ్చింది

(మూడవ పేజీ తరువాయి)

మొత్తం 11 రోజుల పాటు ప్రతి రోజు మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 9 గంటల వరకు బుక్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శనకు సుమారు 10 లక్షల నుంచి 15 లక్షల మంది పుస్తక ప్రియులు సందర్శిస్తారని, అందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. 38వ హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు ప్రజాకవి అందెశ్రీ ప్రాంగణంగా నామకరణం చేశామని చెప్పారు. ఈ యేడాది ప్రత్యేకంగా 'పుస్తక స్ఫూర్తి పైలాన్' అనే ఎనిమిది అడుగుల స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్నామని, పుస్తక పఠనాన్ని ప్రజల్లోకి, సాహిత్యకారుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సింబాలిక్‌గా ఈ పైలాన్‌ను నిలుస్తుందని అన్నారు. గౌరవ అతిథులుగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరాం, కె. రామచంద్రమూర్తి, రమా మెల్కొటే, తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా.రియాజ్ ప్రారంభోత్సవ సభలో పాల్గొంటారని తెలిపారు. బుక్ ఫెయిర్ జరిగే 11 రోజుల పాటు ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు బాలోత్సవ కార్యక్రమం, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు భాషా సాంస్కృతిక శాఖ వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు 'పుస్తక స్ఫూర్తి' కార్యక్రమాలు మూడు సెషన్లలో జరుగుతాయని తెలిపారు. మొదటి సెషన్‌లో ప్రముఖుల సందేశాలు, మిగతా రెండు సెషన్లలో పుస్తకం విలువ, ప్రాముఖ్యత, సాహితీవేత్తల ఇష్టమైన పుస్తకాలపై చర్చలు ఉంటాయన్నారు. గత సంవత్సరం 300 మందికి పైగా సాహితీవేత్తలతో ఈ కార్యక్రమం నిర్వహించగా, ఈ సంవత్సరం కూడా అదే విధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుక్ ఫెయిర్ ప్రాంగణంలో పిల్లల కోసం ప్రత్యేకంగా గేమింగ్ జోన్ ఏర్పాటుతో పాటు పెద్దలు విశ్రాంతి తీసుకునేందుకు కుర్చీల ఏర్పాటు చేస్తున్నామని, అలాగే ఫుడ్ కోర్ట్, టాయిలెట్స్ తదితర సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు.

### విద్యార్థులకు ఉచిత ప్రవేశం..

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో ఈ సారి విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉంటుందని, విద్యార్థులు తప్పనిసరిగా ఐడి కార్డు తీసుకురావాలని సూచించారు. జర్నలిస్టులు, ప్రభుత్వ అధికారులు, సాహితీ మిత్రులు, రచయితల కోసం 20 వేల పాసులను కేటాయించినట్లు నిర్వాహకులు తెలిపారు. పుస్తకం గొప్పతనం చాటిచెప్పేందుకు డిసెంబర్ 24న లోయర్ ట్యాంక్ బండ్ నల్లపోచమ్మ ఆలయం నుంచి బుక్ ఫెయిర్ ప్రాంగణం వరకు 'బుక్ వాక్' నిర్వహిస్తున్నామని నిర్వాహకులు వెల్లడించారు.

## కాంగ్రెస్ ర్యాలీ ఉద్రిక్తం

(మూడవ పేజీ తరువాయి)

కార్యకర్తలు నిరసన ర్యాలీని చేపట్టారు. ఈ ర్యాలీని పోలీసులు గాంధీభవన్ గేట్ వద్దే అడ్డుకోవడంతో కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. దీంతో అక్కడే బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ జిందాబాద్..కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ బిజెపికి, ఇడికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ, సోనియా గాంధీ పై బిజెపి అక్రమ కేసు లు పెడుతోందని అగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ కోర్టు లో ఈడి వేసిన చార్జ్‌షీట్ ని కొట్టివేసిందన్నారు. నేషనల్ హెరాల్డ్ పేపర్ స్వాతంత్రం నుండే ఉందన్నారు.. దేశ కోసం ఆస్తులను త్యాగం చేసిన కుటుంబం గాంధీ కుటుంబాన్ని కావాలనే బిజెపి వేధింపులకు గురి చేస్తుందన్నారు. .ఇదే అంశాన్ని మేము ప్రజలోకి తీసుకెళ్లేందుకే శాంతియుతం నిరసన ర్యాలీ చేపట్టామని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జీ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని నేషనల్ హెరాల్డ్ పేపర్ కేసు విషయం లో అదే జరిగిందని, రేపు కూడా అదే జరుగుతుందన్నారు. నేషనల్ హెలర్డ్ పేపర్‌కు సంబంధించి బిజెపి ఏమి తెలియదని పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com